ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాస పత్రిక



* కొప్పర్తి కవిత్వావాహనం - వ్యాసం
* సమ్మె - కథ
* ఫాసిస్టు ధోరణులను ప్రేరేపిస్తున్న 'అపరిచితుడు' - సమీక్ష

276
ఆగస్టు 2005

కవిత

పిలుపు

- పి.ఎస్.నాగరాజు

గాయపడిన ప్రతి ఇంటినుండి
దోసెడు కన్నీటిని తీసుకురా!
పెను ఉప్పెన పుట్టిద్దాం!

భంగపడిన ప్రతిస్వప్నం నుండి
గుప్పెడు కోపాన్ని తీసుకురా!
ప్రభంజనం విరచిద్దాం!

ఛిద్రమైన ప్రతి ఆకాంక్ష నుండి
చిటికెడు జ్వాలను పట్టుకురా!
విశ్వాన్ని పునర్నిర్మిద్దాం!

ఉదయ చలనాల గుణాత్మక పరిణామాలకేసి
రక్త చలనాల కాంతిపుంజాన్ని ప్రసరింపచేద్దాం!

స్పందించే నాడుల ప్రకంపనల్లోంచి
గొంతులన్నీ సంకలనం చేద్దాం!
పాల పుంతల్నీ -వెండి వెలుగుల్నీ
భూగోళం గళధ్రువాల్లోంచి ఆలాపన చేద్దాం!

కనిపించని కుట్రల కొలిమిలో
కాలుతున్న బతుకుల్ని పిల్చుకురా!
ఆయుధాల్ని నిర్మిద్దాం!
శాంతికోసం యుద్ధాన్ని గానం చేద్దాం!!

- 26.06.05

KLVA101M115

ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 29 సంచిక : 1

276

ఆగస్టు, 2005

చందాలు పంపవలసిన చిరునామా :

కొత్తపల్లి రవిబాబు

ప్రధాన సంపాదకుడు, ప్రజాసాహితి

సాహితీసుధ, ఈదర రామయ్య వీధి,

ఐతానగరం, తెనాలి (పోస్టు) - 522 201.

ఫోన్ (08644) 222218

ravibabujs@yahoo.co.in

రచనలు పంపవలసిన చిరునామా:

నిర్మలానంద,

సంపాదకుడు,

ప్రజాసాహితి

1-8-747/11/40

బాగ్‌లింగంపల్లి

హైదరాబాద్- 500 044

e mail : prajasahiti@yahoo.com

అట్టమీద బొమ్మ :

మనీ మోహనరాగం

రెండవ అట్ట :

పిలుపు (కవిత)

- పి.ఎస్.నాగరాజు

మూడవ అట్ట :

వెండి పండుగ

- శ్రీశ్రీ

నాలుగవ అట్ట :

నెమలీక (కవిత)

- కోసూరి రవికుమార్

విడి ప్రతి వెల	రు. 10-00
వ్యక్తులకు సం॥ చందా	రు. 100-00
సంస్థలకు సం॥ చందా	రు.200-00
విదేశాలకు సం॥ చందా	50 డాలర్లు

చందాలు మనియార్డరుగానూ, డి.డి.లు గాను మాత్రమే అంగీకరించబడును. మనియార్డర్లు తెనాలి చిరునామాకు పంపాలి. మనియార్డరు కూపనులో చందా పంపించువారు తమ చిరునామా తెలియజేయాలి.

డి.డి.లపై మేనేజర్. ప్రజాసాహితి, విజయవాడ అని రాయాలి.

ఈ సంచికలో...

- సంపాదకీయం 3
- సమ్మె (కథ) - పి.చంద్ 7
- కొప్పర్తి కవిత్వావాహనం-
  విషాద మోహనం (వ్యాసం) - మేడిపల్లి రవికుమార్ 14
- "తప్పు" రాజకీయాలు (అల్పిక) - ఆదిత్య 24
- ఫాసిస్టు ధోరణులను ప్రేరేపిస్తున్న "అపరిచితుడు" - జగం 25
- యుద్ధంలో మరణిస్తున్న వారి చివరి సందేశం (కవిత)- అనిశెట్టి రజిత 29
- ఆనందం (గల్పిక) - కుప్రిన్ 31
- కొన్ని కొత్త, పాత సాహిత్య సాంస్కృతిక పత్రికలు 33
- బాలసాహితి:
  - సలహాలు(కథ) - కొప్పుల సృజన 35
  - అలసిన పువ్వుల ఆశలు(పాట) - నారా 36
  - చెత్త కుప్పలమధ్య చెదిరిన బాల్యం - సుదర్శన్ చక్రవర్తి 37
- విజ్ఞానశాస్త్ర ధారావాహిక-16
  ప్రాచీన యుగాల్లో శ్రమ విభజన - డా॥కొడవటిగంటి రోహిణీప్రసాద్ 38
- అప్పల్నాయుడి కథలు (సమీక్ష) - అదృష్ట దీపక్ 41
- మార్క్స్; నేటి మనిషి (వ్యాసం) - ఫ్రాన్సిస్ వీన్ 43
- దేశమును ప్రేమించుమన్నా! (గల్పిక) - శారద 46
- కొందరు తెలుగు కథకులను గూర్చిన
  విశ్లేషణాత్మక వ్యాసాలు - అంపశయ్య నవీన్ 47
- ఎవరు విప్లవకారులు? (సుబ్బారావు టాక్స్-16)- చంద్రవంక 50
- ఏడాది పరిపాలన ఏం ఒరగబెట్టింది? (పాట) - పి.ఎస్. 53
- ఫారిన్ కొలాబొరేషన్ (గల్పిక) - కొడవటిగంటి కుటుంబరావు 54
- తొలిపొద్దు తిరుగుబాటు (కవిత) - సి.హెచ్.వి.బృందావనరావు 55
- ప్రజాసాహితి 2005 ప్రత్యేక సంచిక ప్రకటన 56
- ఛాయరాజ్ "దుఖ్ఖేరు" గురించి రెండు మాటలు..!- డా॥ లక్ష్మీనారాయణ భట్టు 58
- సాహిత్య లేఖలు 60
- చైతన్యవాహిని 62
- స్వీకారం 64

Edited, Printed and Published by K.RAVI BABU
at Chaitanya Printers, Vijayawada - 2.
for Co-operative Press, Vijayawada.
Editor : NIRMALANANDA

విద్రోహ సంగీతానికి మనీ మోహన రాగం

భారత ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఒళ్లుమరిచిపోయి నిజాలు మాట్లాడి ఆత్మవంచనలో మోసకారితనంలో ఆరితేరిన రాజకీయ నాయకులకూ, మీడియా ప్రముఖులకూ చాలా ఇబ్బంది కలిగించారు.

1947 ఆగస్టు 15న తెల్లదొరలు తెర వెనుకకు తప్పుకుని నల్లదొరలు వారి స్థానమాక్రమించి బ్రిటీషు సామ్రాజ్యవాదుల పాలనా యంత్రమనే పాదుకలలో తమ కాళ్లను దూర్చిన నాటి నుండి నేటి వరకు పాశ్చాత్య ప్రభువుల వారసత్వాన్నే కొనసాగిస్తున్నామని, అత్యుత్సాహంతో కాదు అతి వినయంతో మన్మోహనుడు మనవి చేసినందుకు, నిజాన్ని కక్కినందుకు కొందరు తప్పపట్టి యాగీ చేస్తున్నారు. ఈ సందర్భంగా కొన్ని చారిత్రక ఘటనల్ని పరిశీలిద్దాం.

"భరతఖండంబొక చక్కని పాడియావు

హిందువులు లేగదూడలై యేడ్చుచుండ...

పితుకుతున్నారు మూతులు బిగియగట్టి"

అని బ్రిటీషువారి దోపిడీ విధానాన్ని చిలకమర్తి వంద సంవత్సరాలనాడు, బిపిన్ చంద్రపాల్ ప్రసంగించిన రాజమండ్రి సభలో అధ్యక్షునిగా బహిర్గతపరిస్తే...నేడు మన్‌మోహనసింగ్‌గారు, పాలు పితకక ముందు, లేగదూడకు ఆవు పొదుగులో తలదూర్చే అవకాశం కల్పించిన తెల్లవారి గడుసరితనాన్ని బహుధా ప్రశంసిస్తూ బ్రిటన్ దేశంలోనే కీర్తి ప్రకటనలు కురిపించి వచ్చారు.

"మాకొద్దీ తెల్లదొరతనమూ, దేవ, మా కొద్దీ తెల్లదొరతనమూ...మా ప్రాణాలను హరియించి మానాలను దోచేటి..." అంటూ గరిమెళ్లలాంటివారు గర్జిస్తూ పాటలు రాసినందుకు జైలుపాలై శిక్షలనుభవించినా దొరల సుపరిపాలనను భావస్వేచ్ఛా గుణాన్ని ప్రశంసిస్తూ ప్రసంగించారు.

"స్వాతంత్ర్యం మా జన్మహక్కు" అన్న తిలక్, **కేసరి** పత్రికలో తన భావాలను వెల్లడి చేసుకున్నందుకు మూడు దఫాలుగా జైలు శిక్షలపాలై చివరికి మాండలే జైలులోనే మరణించారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు, బ్రిటీషు పాలకులను "పులి"తో పోల్చి రాసినందుకు ఆయన్ను మూడు సంవత్సరాలు జైలు పాల్జేసి ఖైదీల కొట్లలో పెంట ఎత్తిపోసే శిక్ష విధించినందుకు-చట్టబద్ధ సుపరిపాలనా వారసత్వాన్ని అందించిన తెల్లదొరలు దయాగుణ సంపన్నులుగా మన్‌మోహన్ వారిని అభివర్ణించారు.

1858లో చివరి మొగలాయీ చక్రవర్తి ప్రథమ భారత సంగ్రామంలో 'పెద్ద తలకాయ' అయిన బహదూర్‌షా జఫర్ నుండి ఆజాదు హిందుఫౌజు విచారణల వరకు (1945) జరిగిన 10 రకాల స్వాతంత్ర్య యోధులపై విచారణలు జరిగిన విధానాన్ని వివరించే పుస్తకం "ట్రయల్స్ ఆఫ్ ఇండిపెండెన్స్" రాసిన బి.ఆర్.అగర్వాల్ తన పుస్తకం ముందుమాటలో ఇలా రాసుకున్నారు-

"నేరారోపణా-విచారణా విధానమూ-అంతిమ ఫలితం-ఇవి పై వాటన్నిటిలో ఒకే విధంగా ఉండటం నాకు ఆశ్చర్యం కలిగించింది" స్వాతంత్ర్య ఆకాంక్షను, వాంఛనూ వ్యక్తీకరించటం, అందుకై కృషి చేయటమే నేరంగా, క్రూరంగా భావించి చట్టబద్ధంగా అణచివేసిన ఘన చరిత్రగల బ్రిటీషు సామ్రాజ్యవాద ప్రభువుల్ని వారే తన్మయులయే విధంగా మన్‌మోహన రాగంతో సమ్మోహితుల్ని గావించి వచ్చారు.

నరక కూపాలను మించిన అండమాన్ 'కాలాపానీ' జైళ్లు, బెంగాల్ టెర్రరిస్టుల వేటలూ, గదర్‌వీరుల ఉరితీతలూ, రౌలట్‌లాంటి నల్లచట్టాలూ, జలియన్ వాలాబాగ్ ఘోరాలూ, బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్‌లాంటి వారి హత్యలూ, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా, నీలిమందు రైతులు, మోప్లా రైతులు, పున్నమి పోరాటాల క్రూర అణచివేతల ద్వారా సుపరిపాలన ఎలా సాగించాలో మనకు నేర్పివెడితే, వాటిని భిక్షగా పొంది కొత్త కొత్త చట్టాల పేర్లతో అమలుపరిచే మహత్తర అవకాశాన్ని అందించిన తెల్ల ప్రభువుల వారసత్వానికి, భారత పాలకులు కాక మరెవరు మురియాలి?

తెలంగాణా, నక్సల్‌బరీ కాలపు పోరాటాల అణచివేతలూ, కాశ్మీరు, నాగా, మిజో జాతుల వాంఛలపై ఇనుపబూట్లూ, రోజువారీ ప్రజల జీవన ఆకాంక్షలను బుగ్గిపాలు చేయటాలూ-బ్రిటీషు వారసత్వంగాక మరేమిటి?

చట్టబద్ధంగా చట్ట విరుద్ధంగా మన దేశీయ సహజ వనరులనూ, శ్రమ సంపదలనూ, మార్కెట్లను కొల్లగొట్టుకుపోయిన వైనాన్ని దాదాభాయి నౌరోజి **(పావర్టీ అండ్ అన్ బ్రిటీష్ రూల్ ఇన్ ఇండియా)**, రమేష్ చంద్ర దత్ **(విక్టోరియా యుగంలో భారత ఆర్థిక చరిత్ర)**లు తమ రచనల ద్వారా బహిర్గతపరిచిన విషయం ఆర్థిక నిపుణుడైన ప్రధానికి తెలియదనుకోగలమా? చేతివృత్తుల విధ్వంసం, భయంకరమైన వలసలూ, పెరిగిపోయిన దారిద్ర్యం, దేశవ్యాపితంగా రేగిన కొనసాగిన కరువు కాటకాలూ, పిట్టల్లా రాలిపోయిన శవాల గుట్టలూ బ్రిటీషు పాలనా దుష్ఫలితాలలో కొన్ని మాత్రమే.

జమీందారీ వ్యవస్థను సృష్టించి, తమకు లొంగిన రాజులనూ, నవాబులనూ రక్షించి, భూస్వామ్యవ్యవస్థ పునాదులపైన బ్రిటీషు సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న దొంగల రాజ్యాన్ని వారి వారసులు తప్ప ఎవరు నెత్తిన పెట్టుకోగలరు? పిట్టలనాకట్టుకోవటానికి నూకలు చల్లిన వాని 'జీవకారుణ్యాన్ని బాహాటంగా ఎవరు పొగడగలరు, వాటాకోరులు తప్ప?

తన వ్యక్తిగత జీవితంలో అలుముకున్న విషాదాన్ని కూడా చెప్పుకోలేని మన్‌మోహనసింగు గారి దురవస్థకు జాలి కలుగుతోంది. తాను పుట్టి పెరిగిన పశ్చిమ

పంజాబు (పాకిస్థాన్) ను 58 సంవత్సరాల తర్వాత కానీ ఆయన తిరిగి దర్శించుకోలేక పోయారు. 1857 నుండి 1947 దాకా పథకం ప్రకారం హిందూ-ముస్లిం విభేదాలను విద్వేషాలుగా మార్చింది బ్రిటీషు పాలకులే. 1905లో రిహార్సల్ లాగా బెంగాల్‌ను విభజించి 1947లో విజయవంతంగా ఉపఖండాన్ని ముక్కలు చేసిన ఘన చరిత్ర కూడా వారిదే. దేశ విభజనకు ముందు మత కలహాలలో మరణించిన పంజాబీలు 5000 మంది అయితే, విభజనానంతరం హతులైన అమాయక హిందు-ముస్లిం, సిక్కు ప్రజానీకం 5 లక్షలమంది. తాము పుట్టిన గ్రామాలను విడిచిపోవాల్సిన దుస్థితి దాపురించినవారిలో ఒక్క పంజాబీలే 1/2 కోటి మంది. మొత్తం 20 లక్షలమంది అమాయక ప్రజానీకం మతవిద్వేషాల మారణ హోమంలో ఆహుతి కాగా, కోటిన్నరమంది తమ తమ నెలవులు వీడి వలసలు పోవాల్సివచ్చింది. మహా ఘనత వహించిన బ్రిటీషు సామ్రాజ్యవాద ప్రభువులరిందించిన ఈ మత విద్వేష వారసత్వాన్ని విభజించి పాలించే నీచతత్వాన్నీ భారత పాలక వర్గ రాజకీయులు-ముఖ్యంగా కాంగ్రెసు, భాజపాలు-ఈనాటికీ అత్యంత భక్తి ప్రపత్తులతో కొనసాగిస్తున్నారు.

బ్రిటీషు సామ్రాజ్యవాదులు మన దేశాన్ని, ప్రజలను ఏ పరిపాలనా యంత్రాంగంతో అయితే చట్టబద్ధంగా అణచి వుంచారో దాన్ని ప్రధాని సుపరిపాలన (గుడ్ గవర్నెన్స్)గా అభివర్ణించాడు. ఇదే పాలనా యంత్రాంగం గురించి జవహర్‌లాల్ నెహ్రూ తన ఆత్మకథలో 1935లో ఏమి రాసుకున్నదీ, అధికారంలో కొచ్చాక 1947లో ఏమి చేసిందీ తెలుసుకుంటేగాని...ఈనాటి మన్మోహనుని ప్రకటనల స్వభావం మన కర్థంగాదు.

"ఇండియన్ సివిల్ సర్వీస్ (ఐ.సి.ఎస్.) ప్రభావం మన పరిపాలనా, ప్రజోపయోగ రంగాలలో ఉన్నంత కాలం నూతన వ్యవస్థను నిర్మించటం సాధ్యంకాదని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను. అందువల్ల నూతన వ్యవస్థను నిర్మించేందుకు నిజమైన కృషి ప్రారంభించే ముందే ఐ.సి.యస్. తదితర సంస్థలు పూర్తిగా అంతర్థానమైపోవటం అత్యవసరమని నేను భావిస్తున్నాను. ప్రస్తుతంలాగా వారికి అత్యధిక జీతాలూ, అలవెన్సులూ భవిష్యత్తులో చెల్లించబడతాయనేది, అసలు అనూహ్యమైన విషయం".

అణచివేతలతో సహా తమ పరిపాలనా నిర్వహణకు పోలీసు, మిలిటరీని, పౌర పాలనకు నిరంకుశాధికార యంత్రాంగాన్ని (బ్యూరోక్రసీని) బ్రిటీషు సామ్రాజ్యవాదులు నిర్మించుకున్నారు. విద్యారంగం ద్వారా తమ ఇంగ్లీషు భాషను ప్రజలపై రుద్ది, తమ మానసపుత్రులనేకాక చదువుకున్న కూలీలను కూడా తయారు చేసుకున్నారు. తమ పాలనా యంత్రాంగం ద్వారానే ఇవన్నీ చేయటం సాధ్యపడింది. అటువంటి యంత్రాంగపు ఆర్థిక, అధికార భారాన్ని వదిలించుకోకుండా నూతన స్వతంత్ర వ్యవస్థ నిర్మాణం సాధ్యంకాదని జవహర్‌లాల్ నెహ్రూ 1935లో అత్యంత స్పష్టంగా చెప్పారు. కానీ 1947లో అధికారం పొందిన పిదప, ఐ.సి.ఎస్. అనే పేరుని ఐ.ఎ.ఎస్.గా మార్చి ఇంకా అనేక రంగాలలో (ఐపిఎస్...ఐఆర్ఎస్...ఐటిఎస మొదలగునవి) బ్రిటీషువారి తరహా నిరంకుశాధికార యంత్రాంగాన్ని కొనసాగించి అభివృద్ధి చేశారు. బ్రిటీషువారు నిర్మించిన మిలిటరీ, పోలీసు, పౌరపాలనా వ్యవస్థలనన్నిటినీ, ఒక్కరికి కూడా

ఎటువంటి శిక్షలూ, హెచ్చరికలూ లేకుండా యథాతథంగా పాలనా యంత్రాంగాన్నంతా కొనసాగించారు. ఈ యంత్రాంగం నాడూ, నేడూ కూడా ప్రధానంగా నిరంకుశమైనది, సంపన్నుల దోపిడీ ప్రయోజనాలకు అనుకూలమైనది, అవినీతిమయమైనదని...ఇన్ని సంవత్సరాల స్వతంత్ర చరిత్రా ప్రజల అనుభవమూ మనకు చాటి చెబుతున్నాయి. దీనినే బ్రిటీషువారందించిన సుపరిపాలనా యంత్రాంగంగా మన్మోహన్ సింగ్ చెబుతున్నారంటే, ఈ దేశానికొచ్చిన స్వాతంత్ర్యపు నిజరూపం మనకు అర్థమవుతుంది.

బ్రిటీషు పాలకుల నిష్పక్ష పాలన (ఫెయిర్ ప్లే)ను గాంధీజీ కూడా మెచ్చుకున్నారనీ, స్వాతంత్ర్య పోరాటం "స్వపరిపాలన కొరకే తప్ప బ్రిటీషువారి సుపరిపాలనకు వ్యతిరేకంగా కాద"నీ మన్మోహన్ సింగ్ చెప్పారు. "సమాన ఫాయిదాలో భారత దేశాన్ని సభ్యునిగా స్వీకరిస్తే బ్రిటీషువారిని ప్రేమించటానికీ, వారి సంతోషాలూ, బాధలూ పంచుకోవటానికీ" అభ్యంతరం ఏమీ లేదని గాంధీజీ చెప్పినట్లు మన్మోహన్ ప్రకటించారు.

"బ్రిటీషు కామన్ వెల్తు"లో సభ్యదేశంగా ఈనాటికీ కొనసాగుతున్న భారతదేశం, తానుగా సమాన హక్కులు గల దేశంగా నిజంగా వ్యవహరించగలుగుతోందా? పూర్వం మలేషియా ప్రజల పోరాటంపై బ్రిటీషు పాలకుల అణచివేతను నిర్ద్వందంగా ఖండించగలిగిందా? ఫిలిప్పైన్స్, కొరియాలలో అమెరికా వారి ఆక్రమణతత్వాన్ని ఎదిరించగలిగిందా? ఈనాడు అమెరికా-బ్రిటీషు సామ్రాజ్యవాదులు ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై జరిపిన దురాక్రమణను కనీసం నోటిమాటగా అయినా నిరసించ గలిగిందా?

ఇరాను-పాకిస్తాను-భారతదేశాల నడుమ గ్యాస్ పైపు లైను నిర్మాణానికి అమెరికావాని అనుమతి ఎందుకు అని. ఈ పాలకులూ, రకరకాల రాజకీయ పక్షాలూ, స్వయంకల్పిత దేశభక్త మేధావులూ అడగ గలుగుతున్నారా? క్యూబా దేశం పట్ల అమెరికావాని దురహంకారాన్ని ప్రశ్నించగలుగుతున్నారా?

ప్రధాని మన్మోహన్‌సింగ్ బ్రిటనులో ఈ నెలలో చేసిన ప్రసంగం; వెంటనే అమెరికాతో సైనిక, అణు విధాన ఒప్పందం; గత 58 ఏళ్లుగా ప్రత్యేకించి అత్యంత నగ్నంగా 15 సంవత్సరాలుగా సాగుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలూ, చర్యలూ భారత పాలకుల దళారీతత్వాన్నే తెలియపరుస్తున్నాయి తప్ప మరేమీ లేదు.

బ్రిటీషువాళ్లకు మన ఇంగ్లీషు అర్థంకాకపోయినా మాది కూడా ఇంగ్లీషే...ఇంగ్లీషు భాష భారతీయకరణమైంది. మాకు లభించిన వారసత్వాలన్నిటిలోకి ఇంగ్లీషు భాషా, వారి విద్యా విధానాలే అతి ప్రాముఖ్యమైనవి అంటూ భాషా బానిసత్వాన్ని కూడా ప్రధాని ప్రదర్శించారు. ఇంగ్లీషుని ఒక భాషగా నేర్చుకోవచ్చు. గానీ, మన జాతీయ భాషల అభివృద్ధిని నిర్లక్ష్యం గావించటం పాలకులకున్న ఈ బానిస బుద్ధి వల్లనే జరిగిందని మనకు మరొకసారి స్పష్టమైంది. సాంస్కృతికాధిపత్యానికి భాషా పెత్తనం ఒక ముఖ్య సాధనమని మన పాలకులు ఎరగనంతటి (తరువాయి 57వ పేజీలో)

కథ

సమ్మె

- పి.చంద్

ఎండలు అగ్గెయి మండుతానయి. అంతకంటె ఎక్కువగా బొగ్గుగని కార్మికులు మండుతాండ్లు. ఒక్కటా రెండా ఎన్ని ఎండ్లకానుండి రగులుతున్నది.ఏదేదో మాయ కాలము దాపురించింది. అరే లేబరోడు బ్రతకవద్దు. వాన్ని రోజుకింతా నంజుకుని తింటాండ్లు. అంతకంటే ఒక్కసారి చంపినా బాగుండేది. పొద్దంతా చిటపట లాడించిన ఎండ సాయంత్రం ఏడు అయినా వడగాలి తగ్గలేదు. దానికి తోడు కంపినోడు సమ్మె చేస్తున్న లేబరోళ్ళను ఎట్లాగైనా అణచాలని నీళ్ళు బందు పెట్టిండు. అదెం అంటె గోదావరిల నీళ్ళు లేవంట, దాంతో తాగెందుకు నీళ్ళ రావట... గీ నీళ్ళు రాక పోవుడు ఒక్క లేబరోనికేనా, గా దొరలకు ఉండదా!

దొరలకంటె జ్ఞాపకము వచ్చింది. దొరలంటె దొరలు కాదు...ఎనకటి నిజాం దారలను మరిపించెటోళ్ళు. ఇంటికాడ ఒళ్ళు తోమేటోడు, బట్టలు ఉతికెటోడు, అంట్లు తోమేటోడు అన్ని పనులు చేయాలి. బాయి కాడ మస్టర్లు వేయించి ఇంటికాడ పనికి పంపించేటోళ్ళు. అదొక్కటేనా, అందిన కాడికి దోచుకునేటోళ్ళు. గాయన ఎవరో బాగానే కై కట్టి పాట రాసిండు...

"చూసేటోడు దొరోడాయే చేసేటోడు కూలోడాయే...కూలోడే కుంగిందురో... దొరోడే ఎదిగిందురో"... ఇంకా చిల్లించుకునే టోళ్ళు...కాని అన్నలు బాయిల మీదికి వచ్చి దొరల అన్యాయం చెల్లదని న్యాయం కోసము మనమంత కలిసికట్టుగుండాలని కుప్పెసిండ్లు.. అదిగో అట్లా బొగ్గుబాయిల నిప్పు రాజేసిండు. ఆ నిప్పు మంట అయింది. ఆ మంట పోరాట జ్వాల అయింది. ఆ జ్వాలలో పుట్టిందే సింగరేణి కార్మిక సమాఖ్య..

దాంతో దొరల కాళ్ళ క్రింద దుమ్ము కంట్లో పడ్డట్టయింది. అణిగి మణికి ఉన్న వాళ్ళే చెమ్మాసు తిరిగే సరికి, హక్కుల కోసము తిరగబడే సరికి, కంపినోడు ఇగ గిట్లయితే లాబములేదని బలగాలను దించిండు. రక రకాల పోలీసులు వచ్చిండ్లు...బారు తుపాకులు ఎకె పార్టిసెవన్ గనుల మీదికి కార్మిక వాడల్ల కవాతు చేస్తున్నాయి. చట్టము లేదు గిట్టము లేదు...అంతా రోతిరి రాజ్యం. అంత తలక్రిందులైంది. మల్లేశన్నను గోదావరి ఖనిల చంపెసినప్పుడు కొంత క్రింద మీదయింది. అటు తరువాత అశోకన్నా శ్రీరాంపూర్‌లో సింహం వోలే పోరాడి నేల కొరిగిండు...ఇక అంత అయిపోయింది. అన్నల పని గోవిందా! అంత మన ఇష్టరాజ్యం అని సర్కారోడు, పోలీసోడు, కంపినోడు, చివరికి దొంగ యూనియనోళ్ళు చంకలు గుద్దుకున్నారు.

"అగో ఆ సమయంలోనే మేనేజుమెంటు వాడు కొత్త ఎత్తులు ఎత్తిండు. స్టాండింగ్ ఆర్డరు మార్చిండు. కార్మికులు కుత్తుకల మీద కత్తి పెట్టిండు. ..కంపెని నష్టాల ఉంది. బిఐఎఫ్ఆర్ క్రిందికి పోయింది...ఇక కంపెని పని అయిపోయింది...నష్టాలల్ల వడ్డది లేబరోళ్ళను తీసెత్తరు..అంటు ప్రచారము మొదలయింది. యూనియనోళ్ళు నిజమే అన్నారు. ఎమో కావచ్చు అనుకున్నారు. నాలాంటి చాల మంది ఖర్చు తగ్గించా లన్నారు...బావుల్లో రక్షణ కరువైంది. ప్రమాదాలు జరిగినవి. సచ్చెటోళ్ళు సచ్చిండ్లు. కాలు రెక్కలు విరిగినోళ్ళకు లెక్కలేదు.

ఏమైతేనేమి కంపిని ఉత్పత్తి పెరిగింది. గత అరేండ్లల్ల ఆరువై శాతము ఉత్పత్తి పెరిగింది".

తలుచుకుంటే మనసంత కలికలి అయితాంది. ఎదో బ్రతుకు ఎల్లక బొగ్గు బాయిలకు వచ్చి పడ్డం. ఎట్లనో అట్లనో కాలము గడుపుకుంటు వచ్చినం. మన పని అయిపోయింది...వాలంటరీ పెట్టుకొని దిగిపోయి మా పెద్దపోరడు రాజేశంను పెట్టిస్తామని రెండేండ్ల క్రింద వాలంటరి పెట్టుకుంటే ఇగో వస్తది ఉద్యోగము ఆగో వస్తాదని ఎండ్లకు ఎండ్ల గడపబట్టే. ఇది వరకు ఏరియాల జరిగె రిక్రూట్‌మెంట్ హెడ్డు అఫీసుకు మళ్ళించే...ఎక్కడ గోదావరిఖని, ఎక్కడి కొత్తగూడెం, ఆడికి ఈడికి కాలుకు బలుపము కట్టుకొని తిర్గితే...ఎమున్నది ఇగో అగో అన్నారు. ఇప్పుడు కాదు అప్పుడు అన్నారు. కూసిండి తింటె గుట్టలైనా తరిగి పోతాయి. ఇక దిగిపోయిన పైసల సంగతి ఎమి లెక్క...క్వాటర్ ఖాలీ చేయలేదని పట్టుపైసలు రాకపోయే...దిగిపోతే పోరనికి ఇస్తామన్న ఉద్యోగము రాకపోయే...పెద్దోని తరువాత పుట్టిన పొల్ల పెండ్లి చేస్తె ఉన్న పైసలు ఊడ్చుక పాయే.

చీచీ లాబం లేదు...ముప్పయి ఎండ్లు పనిచేసి ఎనక్కి తిర్గి చూసుకుంటే ఎమున్నది. ఎప్పటి చిప్ప ఎనుగుల్ల అన్నట్టున్నది.. గీబాయి పనికి రాకముందు లక్సట్టిపేట దగ్గర ఉస్సేన్‌పురాలో మాకు మంచి రాగడి నేల ఉండే. మేమే నల్గురము అన్నదమ్ములము పంచుకుంటె తలో రెండు ఎకరాలు వచ్చినవి.. నల్లరేగడే కాని నీళ్ళు లేక పంటలు సరిగా పండేవి కావు...వర్షము మీద ఆదారము... అదృష్టము కల్సి వస్తే పంట చేతికి వచ్చేది లేకుంటే చేసిన కష్టము మట్లే పోయేది. ఈ భూమిని నమ్ముకుంటే లాబములేదని...బగ్గుబాయిల పనిలకు వచ్చిన...వచ్చి. బాగుపడ్డది లేదు.. ఆంద్రా నుంచి కమ్మవాళ్ళు వచ్చిండు...ఎకరానికి ఐదు వేలు పదివేలు ఉన్నకాడ పాతిక ముప్పయి వేలు పెట్టి కొంటాండ్లు అంటె... అదేందో గాలి మంచిగ వచ్చింది.. దర మంచిగ ఉన్నప్పుడే అమ్ముకోవాలని అందరికి మాయ చేసినట్టు అయింది. చాల మంది భూములు అమ్ముకున్నారు. .వచ్చిన పైసలు ఎటుపోయినయో ఎమో గాని నాల్గు ఎండ్ల తిరగకముందే సరస్వతి కెనాలు వచ్చింది. అడ్డికి పావుసేరుగా అమ్మిన భూములే లక్షల విలువ చేసేటి అయినవి. ఎండ్ల తరబడి, తరతరాలుగా సాగు చేసిన మా భూములు మేము చూస్తుండగానే పరాయి వాళ్ళ చేతుల పడ్డాయి.. కాల్వ వస్తున్న సంగతి కాగితాల మీద ఉన్నప్పుడే తెల్సుకున్న గుంటూరు వాళ్ళు కాల్వల పంటి భూములు కొన్నారు. ఉన్న భూములు పోయి చేతుల డబ్బులు ఖర్చయి పోయి చాల మంది లాగే మా అన్నదమ్ములు కూలోళ్ళు అయిండ్లు. వాళ్ళు అమ్మిన పోలాల్లనే వాళ్ళు కూలీలుగా మారిండ్లు... మంచికో చెడ్డకో అప్పుడు నేను బాయి పనికి వచ్చింది మంచిదే అయింది అన్పించింది. . కాని ఇప్పుడు చూస్తే ఎముంది కాస్త కుడి ఎడమ...బ్రతుకు ఎక్కడికిపోయిన ఒక్కతీర్గనే ఉంది.

"ఎందో గట్ల బీరిపోయినావు.. ఇంట్ల నీళ్ళు లేవు, పోయ్యి రాజేస్తమంటే బొగ్గులు లేవు. నీనిట్లా క్రింద మీదయితాంటే నిమ్మకు నీరెత్తినట్టున్నావు. పోయి ఎక్కడన్న నాల్గు బొగ్గు పెల్లలు పట్టుక రారాదు...ఒక్కదాన్ని ఎక్కడికని చావాలి..." నా భార్య రాజమ్మ అరుచుకుంటు నీళ్ళ కుండ అందుకొని వీది చివర.బాయి కాడికి పోయింది.

"దాన్నేమి తప్పు పట్టెటట్టులేదు... కంపినోడు నీళ్ళు బందు పెట్టిన తరువాత గుక్కెడు గుక్కెడ నీళ్ళకోసము అరిగోస పడాల్సి వస్తాంది. బావులు లోతుకుపోయిన కొద్ది ఊట బావులు ఎండిపోయినవి...ఒక్క కాలని

అనే ఏమున్నది...చుట్టుప్రక్కల చాల గ్రామాల్లో పరిస్థితి అలానే ఉంది...ఓపెన్ కాష్టుల వల్ల లోతైన అండర్ గ్రౌండ్ బావుల వల్ల బావుల్లో నీళ్ళు లేకుంటా అయినవి. ఒకప్పుడు గోదావరి తీరాన నీళ్ళతో బురద బురదైన నేలలిప్పుడు...నీళ్ళ చుక్కలేక పర్రెలు పాసినవి..."

"అది నీళ్ళు తీసుకొని వచ్చేనరికి ఎక్కడైనా నాల్గు బొగ్గు పెళ్ళలు ఎరుక రాకుంటే లొల్లిపెట్టది.. లేచి వీదిలోకి వచ్చాను...సూరిడు కుంకి చాలసేపయినా వెలుతురింకా పోలేదు...సాయంకాలము అంటేసిన బొగ్గు పొయిల నుండి లేచిన పొగలు అక్కడక్కడే మసులుతు ఊపిరి సలుపనివ్వడము లేదు...గీ చీకటి పడేవేల బొగ్గు కోసము ఎక్కడికని పోవాలి...బాయి పనిచేస్తే అక్కడో ఇక్కడో నాల్గు పెల్లలు తీసుకరావటానికి వీలు పడేది....నాతోని పనిచేసిన వెంకటయ్య ఇంటికేసి నడిచాను...

అక్కడ వెంకటయ్య మరో నల్గురు కూచొని ఉన్నారు. అంతా స్ట్రయికు గురించే మాట్లాడుకుంటున్నారు...అంతా తెల్సిన వాళ్ళే..." రావే మల్లన్న. వచ్చి ఇట్లా కూచో "వెంకటయ్య సాదరంగా ఆహ్వానించిండు.. వాళ్ళు కూచున్న మంచానికి ఎదురుగా ఉన్న తుమ్మ మొద్దు మీద వెంకటయ్య ప్రక్కన చతికిలపడ్డ....

"సమ్మె ఎన్ని రోజులు పొద్దట?" అన్నాను ఉండ బట్టలేక

"ఏమో ఏదీ తెలుస్తలేదు..ఇది అప్పుడో తేలే విషయం కాదు..పదిహేను రోజులో నెలో పొద్దీ..." వెంకటయ్య అన్నడు నిరాసక్తంగా.

"మరి డిపెండెంటు వాళ్ళకు ఉద్యోగాలు ఇస్తారటనా" అంటు అడిగాను...నా మనసులో తొలుస్తున్న విషయమది... ఇంకా ఎన్ని రోజులని వేచి చూడాలి.

"అదే పెద్ద సమస్య అయింది... డిపెండెంటు ఉద్యోగాలు ఇవ్వటానికి ఖాలీలు లేవంటాడు...ఇప్పటికే కంపినీ పన్నెండు వందల కొట్లు నష్టములో నడుస్తుందని... నాలుగు వేల మంది కార్మికులు ఎక్కువగా ఉన్నారని...వీళ్ళనే ఎట్లా సర్దుబాటు చేయాల్నో అర్థం కాక చస్తుంటే డిపెండెంటు వాళ్ళకు ఉద్యోగాలు ఇచ్చె పరిస్థితి లేదంటాడు మేనేజు మెంటువాడు". రాజం గొంతు ఆసహనంగా ఉంది. ఎదో తెలియనికోపం అతని గొంతులో ధ్వనించింది.

"అరే వాడు సవాలక్ష చెపుతాండు... నష్టము నష్టమంటాండు... అసలింతకు కంపినికి నష్టము ఎందుకు వస్తాదంటా? శర్మగాడు వచ్చిన కానుంచి గదే మాట అన్నదే అంటాండు... పెపర్ల అదే అంటాండ్లు...టివిల గదే చెప్తాండు. పాడిందే పాడరా పాసు పండ్ల దాసరి అన్నట్లు కరపత్రాలు పంచి పెడ్తాండు.. సరే బిడ్డా నీ వన్నట్టుగా కంపినికి నష్టాలే వస్తానయి. మరి గా నష్టాలు ఎందుకు వస్తానయో చేప్తే బాగుంది. వాడు పాడేది ఒక్కటే పాట, లేబరోడు పనిచేస్తలేదు. వాన్ని మరింత పిండాలి. తడిబట్ట పిండితే కాదు, పొడిబట్ట పిండి నీళ్ళు రాల్చాలని చూస్తాండు. లేబరోడు నష్టానికి ఎట్లా కారణమో చెప్పమను. 1987ల జిపిరావు ఉరుకుడు తరువాత మళ్ళీ ఒక్కన్ని కూడా ప్రెష్‌గా బాయి పనికి తీసుకోలేదు కదా. అప్పుడు లక్షా పదహారువేల మంది ఉన్న కాడ ఇప్పుడు లక్ష మంది అయిండ్లు. అప్పుడు సంవత్సరానికి పదహారు మిలియను టన్నులున్న బొగ్గు ఉత్పత్తి. ఇవ్వాల ముప్పయి మిలియను టన్నులకు పెరిగింది...అంటే దాదాపు రెట్టింపు. లేబరోని జీతాలు పెర్గినాయి అంటాండ్లు. పెరిగిన జీతం వట్టుకొని బజారుకు పోతే ఇది వరకు వచ్చిన సరుకుల్లో సగం కూడా వస్తలేవాయ. . ఈ లెక్కన

జీతాలు పెరిగినట్టా తగ్గినట్టా? జీతాల సంగతి అట్లా ఉండనీయ్. బాయిల తట్ట మేసేటోడికి ముప్పయి ఎండ్లు సర్వీసు చేసినా ఇళ్ళు ఇవ్వకపోయే? అగో గా మల్లన్న సంగతే చూడు" అంటు నా కేసి చూస్తు నారాయణ మళ్ళీ చెప్పుకొచ్చిండు." చేసినన్ని రోజులు సర్వీసు చేసిండు.. కంపినోడు ఓ కొంప ఇవ్వక పోయే... తాగెందుకు నీళ్ళు ఇవ్వకపాయే....ఇప్పుడు దిగిపోయే పిల్లవాన్ని తన పనిల పెట్టేస్తమంటే అసలుకే ఎసరు పెట్టే? మరి అటువంటప్పుడు ఇవ్వాల మల్లయ్యకు జరిగిందే రేవు మనకు జరుగుతది! అసలు మనం ఏమడిగామని, ఉన్న హక్కును అమలు జరుపాలన్నము. అరే ఇదెక్కడి అన్యాయం. బంగారమటునంటి మన భూములను బొగ్గు బావుల క్రింద గుంజుకున్నారు. మన భూముల్లో సంపద ఉండుడు మన పాపం అయిపోయింది. అది పాయే భూములు పోతేపోయినాయి. ఇంటికొక ఉద్యోగమన్న దొరకుతది అను కున్నాము. అదిపోయింది. మెల్లగా డిపెండెంటు ఉద్యోగాన్ని ఊడబెరకడానికి సిద్ధమైండు. మన భూముల్ల పడ్డ బొగ్గుతోని కరెంటు పుట్టిస్తాండు.. కాని మన ఇండ్లల్ల కరెంటు ఉండదు...మన రైతులకు పంట పొలాల్లకు నీరు పెట్టుకోవడానికి సరిపోను కరెంటు ఉండదు. లోవోల్టెజితోని కరెంటు మోటర్లు కాలిపోతుంటే అంతంత మాత్రంగా సాగే వ్యవసాయం కుంటుపడిపోతాంది. మన ఎనక దగా ముందు దగా కుడి ఎడమల దగా దగా...ఇక ఇటువంటప్పుడు మనమిక ఎందుకు ఊకోవాలి. తాడో పేడో తేల్చుకోవాలి... అయ్య కంపినికి నష్టాలు వస్తున్నాయంటండ్లు.. గా నష్టాలకు కార్మికుడు ఎట్లా కారణము. నష్టాలకు కారణము ప్రభుత్వము, అధికార్ల, రాజకీయ నాయకుల అవినీతి కారణము..."నారాయణ గొంతు గర గర లాడింది. "బాయిల గిన్నేండ్లు పనిచేస్తున్న కాని ఇందులో తిరకాసు ఏమిటో అర్థంకాక పాయే అంటు''....రాజం ఆశ్చర్యంగా నొరెల్లబెట్టిండు.

నారాయణ గొంతు మరోసారి కంగు మన్నది.. అవినీతిపరులైన రాజకీయ నాయకులు, అదికారులు తమ జేబులోకి పది పైసలు వస్తానయంటే చాలు కంపినికి, దేశానికి పది రూపాయలు నష్టపరచటానికైన సిద్ధపడుతాండ్లు...

ఈ అవినీతిలో కేంద్ర ప్రభుత్వంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వము కూడా పాలు పంచు కుంటుంది. కంపిని నష్టాలకు అసలు కారణాలను తొలగించకుండా, కష్టపడి పనిచేసే కార్మికులను బాద్యులు చేయటము ఎంత వరకు సమంజసము. మీది అవినీతి పరులైన అధికారులను శిక్షించాల్సిందిపోయి ప్రమోషన్లు ఇచ్చింది ఇదంతా కంపినిని ఉద్ధరించటానికేనా?" కేలి నారాయణ గొంతు అవేశంతో వనికంది.

"ఇదంత చూస్తుంటే దొంగే దొంగ దొంగ అని అరిచినట్టుగా వుంది. నాకేమి అర్థం కావటము లేదు...నారాయణ చెప్పిన చాల విషయాలు నాకు కొత్తగా ఉన్నవి. ఇన్నేండ్లు బాయి పనిచేసినా నాకు ఇవేమి అర్థం కాలేదు. ఏదో యాల్లకింత తిని పని చేసినము తప్ప అసలు కంపినిలో ఏం జరుగుతుందో ఎప్పుడు అంతుపట్టలేదు...యూనియన్ నాయకులు ఈ విషయాలేమి చెప్పేవారు కాదు. ఎదన్నా పని పడి యూనియన్ అఫీసు కాడికిపోతే పలానా పనికి ఇంత ఖర్చు అవుతుంది అంటే అంత ఇచ్చి పని వెల్ల తీసుకునుడు తప్ప మరోకటి తెల్వకపాయే... అందుకే యూనియన్ లీడర్లు లక్షలకు లక్షలు కూడ బెట్టుకున్నారు.."

నారాయణ ఇంకా చెపుతూనే వున్నాడు. కంపినిలో జర్గె పర్మినెంటు పనులను

కాంట్రాక్టర్లతోని చేయించవద్దని చట్టాలుండే. ఇప్పుడు చట్టానికి తూట్లు పొడిచిండ్లు.. దొడ్డి దారిన కంట్రాక్టర్లతోని పర్మినెంటు పనులు చేయిస్తున్నారు...అసలు ఓసిపిల సగం పనులు కంట్రాక్టర్లతోని చేయిస్తున్నారు... పోయిన సంవత్సరము ఓసిపిలో పనిచేసే కంట్రాక్టర్లకు నాల్గు వందల ఎనుబై కోట్లు చెల్లించిండ్లు.. ఇది ఆ సంవత్సరము మొత్తం కార్మికులకు చెల్లించిన జీతాలతో సమానము..అంటే ఏ మేరకు కంపనిలో కంట్రాక్టు పనులు కొనసాగుతున్నవో అర్థం చేసుకో...ఈ కంట్రాక్టర్లకేసి ఇచ్చె టెండర్లలో అవినీతి ఇంత అంతా కాదు...వీరి దగ్గర నుండి కమిషన్లు వసులు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వము గతంలో ఎన్నడు లేనటువంటి అడ్వయిజర్ పోస్టును క్రియేట్‌చేసి, వానికి డైరక్టరు హోదాను కల్పించి తన అవినీతి పనులను నిరాటంకంగా కొనసాగిస్తున్నది. వీటికి తోడు ప్రతి సంవత్సరము కోట్లకు కోట్లు వడ్డీల రూపంలో, రాయల్టీల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరలించుక పోతున్నవి. గత ఆరు సంవత్సరాల కాలములో ఈ విధంగా రెండు వేల కోట్లు కాజేసినవి...ఇదంత కరి మింగిన వెలుక పండులాగా కంపిని గుల్లచేస్తుంటే ఈ అవినీతిని, ఈ అరాచకాన్ని అరికట్టాడానికి ఎటువంటి చర్యలు చేపట్టని మేనేజుమెంటు కార్మికుల మీద ఒంటి కాలి మీద లేస్తున్నది".

నారాయణ మేనేజుమెంటు మోసకారి తనాన్ని కుటిలత్వాన్ని ఒక్కటొక్కటిగా చీల్చివేస్తుంటే నగ్నమైన దోపిడి కళ్ళ ముందు కన్పించ సాగింది. ఆయన మాటలకు అక్కడున్నవారు అశ్చర్యంతో నొరెల్లబెట్టెలా చేసింది. అయన మాటలు ఇంకా వినాలనే ఉంది... కాని ఇంటికాడ అది లొల్లి పెడ్తుందని వచ్చిన పని గుర్తు కొచ్చి లేచాను... వెంకటయ్య బార్య కమలను అడిగి రెండు బొగ్గు పెల్లలు తీసుకొని ఇంటి దారి పట్టాను...మనసు చెదిరిపోయింది....అసలు దొంగ ఎవరు, దొర ఎవరు...ఎవడు దొంగో వాడే ఎదుటి వానికి నీతి వాక్యాలు చెపు తున్నాడు....అంత తల క్రిందుల వ్యవ హరము...న్యాయానికి రోజులు లేవు.. కష్టపడే వానికి రోజులు కావు".

"ఎటుపోతే అటే పోతివి" రాజమ్మ తెలియని కోపంతో రుస రుస లాడింది. తెచ్చిన బొగ్గు పెల్లలు ఇంటి ముందు వేసాను.. చిన్న సుత్తితో బొగ్గు పెల్లను దిబ్బడ దిబ్బడ కొట్టి బొగ్గుపోయి రాజేసింది... గాడమైన పొగ విసురుకున్నది...

"దాన్ని చూస్తాంటే కడుపు తరుకు పోతుంది. ఎటువంటి మనిషి ఎట్లా అయి పోయింది. బొగ్గు బాయిలో పనిచేస్తే నెలకు నెల నెల జీతముతో హాయిగా బ్రతుకొచ్చు అని పెండ్లి అయిన తొలినాల్లలో ఎంత మురిసింది.. బ్రతుకు ఆగమైంది. చీకేసిన బొక్కలా అయింది. వొంట్లో గోరెడు మాంసము లేదు.. కండ్లల్లో ఊపిరి పెట్టుకుని బ్రతుకుతున్నది.. ఇంత చేస్తే చివరికి ఎటు కాకుండా అయింది బ్రతుకు. ఎదిగి వచ్చిన కొడుకు పని పాట లేకుండా తిరుగుతున్నాడు. ఒక్క బిడ్డ పెండ్లి చేసేనరికి ఉన్నది ఊడ్సుకపోయింది. చిన్న పిల్లవాడు కాలేజి చదువులకని పోయిండు...పనిచేసే రెక్కలు అగిపోయే సరికి ఎక్కడిది అక్కడ అగమై పోయింది....అసలు పనిచేసినప్పుడే అంతంత మాత్రంగా నడిచే బ్రతుకు పనిలేకపోయేసరికి మరింత అద్వాన్నం అయింది.

రాజేశం అప్పుడే ఇంట్లోకి వచ్చిండు.. నా ఆలోచన వాని మీదికి మళ్ళింది. వాడీ మద్య ముబావంగా ఉంటున్నాడు... మునపటిలా బడ బడ మాట్లాడటము లేదు అంత తెలిసినట్లుగా అచి తూచి మాట్లాడు తున్నాడు. ఒకప్పటి జులాయితనం

పోయింది. బాధ్యత తెలిసినట్టుగా గౌరవంగా మాట్లాడుతున్నాడు. ఈ చిన్న మార్పు నా దృష్టికి రాకపోలేదు...పని దిగిపోయిన తరువాత బ్రతుకు బారము మీద పడే సరికి కొంత తెల్సి వచ్చినట్టుంది. ఎమైతేనేమి. ఎదో పొరపాటు జరిగింది. రాజేశం పది పస్తు క్లాసులో పాసయినప్పుడే రైటర్ చలపతి కొడుకుతోని ఎక్కడన్నా దూరంగా మంచి కాలేజీల చదివించాల్సి ఉండే...కాని ఎప్పటికి డబ్బులకు కటకటేనాయే...గోదావరిఖని ప్రైవేటు కాలేజీలో ఇంటరు చేసిండు...కాని ఎంట్రెన్స్‌లో రాలేదు... ఆ తర్వాత ఉత్తగ ఉండలేక డిగ్రిలో జయిన్ అయిండు. అంతా గొర్రైదాటుడు పట్టా వచ్చింది కాని దాంతో నాలుక గీసుకోవడానికి కూడా పనికిరాదని తెలిపోయింది. కొన్ని రోజులు జులాయిగా తిర్గిండు... పనిపాట లేని, దారి తెన్నులేని అనేక మంది యువకుల్లాగే రెండేండ్లు గడిపిండు.. ఇక ఇట్లాయితే లాబంలేదు... పిల్లవాడు తెర్లయిపోతడని...దిగిపోయి పని పెట్టిస్తామని, లీడర్ను పట్టుకొని వాలంటరి పెట్టుకున్నా... ఈ విధంగానైనా పిల్లవాన్ని పనిలో పెట్టెస్తే దారికొస్తడనుకున్న...కాని ఏం లాబము.. అది ఎటు కాకుండా అయింది.

జి.యం. ఆఫీసు చుట్టు, కొత్తగూడం హెడ్డు ఫీసు... యూనియన్ ఆఫీసుల చుట్టు తిరుగుడే తిరుగుడు. ఇక్కడ కాదు అక్కడ హెడు ఆఫీసులో అంటడు. అక్కడికిపోతే ఇప్పుడు కాదు వెకన్సిలంటాడు..అయ్యా ఇదేందని యునియన్ నాయకున్ని అడిగితే ఇగో వస్తది అగో వస్తది అంటాడు. తిర్గి తిర్గి ప్రాణం బేజారయింది. రెండేండ్లు గడిచింది. ఎదైనా మిక్కుటానికి రావాలి...ఇట్లా ఉద్యోగాల కోసం తిర్గె వాళ్ళు రెండు వేలు దాటిండ్లు..ఎండ్లకు ఎండ్లు గడిచినా దిగి పోయిన వారికి, బాయిలో చనిపోయిన వారికి, మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి ఉద్యోగాలు రాకపోయేసరికి, అందరికి సెగ తగిలింది. డిపిండెంటు ఉద్యోగాలకు ముప్పు వచ్చిందని అందరికీ తెలిసిపోయింది... లొల్లి ముదిరే రోజు వచ్చింది.

అంత వరదాక అంటి ముట్టనట్టున్న నాయకులు...ఇక మౌనం వహిస్తే లాబం లేదనుకొని అన్ని జాతీయ కార్మిక సంఘాలు ఏకమై సమ్మె నోటీసు ఇచ్చిరి. డిపిండెంటు ఉద్యోగ రక్షనతోపాటు, ఆరవ వేజు బోర్డు పరిష్కారించాలని లేదంటే ఇంటిరియమ్ రిలీపు చెల్లించాలని, అంతకు ముందు వేజు బోర్డులో ఒప్పుకున్న ప్రమోషన్ పాలసిలను అమలు జరుపాలనే తదితర డిమాండ్లతో సమ్మె పిలుపు ఇచ్చినవి... ఏప్రిల్ మొదటి వారంలోనే జరుగాల్సిన సమ్మె మే చివరి వారం దాక పొడిగించిండ్లు. మేనేజుమెంటు దిగిరాలే. మే 25న సమ్మె మొదలయింది.

“మల్లయ్య ఇక నీవేమి రంది పెట్టుకోకు. నీ కొడుక్కి ఉద్యోగము వస్తుంది సమ్మె మొదలయింది కదా! ఈ సమ్మెలో అదే ప్రదానమైన డిమాండ్” అంటు తెల్సినవాళ్ళు చెప్పుకొచ్చిండ్లు.

“దేవుడు చల్లగా చూస్తే అదే నిజం కానియ్. పొల్లగాడు ఓ దార్ల పడ్తడు” అనుకున్నా...

ఎప్పుడు సమ్మె జరిగినా అదిలాబాద్, కరీంనగర్‌జిల్లాలోనే జరిగింది. కాని ఈ సమ్మె ఖమ్మంజిల్లాకు కూడ ప్రాకింది.

డిపిండెంటు ఉద్యోగము అందరికి సంబందించింది. ఎవరు మాత్రము ఊకుంటరు...కాని ఎంత వరకు పోతుందో తెలియటంలేదు.

సమ్మె అంటే మునుపటి తీర్గలేదు..ఇది వరకు సమ్మె జరిగితే, అది మేనేజుమెంటు వ్యవహారంగా వుండేది కాని గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులు సమ్మె చేసినప్పుడల్లా పోలీసులు వ్యాన్లల్ల తిరుక్కంటు ఓపెన్ కాస్టు అపరేటర్లను పట్టుక పోతున్నారు...ఎట్లయినా చేసి ఓపెన్ కాస్టు

లన్నా నడిపించాలని కంపిని పట్టుదల మీదున్నది...వాడల్లో పోలీసుల గస్తి ముమ్మర మైంది.. ఏ రాత్రి ఎవరిని పట్టుకపోతరో తెలియకుండా ఉంది. మేనేజుమెంటు ఏక పక్షంగా కార్మికుల హక్కులను ఒక్కటొక్కటిగా కాలరాస్తుంటే ఏ పోలీసు, ఏ ప్రభుత్వము పట్టించుకోలేదు...కోల్పోయే డిమాండ్లను కాపాడుకోవడానికి కార్మికులు పనిచేయమని చేతులు ముడుచుకుంటే అది నేరమై పోయింది.. వాడు ఎంత దుర్మార్గము చేసినా భరించాలి.

బొగ్గు పొయ్యి అంటుకొని ఎర్రటి నిప్పు కణికలు బగబగ లాడుతున్నాయి. ఇంత వరదాక నల్లటి బండరాయిలాంటి బొగ్గు ముక్కలు నిప్పుపడి రాజుకొని నిప్పు కణికలై, అచ్చంగా సమ్మె చేస్తున్న కార్మికుల్లాగే బగబగలాడుతున్నాయి.

సమ్మె మొదలయివారం రోజులైంది. మరునాడు ఉదయాన గోదావరిఖని పట్టణ మంత అట్టుడికి పోతన్నది. ఎవరి నోట విన్నా అదే మాట సికాస నాయకుడు రామక్రిష్ణన్నను పోలీసులు కాల్చేసిండ్లట. పిల్లర్ అసోసి యేషన్ నాయకులు సత్యనారాయణకు తూటాలు దిగినయట. ఆ వార్త రాత్రే పాక్కింది. కాని ఎవరికి వారే గుసగుస లాడుకున్నారు. అంతా మావురు కమ్మినట్టుగా పాకిపోయింది...చీకటింకా తొలిగిపోక ముందే జూనియర్ కాలేజి గ్రౌండు దిక్కు జనం ప్రవాహంలా కదిలిపోతున్నారు.. ఆ ప్రవాహంలో ఆ ప్రయత్నంగా కలిసి పోయాను...వెంకటయ్య కలిసిందు...మాట పలుకు లేక గంబీరంగా ఉన్నాడు... నారాయణ కండ్లల్ల నీళ్ళూరినయి.. పెదాలను బిగబట్టి దుఃఖము అనుచుకున్నట్టుగా కన్పించిందు.

జనాన్ని దగ్గరికి రాకుండా పోలీసులు గెదుముతాండ్లు.. అయినా జనం తోసుకోస్తాండ్లు....

బంగారమసొంటి కొడుకును పొట్టన పెట్టుకుంటిరి కదరో.. ఎవరో ఎండిపోయిన రొంబొచ్చె కల్గిన ముసల్ది శాపనార్థాలు పెడ్తాంది. పోలీసు అధికారి ఒకడు బట్టతల చిమచిమలాడంగా కొవ్వెక్కిన చెంపలు కమ్మెసిన చిన్న కండ్ల నుండి కోపంగా చూసిందు.. ఆ ముసల్ది అదేమి లెక్క చేయ కుండా పిచ్చిదాని తీర్గ తిట్టిపోస్తాంది...అంత వరదాక పెదాల మాటున కొట్టు మిట్టాడు తున్న భయం భయంగా బెదురుతున్న వాళ్ళు మెల్ల మెల్లగా మాట్లాడుకుంటున్నారు.

"సమ్మె గురించి మాట్లాడటానికి వచ్చిండట"

"సత్యనారాయణ అందుకే వచ్చిండట"

ఎవరికి వారే ముందుకు తోసుకుంటు కాలేజి గ్రౌండులో ఒక మూలపడిపోయిన సికాస నాయకుని కేసి తోసుకొస్తున్నారు. సాయుధ పోలీసులు జనాన్ని అదుపు చేయలేకపోతున్నారు.

"దొంగ దెబ్బ తీసిండ్లు గాడ్ది కొడుకులు"

"ఎదురెదురైతే వీళ్ళ పి...దప్పుడు కొట్టయ్"...

"ఎక్కడో నమ్మకమైన సమాచారమే దొరికింది. లేకుంటే ఇంత పని కాదు"

"బంగారము వంటి ఉద్యోగాన్ని వదిలి ఉద్యమములోకి వచ్చిండట"

"ఆయన వచ్చుడే కాదు ఆయన చెల్లే కూడ ఆర్నెల్ల క్రింద దళంలో పనిచేస్తూ చనిపోయిందట..."

"చెదిరిపోయిన దాన్నింత కుప్పేసిందు.. అగో మల్లి ఓ దారికి వచ్చేసరికి మల్లి కుప్పయిపోయింది". ఎవరో మర్మ గర్భితంగా మాట్లాడుకుంటున్నారు.

పెద్ద పెద్ద పోలీసు ఆఫీసర్లు వచ్చిండ్లు... అంత మామూలు వ్యవహారం గానే ఉంది.

"దొంగలం...కొడుకులంత బాగానే ఉన్నారు..మంచొళ్ళకే కష్టాలు.." ఎవడో పూడుకపోయిన గొంతుతో బిగ్గరగా అరిచిండు.

*

కొప్పర్తి కవిత్వావాహనం-విషాద మోహనం

- డా॥ మేడిపల్లి రవికుమార్

ఈతకొట్టడం తెలిస్తే ఎక్కడైనా ఈదవచ్చు. లోతు సమస్యకాదు. గీత గీయడం తెలిస్తే మసిబొగ్గుతోనూ కళాఖండం సృష్టించవచ్చు. రంగు సమస్య కాదు. రాత రాయడం తెలిస్తే ఏ అక్షరంతోటైనా మానవ హృదయాన్ని తాకవచ్చు. సందర్భం సమస్య కాదు. అయితే, ఎక్కడ ఈతకొట్టాలన్నది అవసరం. ఏ కళా సృష్టి చేయాలన్నది ముఖ్యం. ఏ హృదయాన్ని స్పృశించాలన్నది ప్రధానం. దీన్ని నిర్ణయించుకోడానికి కేవలం సృజన శక్తి మాత్రం చాలదు. స్పష్టమైన, మౌలికమైన తాత్విక దృష్టి కూడా అవసరం. పుష్కలమైన సృజన శక్తికి కొంత తాత్విక దృష్టిజోడించి అక్షరాల్ని కవితా ఖండికలుగా చెక్కిన అక్షరశిల్పి-కొప్పర్తి. ఇటీవల ప్రకటించిన 'విషాద మోహనం' కావ్య కళా ప్రాంగణంలోకి దృష్టిపెడితే చాలు, కొప్పర్తి గానం చేసిన విషాద మోహన రాగాలాపన ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

కవి అంటే ఎవరో, అతని ప్రాపంచిక దృక్పథం ఈనాడు ఎంత విస్తృతంగా ఉండాలో స్పష్టంగా తెలిసిన కవి కొప్పర్తి. కవిత్వ నిర్మాణంలో ఏ అక్షరాన్ని ఎక్కడ పొదగాలో ఆ రహస్యం కనుగొన్నకవి కొప్పర్తి. కవిగా కొప్పర్తి స్థానాన్ని అంచనా వేయడానికి విషాద మోహనంలోని చాలా ఖండికలు నిలువెత్తు సాక్ష్యాలు.

తనదైన దృక్పథంతో కలం చేతపట్టుకొని సాహిత్యరంగం మీదికి అడుగుపెట్టినపుడు తానెవరో పరిచయం చేసుకోవడం ప్రతి కవికీ ఒక ప్రాథమిక అవసరం. కొప్పర్తి కూడా 'రంగుల కల' అనే ఖండికలో తానెవరో పరిచయం చేసుకున్నాడు.

"నాలుగు దిక్కుల మధ్య నన్నెవరూ
బంధించి ఉంచలేరు.
నేను కవిని అనంతాన్ని
గుండె ఉన్న వాణ్ణి
చెమ్మ ఉన్న వాణ్ణి
ప్రశ్నల్ని మొలిపిస్తున్న వాణ్ణి
జవాబులు రచిస్తున్న వాణ్ణి" (పు.52-54)

అని చెప్పి, తనను ఆకాశంతోనూ, సముద్రం తోనూ కూడా, కవి పోల్చుకున్నాడు. నాలుగు దిక్కుల మధ్య బంధించబడని తన విశాల దృక్పథాన్ని ప్రకటించుకున్నాడు. తనకెవరూ ఇతివృత్తాన్ని నిర్దేశించలేరనీ, దారి తప్పిన భూగోళమే తన వృత్తమనీ చాటుకున్నాడు. ఈ ఖండికలోని నాలుగు దిక్కులు నాలుగు వర్ణాలను సూచిస్తున్నాయి. భూగోళం వాస్తవికతకీ, ప్రజా జీవితానికీ ప్రతీక. ఇన్నాళ్ళ కవిత్వంలో ఈ భూగోళం లేదు. అది 'ఖగోళాల గందరగోళంలో దారి తప్పింది'. ఈ కవికి ఇతివృత్తం వర్తమాన ప్రజా జీవితమే. కవికి ఉన్న గుండె సాహానుభూతికీ, చెమ్మ ఆర్ద్రతకూ చిహ్నాలు. ఈ కొలమానాల ప్రాతిపదికతోనే కవి తన అన్వేషణ ప్రారంభించాడు.

అక్షరంలో ఉండే శక్తి ఎంతటిదో కొప్పర్తికి బాగా తెలును. 'పునరాగమనం' అనే ఖండికలో ఈ విషయాన్ని వాచ్యం చేశాడు.

"అక్షరాల్ని కూడ బలుక్కుని
కుప్పగా పోసుకుంటున్నప్పుడు
చెల్లా చెదురైన మెతుకుల్ని ఏరుకుని
ఒక అన్నం ముద్దను
చేసుకుంటున్నట్టుగా ఉంది"- (పు.59)

చెల్లాచెదురుగా ఉన్న ఒక్కొక్క మెతుకు

ఏ ఒక్కరినీ బతికించలేదు. అది అన్నం ముద్దగా మారినపుడు ఎవరికైనా జీవం పోస్తుంది. విడివిడిగా ఉన్న అక్షరాల్ని కుప్పగా పోసినపుడు అన్నం ముద్దలోని జీవశక్తి అక్షరాల కుప్పలోకి ప్రవహిస్తుంది. అయితే ఆ అక్షరాల్ని కుప్పగా పోయగల శిల్ప రహస్యం కవికి తెలిసి ఉండాలి. అది కొప్పర్తికి బాగా తెలుసు. 'ఒక కెథార్సిస్ కోసం' అనే ఖండిక ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

"రాసేటప్పుడు
కాగితం మీద కలం నాగేటి చాళ్ళని సృష్టిస్తుంది
చేతివేళ్ళల్లోంచి జీవశక్తి అక్షరాల్లోకి ప్రవహిస్తుంది
రాసిం తర్వాత
పదాల బోగీలతో వాక్యం రైలుకూత వేసుకుంటూ వెళిపోతుంది
ధ్వని మాత్రం వాతావరణమంతా అలుముకుంటుంది
... ...
రాస్తే తడి ఆరని అక్షరాల్నే రాయాలి
ఎప్పుడో వచ్చే ఒక్క శాశ్వత వాక్యం కోసం
జీవితమంతా రాయాలి"- (పు.13-14)

అని కొప్పర్తి నిర్ణయించుకున్నాడు. మామూలు గీత అక్షరంగా మారితే; కళగా, కవిత్వంగా రూపొందితే అది శక్తివంత మౌతుంది. ఆ అక్షరం ఎలా ఉండాలో కవికి బాగా తెలుసు. అందుకే 'విషాద మోహనం' కావ్యం నిండా తడిఆరని ఈ అక్షరాల కుప్పలే కుప్పలు తెప్పలుగా కన్పిస్తాయి. ఆ కుప్పల్లో ఎప్పుడో వస్తాయనుకున్న శాశ్వత వాక్యాలు కొన్ని ఇప్పుడే కన్పిస్తాయి.

తనను ఆకాశంతోనూ, సముద్రంతోనూ పోల్చుకున్నా; 'ఆకాశం మీద అక్షరాలు రాయబడవనీ, సముద్రం మీద రాతలు నిలబడవనీ' కొప్పర్తికి తెలుసు. నిరంతరం ఆకాశంలో విహరించే కృష్ణశాస్త్రులకూ, వాళ్ళు సృష్టించుకున్న లౌకిక జీవితంతో సంబంధంలేని ఊర్వశులకూ, ఊహాప్రేయసులకూ కాలం చెల్లిందనీ, కవిత్వంలో స్థానం లేదనీ కవి గ్రహించాడు. అందుకే ఆకాశం లాంటి ఆలోచన మీద రాయాలనీ, సముద్రంలాంటి దరిద్రం మీద రాయాలనీ నిర్ణయించుకున్నాడు. 'శతాబ్దాల పీడన జీవితంపట్ల విశ్వాసాన్ని చెరపలేక పోయిందన్న' వాస్తవాన్ని గుర్తు చేయాలనుకున్నాడు. 'నుదుటిన పట్టిన చెమటలు నుదుటి గీతల్ని చెరిపేస్తున్నాయన్న సత్యాన్ని' చెప్పాలనుకున్నాడు. అందుకుగాను ఈ భూగోళంపై తనకు కల్పించిన అనేక దృశ్యాల్ని అక్షరాల కుప్పలుగా పోసాడు.

నూతన విద్యా విధానం మూలంగా మౌలిక విలువలే కాదు, మొత్తం జీవితమే ఒక్కసారిగా కుదుపుకు లోనైంది. గోరుముద్దల దశ నుంచీ మనల్ని పెంచి పెద్ద చేసిన మాతృభాష మనకు పరాయిదై పోయింది. 'తెలుగు భాషా పరిరక్షణ' పేరుతో కొందరు ఔత్సాహికులు ఊరూ, వాడా కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితి రావడమే తెలుగుభాష దుస్థితిని తెలియచేస్తుంది. దీనికి కవి తీవ్రంగా కలత చెందాడు. కలవరపడ్డాడు కూడా. మాతృభాష మాధుర్యాన్ని, ఔన్నత్యాన్ని లోకానికి గుర్తు చేయడం కోసం కవి ఒకనాడు తాను పొందిన అనుభూతికి 'పరీక్షా సమయం' అనే ఖండికలో అక్షరాకృతి కల్పించాడు.

"ఒక్కో పరీక్షా గడుస్తుంటే
సంవత్సరంపాటు అంటిపెట్టుకున్న ఒక్కో పుస్తకమూ
పరాయిదైపోయి అటకెక్కుతూ వుంటుంది
అన్ని పరీక్షలూ బెంచీ మీదనే కూచుని రాసినా
ఒక్క తెలుగు పరీక్ష రోజున మాత్రం

అమ్మ వొడిలో కూచున్నట్లనిపిస్తుంది"- (పు. 19)

మాతృభాష ప్రాధాన్యాన్ని ఈ ఖండికలోని 'అమ్మవొడి' తెలియచేస్తుంది. ఇతర పరీక్షలు నాన్నలాంటివి కూడా కావు. అవి అమ్మను ద్వేషించేది. మనకు శత్రువుల్లాంటివి. అనగా ఈనాటి విద్యార్థిని మనం అంతా కలిసి బలవంతంగా శత్రువు పరిష్వంగంలోకి నెడుతున్నామనే కవి ఆందోళన ఈ ఖండికలో కన్పిస్తుంది.

'అమ్మవొడి'కి అన్ని విధాలా దూరమైన పసిబాలల యాంత్రిక జీవితాన్ని ఈ కావ్యంలోని మరికొన్ని ఖండికల్లో కవి అవిష్కరించాడు. 'తెరిచియుండు వేళలు', 'పిల్లకాలువలు' అనే కవితలు కూడా ఇటువంటివే. 'వస్తువుల మధ్య వస్తువులై' పోయిన రేపటి పౌరులు బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తూ ఈ ఖండికల్లో కన్పిస్తారు.

విద్యావ్యవస్థలోని ఈ మార్పులకు కారణం ఉంది. వీటికి అనుకూలంగా కొన్ని మధ్యతరగతి జీవితాలు అందమైన భ్రమలు ఊబిలోకి పీకలదాకా కూరుకుపోవడానికి కూడా కారణం ఉంది. వీటన్నింటికీ కొంత ప్రత్యక్షంగానూ, మరికొంత పరోక్షంగానూ ప్రపంచీకరణ విధానాలే కారణం. ఈ ప్రపంచీకరణ కేవలం విద్యా వ్యవస్థనే ధ్వంసం చేయలేదు. కుటుంబవ్యవస్థనీ, మానవ సంబంధాలను కూడా విచ్ఛిన్నం చేస్తూ వుంది. ఈ పరిణామాలపై కొప్పర్తికి స్పష్టమైన అవగాహన ఉంది. 'అణు విచ్ఛిన్నం' అనే కవితలో దీనిని పరిశీలించవచ్చు.

"ప్రేయసి కాదు ప్రియమైన భార్య కావాలి
ప్రియుడు కాదు ప్రేమించే భర్త కావాలి
ఇల్లు కాదు కుటుంబం కావాలి
... ...
గుండ్రటి భూమి మీద ముందుకు పోవడమంటే
సగం దూరం పోవడమే
ఆ తర్వాత కూడా అడుగువేయడమంటే
బయలుదేరిన చోటుకు దగ్గర
కావడమే"- (పు. 47-48)

ఈనాడు కుటుంబవ్యవస్థలో ముఖ్యంగా భార్యాభర్తల్లో పరస్పరం లోపిస్తున్న ప్రియత్వాన్ని ఈ ఖండిక సూచిస్తుంది. ఇల్లు వేరు. కుటుంబం వేరు. ఇల్లంటే తలుపులూ, కిటికీలు, ఫ్లోరింగూ, పైకప్పులూ వగైరాలు. కుటుంబం అంటే మనుషులు. అమ్మ-నాన్న, భార్య-భర్త, అన్న-చెల్లి, అక్క-తమ్ముడు- వగైరాలు; వాళ్ళ పరస్పర సంబంధాలు; అను బంధాలూ కలగలిసి కుటుంబం అవుతుంది. మనం ఇప్పుడు ఇళ్ళను నిర్మించుకుంటున్నాం గానీ, కుటుంబాలను ఏర్పరచుకోవడం లేదు. కవి ఈ కుటుంబ వ్యవస్థనే కాంక్షిస్తున్నాడు. కుటుంబం అణువులాంటిది. అణువు పదార్థాలుగా మారినట్టు కుటుంబాలు మాత్రమే సమాజాలుగా ఏర్పడతాయి. ఇప్పుడు అణువిచ్ఛిత్తి జరుగుతూ ఉంది. అంటే కుటుంబాలు కూలిపోతూ ఉన్నాయి. ఇది జరగకుండా మానవ సంబంధాలు మంటకలిసిపోకుండా దేశాన్ని కాపాడు కుందామని కొప్పర్తి సమాజాన్ని కోరు తున్నాడు. బయలుదేరిన చోటుకే తిరిగి చేరుకొని ఆధునిక మానవుడు ఆదిమానవుడు కాకూడదనీ; నాగరిక సమాజం అనాగరికం అవ్వకూడదనీ కవి కలగంటున్నాడు.

ప్రపంచీకరణకు పర్యవసానం సామ్రాజ్య వాదం. ప్రపంచీకరించబడిన ప్రపంచీకరణ ఈనాడు పరాకాష్టకు చేరుకుంది. సామ్రాజ్య వాదం తన పంజాను అన్ని దిక్కులకూ విసిరింది. ఈనాడు ప్రపంచమంతా యుద్ధ రంగంగా మారిపోయింది. ఏ అభ్యుదయ కవి అయినా యుద్ధాన్నీ, ప్రపంచ విధ్వంసాన్నీ కోరుకోడు. శాంతినే ఆకాంక్షిస్తాడు. కొప్పర్తి మూర్తీభవించిన అభ్యుదయ కవి. అందువల్ల

యుద్ధంవల్ల తన విముఖత్వాన్నే ప్రదర్శించాడు. 'యుద్ధమూ-శత్రువు' అనే ఖండికలో దీనిని గమనించవచ్చు.

"ఒక దేశంలో ప్రజలంతా ఏకమై
శత్రువుని ఎదుర్కొన్నట్టు
ప్రపంచంలో మనుషులంతా ఏకమై
యుద్ధాన్ని ఎదుర్కోవాలి
... ...
యుద్ధమంటూ జరిగాక ఇద్దరూ ఓడిపోక తప్పదు
ఇద్దరూ గెలిచే యుద్ధం ఎప్పటికీ
చేయని యుద్ధమే"- (పు.27)

ప్రజలు వేరు, పాలకులు వేరు. ఏ దేశ చరిత్ర చూసినా పాలకులంతా ప్రజల్ని పీడిస్తూనే ఉన్నారు. ఇప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాలూ స్వయంపాలన కింద లేవు. ప్రపంచీకరణ పేరుతో ప్రపంచ దేశాలన్నింటినీ ఒక గ్లోబల్ విలేజ్‌గా మార్చాలన్న ప్రయత్నం జరుగుతూ ఉంది. ఆ 'విలేజ్'ని ఒక్కడే పరిపాలించాలన్న ప్రయత్నమూ ఊపందుకుంది. పరిణామాలన్నింటినీ కవి ఒక సామాజిక బాధ్యతగా గమనిస్తూ వచ్చాడు. అందుకే ప్రతి దేశలోనూ ప్రజలంతా ఏకమై యుద్ధానికి సిద్ధమవుతున్న పాలకుణ్ణి ఎదుర్కోవాలని కవి ఈ ఖండికలో సూచించాడు.

ప్రపంచీకరణ నేపథ్యంలో జరుగుతున్న మితవాద సంస్కరణలను కొప్పర్తి ఈ సంకలనంలో ఎక్కడా సమర్థించకపోవడం ఆహ్వానించదగిన అంశం. అదే సమయంలో మితవాద సిద్ధాంతాలను కూడా కవి తిరస్కరించి తన అభ్యుదయ దృక్పథాన్ని చాటుకున్నాడు. పీడిత ప్రజల విముక్తి పేరుతో మొదలైన నక్సలైట్ల పోరాటం తన మౌలిక సిద్ధాంతాలు కొన్నింటికి తిలోదకాలిచ్చిన విషయం కొప్పర్తి గుర్తించాడు. పాలకుల దృష్టిలోనేకాదు, సాధారణ ప్రజల దృష్టిలో కూడా నక్సలిజానికి ఉగ్రవాదం ముద్రపడింది. కారకులెవరైనప్పటికీ దేశంలో, ముఖ్యంగా మన రాష్ట్రంలో ఒక అశాంతి వాతావరణం ఏర్పడింది. కొప్పర్తి ఈ అస్థిరత్వాన్ని కూడా 'విషాద మోహనం'లో విశ్లేషించాడు. నక్సలైట్లకూ, పోలీసులకూ మధ్య ప్రతిరోజూ ప్రచ్ఛన్నయుద్ధం జరుగుతూనే ఉంది. దీని మూలంగా పచ్చని అడవుల్లో డైనమైట్లు పగిలిన శబ్దాలు మైదానాల్లో ఏ విధగా ప్రతిధ్వనిస్తున్నాయో కవి వివరించాడు. ఒక్క రిమోటు నొక్కగానే మందుపాతరలతోపాటు ఎన్నెన్ని గుండెపాతరలు బద్దలవుతున్నాయో కూడా 'అసలు నక్క' అనే ఖండికలో విశ్లేషించాడు.

"తెగిపడ్డప్పుడు బయటపడేది రక్తమేకానీ కన్నీళ్ళు కావు
శవం కన్నా జీవం గొప్పదైనట్లు
రక్తంకన్నా కన్నీళ్ళే గొప్పవి
అతని రక్తం సంగతి సరే, వాళ్ళ కన్నీళ్ళ
మాటేమిటి మిత్రమా?
పోరాటం రాజ్యంతో అయితే
యుద్ధం పోలీసులతోనా?
మందు పాతరలు పేలీ పేలీ నీ అడవి
దారులన్నీ అగడ్తలయ్యాయి
నీ బాణం గురి మరిచింది
గురికోసం నువ్వు ఒక కన్నును
మూసినపుడే
సగం ప్రపంచం నీకు చీకటై పోయింది
రెండొ కన్ను గురికి వస్తున్నదెవరో
తెలీదంలేదు
సరిగ్గా చూడు
మెచ్చి నక్క తోలు కప్పేసరికి
పిల్లి నిజంగా తాను నక్కేననుకుని యుద్ధానికి వచ్చింది
పిల్లికీ పిల్లికీ పోరుపెట్టి అసలు నక్క వినోదం చూస్తోంది"- (పు.23)

నీళ్ళకంటే రక్తం చిక్కన అన్నది నిన్నటి సామెత. రక్తం కంటే కన్నీళ్ళు గొప్పవన్నది ఈనాటి కవి భావన. సైద్ధాంతిక పోరాటం రాజ్యంతో అయితే, తుపాకులతో యుద్ధం పోలీసులతోనా అన్నది కొప్పర్తి ప్రశ్న. పోలీసు వ్యవస్థ రాజ్యంలో ఒక అంగమని కవికి తెలియంది కాదు. 'గతమంతా తడిసె రక్తమున కాకుంటే కన్నీటులతో' అని శ్రీశ్రీ అన్నట్టుగా, పోయినవాడు పోగా మిగిలిన వాళ్ళ కన్నీళ్ళ గురించే కవి బాధంతా. 'గురికోసం నువు ఒక కన్నును మూసినపుడే సగం ప్రపంచం నీకు చీకటై పోయింది' అన్న రెండు పాదాలలోనే సుమారు 35 యేళ్ళ సాయుధ పోరాట సిద్ధాంత స్వభావాన్నీ, ఈనాటి దాని వైఫల్యాలనూ కవి సూచించాడు. పిల్లికీ పిల్లికీ పోరుపెట్టి వినోదం చూస్తున్న 'అసలు నక్క'లో రాజ్య స్వభావాన్ని కూడా కొప్పర్తి ధ్వనించాడు.

అయితే రాజ్యం ఆదేశిస్తున్నట్టుగా నక్సలైట్లకు ఆయుధాలను విడిచిపెట్టమని కవి చెప్పడం లేదు. "ఆయుధాలన్నింటినీ పని ముట్లుగా మార్చండి" (తల్లీ, భూదేవి-పు.25) అని ప్రబోధించాడు. నిజమే, ఆయుధాలు ప్రాణాలు తీసేవి. పనిముట్లు ప్రాణాలు పోసేవి. కాబట్టి సాయుధ పోరాటాల నుండి కవి ఏం కోరుకుంటున్నాడో మనం గమనించ వచ్చు. వర్తమాన పరిస్థితులకు స్పందించి కవిత్వం ద్వారా ప్రజల్ని అప్రమత్తం చేయడం కూడా కొప్పర్తి ఉద్దేశం.

వర్తమాన సాహితీ ఉద్యమాలను అధ్యయనం చేయడం ఏ సాహితీపరుడికైనా కనీస బాధ్యత. ప్రస్తుత వర్గ సమాజంలో- వర్ణ సమాజంలో- పురుషాధిపత్య సమాజంలో పీడకులు, పీడితులు ఎక్కడకక్కడ వేరు వేరు రూపాలలో కన్పిస్తారు. సమాజంలో ఒక పార్శ్వంలోని పీడకుడు మరో పార్శ్వంలో పీడితుడుగానూ; అదే పార్శ్వంలోని పీడితుడు మరో పార్శ్వంలో పీడకుడుగానూ వ్యవహరించడం మనం గమనించవచ్చు. మేధావులూ, సాహిత్యకారులు, ఇతర కళా రంగాలకు చెందినవారు ఆయా రంగాలలోని పీడితుల పక్షంగా ఆలోచించడం వారి కనీస బాధ్యత. కొప్పర్తి ఈ బాధ్యత బాగా గుర్తించిన సాహితీవేత్త. 'విషాద మోహనం'లో చాలా సందర్భాలలో తన లక్ష్యాన్ని స్పష్టం చేశాడు కూడా.

జాషువాలాగే కొప్పర్తి కూడా ఏ పంజరం లోనూ కట్టుబడిలేదు. ఈ కవి దృష్టిలో కవిత్వమంటే తెరల్ని తొలగించి చూడడమే. ఒక వేళ 'తానే ఒక తెర అయితే తనను తాను చింపుకుంటాననీ, తనకు తానే పుటం పెట్టుకుంటాననీ" ప్రకటించాడు. కవిత్వ మీడియంలోనే కొప్పర్తి ప్రపంచాన్ని చదువుకున్నాడు. 'కదిలేదీ కదిలించేదీ కావాలోయ్ నవకవనానికి' అని శ్రీశ్రీ చెప్పినట్టుగా ఈ కవి కూడా 'నిలువనీరుగా కాక ప్రవహిస్తున్న జలం'గా వసుధైక గీతాన్ని ఆలపిస్తున్నాడు.

"నేను కవిని
ముస్లింని దళితుణ్ణి స్త్రీని" (రంగుల కల -పు.53)

అని ఈనాటి కవి ఎవరిపక్షం నిలబడాలో వాళ్ళవైపు నిలబడ్డాడు.

కొప్పర్తిలో అంతర్లీనంగా ఒక గొప్ప స్త్రీమూర్తి దాగి ఉంది. ఆ మాటకొస్తే కొప్పర్తి లోనే కాదు ఏ కవిలోనైనా లోపల ఒక స్త్రీ ఉంటుంది. తనలో ఒక స్త్రీ మూర్తి లేకపోతే ప్రపంచంలో ఎవరూ కవులు కాలేరు. తనలో ఒక 'అమ్మ' లేకపోతే 'వ్యధార్థ జీవుల యదార్థగాధను' ఏ కవీ అర్థం చేసుకోలేడు. అభాగ్యజీవులను అక్కున చేర్చుకోలేడు. ఈ అమ్మ లక్షణం కొప్పర్తిలో కొట్టవచ్చినట్టు కన్పిస్తుంది. అందుకే ఏ జంకూ లేకుండా తానొక స్త్రీనని గర్వంగా చెప్పుకున్నాడు.

స్త్రీవాదులు కూడా ఎవరూ చర్చించని కొన్ని సున్నితమైన అంశాల్ని కొప్పర్తి ప్రస్తావించాడు. 'సహజ హక్కు' అనే ఖండికలో అమ్మ, నాన్నలకు సరికొత్త నిర్వచనం ఇచ్చాడు.

"అమ్మ, నాన్న సాపేక్షాలు కదా
అమ్మ లేకుండా నాన్న,
నాన్న లేకుండా అమ్మ
ఉండవు కదా!
అమ్మ నాన్నది కానపుడు
నాన్న అమ్మది కానప్పుడు
ఆమె అమ్మ ఎట్లా అవుతుంది
ఆయన నాన్న ఎట్లా అవుతాడు" - (పు.16)

స్త్రీ, పురుషులు వేరు, అమ్మ, నాన్నలు వేరు. స్త్రీ అయినంత మాత్రాన అమ్మ కాదు. పురుషుడైనంత మాత్రాన నాన్న కాదు. జన్మనిచ్చినంత మాత్రాన కూడా వాళ్ళు అమ్మ, నాన్నలు కాదు. వాళ్ళిద్దరూ పరస్పరం సాపేక్షాలైనప్పుడే వాళ్ళు అమ్మ, నాన్న లౌతారు. అమ్మతో కలిసున్నప్పుడే అతడు నాన్న; నాన్నతో కలిసున్నప్పుడే ఆమె అమ్మ అని కొప్పర్తి అమ్మ, నాన్నలకు వివరణ ఇచ్చాడు.

వైవాహిక జీవితాన్ని భాగస్వాముల్లోని ఏ ఒక్కరి స్వార్థంగానూ కవి గుర్తించలేదు. ఒక సమష్టి బాధ్యతగానే గుర్తించాడు. అయినప్పటికీ-

"నాకు అమ్మంటేనే యిష్టం
అమ్మతో ఉంటే నాన్న కూడా యిష్టమే
అమ్మ నుంచే నేను ప్రశ్నించడం నేర్చుకున్నాను
నేను అమ్మనే సమర్ధించడం నేర్చుకున్నాను" -(పు.16)

అని కవి అమ్మ పక్షమే చేరాడు. పైపెచ్చు ప్రశ్నించడమనే లక్షణాన్ని అమ్మ నుంచే నేర్చుకున్నానని ప్రకటించాడు. మన జీవితంలో స్త్రీ స్థానాన్నీ, ప్రాధాన్యాన్నీ కవి ఈ ఖండికలో ఆవిష్కరించాడు. 'కాళ్ళ కింద నేల' అనే ఖండికలో కూడా కవి స్త్రీ జాతి పట్ల ఇదే విధమైన సంఘీభావాన్ని గాఢంగా ప్రదర్శించాడు.

'నాలుగు దిక్కుల మధ్య నన్నెవ్వరూ బంధించి ఉంచలేరు, నేను సవర్ణున్నైతే నాకు నేను పుటం పెట్టుకుంటా'నని (పు.52) ప్రకటించిన కొప్పర్తి దళిత జీవితంపట్ల కూడా తన సాహానుభూతిని ప్రకటించాడు. ఈ సంకలనంలోని 'ఊరూవాడ" అటువంటి ఖండికే.

"జంతువు నుంచి వేరయ్యే ప్రయత్నంలో
వెన్నెముకను నిటారుగా నిలబెట్టుకుంటూ వెళ్ళినవాడు
యథాస్థితికొచ్చాడంటే గందరగోళంగా ఉంటుంది"- (పు.28)

అని దళితుని పరిస్థితికి కవి కలవర పడ్డాడు. తన దుస్థితికి పరిష్కారం, 'జవాబు తాను నిలబడ్డ గడ్డమీదే ఉందని తెలియడానికి చాలా కాలం పట్టింది' అన్న విషయాన్ని కవి గుర్తించాడు.

"వాడే
మొన్న రాజ్యాంగం రాశాడు నిన్న పద్యాలల్లాడు
ఇవ్వాళ వచన కవిత్వం రాస్తున్నాడు
ఊరూవాడా ఏకమయ్యే వర్షమై కురుస్తున్నాడు"- (పు.29)

అని దళిత సాహిత్య ఉద్యమంపట్ల హర్షం వ్యక్తం చేశాడు. మొన్నటి అంబేద్కరునూ, నిన్నటి జాషువానూ ఈనాటి వందలాది దళిత సాహితీవేత్తలను కొప్పర్తి శ్లాఘించాడు. 'ఊరు' అగ్రకులస్థులైన నాలుగు వర్ణాలవారికి సంబంధించింది. 'వాడ' దళితులకు చెందింది. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రలో ఊరువాడల రెంటినీ ఏకం చేసే ప్రయత్నం నిన్నటిదాకా జరగలేదు. ఈనాడు దళిత సాహిత్యంలో ఆ ప్రయత్నం కొంత

కన్పిస్తుంది. అందుకే కొప్పర్తి దళిత తాత్త్విక సిద్ధాంతాన్ని అభినందిస్తున్నాడు.

అంబేద్కర్ అభిలషించిన కుల నిర్మూలనను కూడా కొప్పర్తి ఆకాంక్షించడం అభినందనీయం. 'సింధునది' అనే ఖండికలో దీనిని ధ్వనించాడు.

"ఐదు నదుల సింధు దేశంలో నాలుగే ప్రవహించడం వాస్తవం.

వాటిల్లో ఒకటి సూర్యుడికి అర్ఘ్యమైంది

ఒకటి నెత్తురై ప్రవహించింది

ఒక దాని మీద సరుకుల ఓడలు లంగరెత్తాయి

ఒకటి చెమట కాల్వగా బీడుల్ని మాగాణుల్ని చేసింది

ఇంకిపోయిన ఐదోదిప్పుడు

ఊటలు ఊటలుగా ఉబికి యేరై పరవళ్ళు తొక్కుతోంది

ఇప్పుడా ఐదూ సంగమించి

ఒక మహా ప్రవాహం కావాలి" (పు.43)

పైన ఉటంకించిన మొదటి పాదంలో కవి ఒక కఠిన వాస్తవాన్ని వాచ్యం చేసాడు. తరువాతి పాదాలలో చాతుర్వర్ణాల వారినీ వ్యంజింపచేశాడు. ఇంకిపోయిన ఐదో వర్ణం దళితులది. ఈ ఐదూ సంగమించి ఒక మహా ప్రవాహం కావాలన్నది కవి ఆకాంక్ష.

"ఎప్పుడూ ఒక్కడే దొంగగా సాగిన

నాలుగు స్తంభాలాట ముగియాలి

నాలుగూ ప్లస్ ఒకటి ఈజ్ ఈక్వల్టు ఒకటి

లెక్కను సాధించాలి" - (పు.43)

అనే మేథమెటికల్ ఈక్వేషన్ ద్వారా కూడా కవి ఇదే భావాన్ని ప్రకటించాడు. ప్రజా జీవితంతో అవిభాజ్యమైన అనుబంధం ఉండటంవల్లనే ఇటువంటి భావాలను వ్యక్తీకరించగలిగాడు!

'విషాద మోహనం'లో ప్రతిక్రియ ఖండిక కూడా దళితస్పృహకు చెందిందే. దీనిని కొంత సమీక్షించుకోవలసిన అవసరం ఉంది.

"నీది

కటిక నేల మీద అన్నం పెట్టిన

పశున్యాయం

శవాల బట్టలు కట్టుకోమన్న

శవ నాగరికత

ముట్టుకున్నందుకు మరణశిక్ష వేసిన

విలోమ స్మృతి

కాకులతోపాటు పిండాకూడు పంచిన

పిండ సంస్కృతి - (పు.44)

అని వర్ణాధిపత్య భావజాలం దళిత జాతిపట్ల ఎంత నీచంగా వ్యవహరించిందో కవి చాలా స్పష్టంగా వ్యవహరించాడు. దీనికి కవిని అభినందించి తీరాలి.

"అతనిప్పుడు నాగరికుడవుతున్నాడు

నిన్ను నాగరికుణ్ణి చేస్తున్నాడు"

అని దళితుని గురించి చెప్పి, ఖండికను ముగించాడు. ఇక్కడ ఈ కవితపట్ల కొంత చర్చ జరగాలి.

అక్షరాల్ని పదాలుగా మలచి వాటిని ఎక్కడ, ఎప్పుడు, ఏ విధంగా వాడుకోవాలో ఆ రహస్యం బాగా తెలిసిన కవి కొప్పర్తి అని ముందుగానే ప్రస్తావించుకున్నాం. దీనిలో సందేహం లేదు. ఎంత గొప్ప కవైనా ఒక్కోసారి తనకు తెలియకుండా కూడా చేసిన చిన్న పొరపాటు ప్రయోగం పెద్ద అనర్థానికి దారి తీస్తుంది. ఈ ఖండికలోని చివరి రెండు పాదాలలో అదే జరిగింది.

భారతీయ సంస్కృతి అంటే అది అగ్ర వర్ణాల వారి సంస్కృతే. ప్రధానంగా అది బ్రాహ్మణీయ సంస్కృతి అన్నా పెద్ద ఇబ్బంది లేదు. ఇందులో ఒక ప్రత్యేకత ఉంది. భారతీయ సంస్కృతి ఆదిలో శూద్రులకూ, స్త్రీలకూ విద్యను నిషేధించింది. అదే నోటితో 'విద్యలేనివాడు వింత పశువు' అని కూడా నిర్ణయించింది. అదే విధంగా కొన్ని కులాల

వారిని సమాజంలో అన్ని విధాలుగా బలవంతంగా వెనుకకు నెట్టింది. అదే నోటితో వారిని 'వెనుకబడిన కులాల వారు' అని వ్యవహరించింది. ఇది ద్వంద్వ నీతి మాత్రమే కాదు, దొంగనీతి కూడా. విద్య లేకుండా చేసిందీ వారే, వెనుకబడవేసిందీ వారేనన్న వాస్తవాన్ని గుర్తించాలి. నిజానికి విద్యలేని వాడు కాదు, 'విద్య లేకుండా చేసినవాడు వింత పశువు' అని చెప్పుకోవాలి. దళిత జాతిపట్ల పశున్యాయాన్ని ప్రదర్శించి, పిండ సంస్కృతిని అమలుచేసి దళితుణ్ణి 'అనాగరికుడు'గా పరిగణించింది. ఇది కూడా భారతీయ సంస్కృతిలోని దొంగనీతిలో భాగంగానే భావించాలి. ఏ కవైనా, ముఖ్యంగా అభ్యుదయ కవులు మన సంస్కృతిలోని ఇటువంటి ధోరణులను త్రోసిపుచ్చవలసిన అవసరం ఉంది.

వర్ణవ్యవస్థ పటిష్టపడినప్పట్నించీ ఈ భారతీయ సమాజంలో దళితుని ప్రాతినిధ్యాన్ని పక్కకు తొలిగించి చూస్తే ఈ సమాజం ఎలా ఉండేదో ఊహించడం కూడా దుర్భరమే. జాషువా చెప్పినట్టు 'వాడు చెమ్మటలోడ్చి ఈ ప్రపంచానికి భోజనం' పెట్టాడు. పశు కళేబరాల్ని 'ఊరు' నుంచి దూరంగా ఈడ్చి ఊరులో దుర్గంధం లేకుండా చేసాడు. 'ఊరు'వారి పాదాలు కందిపోకుండా చర్మం వొలిచి చెప్పులు కుట్టి పెట్టాడు. ఊరు విసర్జించిన మలమూత్రాలను చేతులతో ఎత్తి దూరంగా పోసాడు. ఊరంతటినీ పరిశుభ్రంగా ఉంచాడు. దళితుడు ముందుంటేనే ఊళ్ళోని ఏ శుభకార్యాలైనా, ఊరేగింపులైనా జరిగేవి. దళితుడు ముందుంటేనే ఊరులోని శవం ఊరు వెలుపల పాతిపెట్టబడేది. పొద్దస్తమానం దళితుడు ఊరు శుభ్రతకు పాటుబడబట్టే 'వాడ' అశుభ్రంగా ఉండిపోయిందన్న వాస్తవాన్ని మరిచిపోకూడదు.

ప్రపంచంలోని ఏ తల్లయినా తన బిడ్డను ప్రతిక్షణం మూతి కడిగీ, ముడ్డి కడిగీ, స్నానంచేసి కడిగిన ముత్యంలా ఉంచుతుంది. నిరంతర పరిరక్షణలో, పర్యవేక్షణలో, పరిశ్రమలో తాను మసిగుడ్డగా మారిపోతుంది. ఈ విషయంలో తల్లికీ, దళితుడికీ ఉన్నది అభేదమే. మాసిపోయి ఉంది కదా అని ఈ లోకంలో ఎవరైనా తల్లిని 'అనాగరికురాలు' అని అనగలమా? తల్లిని అనాగరికం చేయడంలాంటిదే, ఈ దేశంలో దళితుణ్ణి అనాగరికుడు అని భావించడం. బ్రాహ్మణీయ సంస్కృతిని ఉగ్గుపాలతో కలిపి తాగి పెరిగిన ఒక సాధారణ వ్యక్తి దళితుణ్ణి అనాగరికుడుగా పరిగణించడంలో ఆశ్చర్యం లేదు. కానీ, కవులూ, రచయితలూ ఇటువంటి సందర్భాలలో చాలా జాగ్రత్తగా వ్యవహరించవలసిన బాధ్యత ఉంది.

పై ఖండికలో కొప్పర్తి ఉద్దేశం ఇది కాకపోవచ్చు. కానీ, " అతడిప్పుడు నాగరికుడవుతున్నాడు" అని నొక్కి చెప్పాడు. అంటే ఇప్పటిదాకా దళితుణ్ణి అనాగరికుడుగానే ఈ కవి భావించాడన్న సంకేతం సాధారణ పాఠకులకు వెళ్తుంది. ఇటువంటి సందర్భాలు కవుల నిజాయితీనీ, సంస్కారాన్నీ అనుమానించే అవకాశాన్నిస్తాయి. బాధ్యత కలిగిన కవులు లిప్తకాలం మాత్రమైనాసరే ఏమరుపాటుతో పదప్రయోగం చేస్తే ఎంతటి అనర్థం జరుగుతుందో సాహిత్యలోకానికి తెలియచేయడానికే ఇంతటి వివరణ ఇవ్వవలసి వచ్చింది.

కవిత్వ భాష గురించి కొప్పర్తి 'ఒక నోస్టాల్జియా గురించి' అన్న కవితలో తన అభిప్రాయాలను వెల్లడించాడు. ఇది కూడా కొంత చర్చనీయాంశమే.

"కవిత్వవనంలో బూతెప్పుడూ నిషిద్ధ ఫలమే

యాస నీ శ్వాస, నిజమే

ఆగ్రహం నీకు అనివార్యం, కాదనను
కానీ బూతు ఒక నోస్టాల్జియా
… … …
ఆహారం తీసుకొనే నోట్లోంచి వమనం
కావడం అనారోగ్యమే
అందంగా మాట్లాడ్డం కవికి స్వభావ
విరుద్ధం కాదు
… … …
పురాణాల్ని ధిక్కరించిన వాడికింకా
బూతు పురాణమెందుకు
ముంత వేలాడినచోట పెన్ను
వేలాడుతోంది కదా
ఇంకా లిపి కూడని ఆ భాషలెందుకు
నగ్న శరీరాల మీద ఆచ్ఛాదనల కోసం
పోరాడుతూ
కవిత్వాన్ని మాత్రం మళ్ళీ దిగంబరం
చెయ్యడమెందుకు" – (పు.49-50)

అన్నది కొప్పర్తి అభిప్రాయం. ఈనాడు వస్తున్న స్త్రీవాద, దళితవాద, మైనారిటీవాద కవిత్వంలో అక్కడక్కడా కొన్ని బూతు పదాలు దొర్లుతున్నాయన్న ఆరోపణ ఉంది. ఈ కవి ముఖ్యంగా దళిత కవిత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఖండికను రచించినట్టు మనం భావించవచ్చు.

కవిత్వంలో 'బూతు' గురించి కొంత ఇక్కడ ప్రస్తావించుకోవాలి. బూతు అనేది భాషకూ, పదానికీ, అర్థానికీ సంబంధించింది కాదు. భావానికీ, సందర్భానికీ చెందింది. అర్థం వేరు, భావం వేరు. అర్థం నిఘంటువులో దొరుకుతుంది. భావం జీవితానుభవం నుంచి లభిస్తుంది. ఆధునిక కవిత్వంలో, తొలిసారిగా దిగంబర కవిత్వం లోని బూతు గురించి ఒకనాడు కొంత చర్చ జరిగింది. కామాన్ని ప్రేరేపించే భావాన్ని రెచ్చగొట్టేదే బూతుగాని, కేవలం కొన్ని శరీరాంగాలను స్ఫురింపచేసినంత మాత్రాన అది బూతుకాదు. అందుకే ఆనాడు దిగంబర కవిత్వంలోని బూతు పదాలను కొంతమంది తప్పు పట్టలేదు. ఆయా సందర్భాలలో అదే కరెక్ట్ ఎక్స్‌ప్రెషన్ అని 'జ్వాలాముఖి' ఈనాటికీ ఆ ప్రయోగాలను సమర్థిస్తూనే ఉన్నారు. ఈ అభిప్రాయాలను ప్రామాణికంగా స్వీకరించక పోయినప్పటికీ సరికొత్త వివరణ కొంత చేసుకోవడం అవసరం.

కవిత్వంలో బూతును సమర్థించడం ఈ వ్యాసకర్త ఉద్దేశం కాదు. కానీ, కొన్ని విషయాలు గమనించాలి. కవి అనుభవించిన బాధ, స్వీకరించిన వస్తువు, ఎంచుకున్న సందర్భం అభివ్యక్తిని నిర్ణయిస్తుంది. వీటితో పాటు కవిచుట్టూ వున్న సాంఘిక-ఆర్థిక-సాంస్కృతిక వాతావరణం కూడా భాషను నిర్ణయిస్తుంది. ఆహారం తీసుకొనే నోట్లోంచి వమనంకావడం అనారోగ్యమే. కానీ, కొన్ని సందర్భాలలో వమనం కాకపోవడమే అనారోగ్యమౌతుంది. స్పష్టత కోసం దళిత కవిత్వంలో బూతు పదాలను ప్రయోగించిన శిఖామణి 'వాడే నిషిద్ధ మానవుడు'; మద్దూరి నగేష్‌బాబు 'దేవుడి పెళ్ళాం' అనే ఖండికలను పరిశీలిద్దాం. వీటి సందర్భాలు సాహిత్య లోకానికి బాగా తెలిసినవే.

అన్నం తినే నోట్లో మలం కుక్కబడి నప్పుడు శిఖామణేకాదు, ఏ కవీ అశుద్ధాన్ని అమృతంగా వర్ణించలేదు. మలం కుక్కినవాణ్ణి తిట్టి పోయకుండా ఏ కవీ సహస్ర నామ సంకీర్తనతో అతణ్ణి అందంగా స్తుతించలేదు. (కవి 'లంజా కొడుకా' అని ఈ కవితలో ప్రయోగించాడు.)

మూడు రూపాయలు, అక్షరాలా మూడు రూపాయలు బాకీ తీర్చలేదన్న మిషతో సజ్జలగూడెం మహదేవమ్మ అనే బసివి స్త్రీని ఆమె కన్నకొడుకు సమక్షంలోనే కొందరు సామూహికంగా రేప్ చేసిన సంగతి మనకు తెలుసు. ఆ సందర్భంలో కూడా మద్దూరి నగేష్ బాబే కాదు, ఏ కవైనా వారిని

బండబూతులు తిట్టకుండా, వారిని పురాణ పురుషులుగా కీర్తించలేదు. (కవి ఈ కవితలో 'నా బట్టా' అని ప్రయోగించాడు.)

అందంగా మాట్లాడ్డం కవికి స్వభావ విరుద్ధం కాదు. నిజమే! వర్తమాన వాస్తవ జీవితంలో ఆ అందం కొరవడినపుడు; బాధ్యత కలిగిన ఏ ఆధునిక కవీ లేని అందాన్ని వర్ణించలేడు. ఛిద్రమైన జీవిత శకలాల్ని అందమైన భాషలో అభివ్యక్తి చేయలేడు. అలాచేస్తే, కొప్పర్తి చెప్పినట్టుగా అది "ఉతికిన బట్టలు కట్టుకొని కంపుకొట్టే మేజోళ్ళు జేబులో పెట్టుకు తిరగడం" అవ్వదు. కంపుకొట్టే శరీరంపై ఉతికిన బట్టలు కట్టుకొని తిరగడమే అవుతుంది. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో నిన్నటిదాకా జరిగిందిదే. ఆధునిక కవిత్వం దీనికి భిన్నమైంది. అందంగా మాట్లాడ్డమే కవి స్వభావం అని ఈనాడు నిర్ధారిస్తే-అది ఒక రకంగా కాల చక్రాన్ని వెనక్కి మళ్ళించడమే. సామాన్యుల జీవితంలోని అనుభవాలు, పీడనలూ కవితా వస్తువుగా నిషిద్ధమని శాసించడమే. మళ్ళీ శూద్రుణ్ణీ; అంటరాని వాణ్ణీ, స్త్రీనీ, మైనారిటీలనూ కలం పట్టుకో వద్దని నిషేధించడమే అవుతుంది.

ఇదే సందర్భంలో ఈ సంకలనంలోని 'రహస్య నది' అనే ఖండికను కూడా పరామర్శించడం కొంత అవసరం. "అదృశ్యమైపోయిన సరస్వతి నది కోసం అన్వేషణ సాగుతున్న నేపథ్యంలో- హిందుత్వ చరిత్రకారుల కౌటిల్యం తెలియని అజ్ఞానంతో" అని కవి చేసిన సూచన ఈ ఖండిక చివర ఉంది. రాజస్థాన్ ఎడారుల్లో, భూగర్భంలో సరస్వతీ నది ప్రవహిస్తూ ఉందని ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో రచించిన ఖండిక ఇది.

"సరస్వతి మీద మళ్ళీ సూర్యుడు
దయించినప్పుడు
నాలుగు వేల ఏళ్ళనాటి ఆ మంత్రజలాల్లో
వైదిక రుషుల ప్రతిబింబాలు తప్పక
కన్పిస్తాయి" - (పు.61)

అని తొలుత కవి చెప్పాడు. 'విషాద మోహనం' సంకలనంలోని ఇంచుమించు అన్ని కవితల్లోనూ కొప్పర్తి గొప్ప చైతన్యాన్ని ప్రదర్శించాడు. అటువంటి కవి హిందుత్వ చరిత్రకారులు కౌటిల్యంతో చెప్పిన ఈ ఐతిహ్యాన్ని విశ్వసిస్తున్నాడా అనే అనుమానం పై పాదాలు మూలంగా పాఠకులకు కలుగుతుంది.

"ప్రవహించినంత మేర నది
వాస్తవాల్ని మిగిల్చుకుంటూ వెళుతుంది
వాస్తవం శిష్టమైతే
వారసత్వం దాన్ని అనుసరించి
గొప్పదవుతుంది
వాస్తవం భ్రష్టమైతే
వారసత్వం దాన్ని ధిక్కరించి మరీ
గొప్పదవుతుంది
బయటపడే చరిత్రలో కాదు
చరిత్ర బయటపడటంలోనే గొప్పదనం
ఉంది"- (పు.62)

అని తరువాత పాదాల్లో చెప్పాడు. వాస్తవం శిష్టమైనప్పుడు, వాస్తవం భ్రష్టమైనప్పుడు కలిగే వైరుధ్య పరిణామాల మూలంగా సాధారణ పాఠకులు మళ్ళీ గందరగోళంలో పడతారు.

కవుల్లో వైవిధ్యం ఉండొచ్చుగాని, వైరుధ్యాలు ఉండకూడదు. విశ్వాసాలనేవి కవుల వ్యక్తిగత అంశాలే అయినప్పటికీ వాటిని పాఠకులతో పంచుకొనేటప్పుడు అస్పష్టత ఉండకూడదు. 'పాము చావ కూడదు-కర్ర విరగకూడదు' అనే పద్ధతి కవులకు పనికిరాదు. కవి దృక్పథాన్ని తెలుసుకోడానికీ, కవి నిజాయితీని అంచనా కట్టడానికీ అస్పష్టత, మార్మికత, అంతర్ముఖీనత వంటివి అవరోధాలుగా ఉంటాయి.

ఈ క్రీనీడల్లోంచి కవులు వెలుగులోకి రావడం అవసరం.

కవి అభిప్రాయాలవట్ల సాధారణ పాఠకుల్లో కొన్ని అభ్యంతరాలుండవచ్చు. కానీ, భయద సౌందర్యం, ఎంతెంత దూరం, అంతిమ యాత్ర, పరీక్షా సమయం, ఊరు పొమ్మంటుంది, శిక్షాస్మృతులు, అపేక్ష సిద్ధాంతం వంటి ఖండికల్లో కొప్పర్తి అక్షరా కృతినిచ్చిన కొన్ని భావ చిత్రాలు పాఠకుల్ని అబ్బురపరుస్తాయి. ఇప్పటి వరకూ చర్చించిన కొన్ని అంశాలు ఈ సంకలనంలో కొన్ని నలుసులు మాత్రమే. కవిత్వ నిర్మాణాన్ని చెడగొట్టడం కొప్పర్తికి చేతకాదన్న గొప్ప గుణాన్ని ఈ సంకలనంలోని ప్రతి ఖండికా నిరూపిస్తుంది. కవిత్వ విలువలు పుష్కలంగా కలిగిన గొప్ప సంకలనాన్ని ప్రకటించి నందుకు కొప్పర్తి అభినందనీయుడు.

1991 నుంచి 2002 దాకా పదకొండేళ్ళ సామాజిక జీవితంలోని కొన్ని పార్శ్వాలను ఆవిష్కరించిన ఈ సంకలనానికి, 2003 సంవత్సరంలో 'ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు' లభించింది. మొత్తం 41 ఖండికలున్న ఈ సంకలనం కేవలం 30 రూపాయలకే విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, దిశ పుస్తక కేంద్రాలలో అందుబాటులో ఉంది. ఉత్తమ కవిత్వాన్ని ఆస్వాదించాలనుకొనే సాహితీ ప్రియులు, గొప్ప కవిత్వాన్ని ఎలా రాయాలో తెలుసుకోవాలనుకొనే వర్తమాన కవులు, రచయితలు తప్పకుండా ఈ సంకలనాన్ని చదవడం అవసరం. *

(34వ పేజీ తరువాయి)

వెలువడుతోంది. 1/4 సైజులో 40 పుటలు గల ఈ పత్రిక విడి కాపీ వెల: రు. 15/-. సంవత్సర చందా రు. 150/-.

చిరునామా: రోహిణి టవర్స్, 2/11, బ్రాడీపేట, గుంటూరు-2. దూరవాణి: 0863-2352982 *

అల్పిక:

"తప్పు" రాజకీయాలు

- ఆదిత్య

"నేను తప్పు చేస్తే ఉరితీయండి!"

"నేను తప్పు చేస్తే రాళ్ళతో కొట్టి చంపండి!"

" చూసావా! మన పాలకవర్గాలెంత నిజాయితీనో!"

"దాందేముంది- నేతి బీరలో నెయ్యంత!"

"ఏం అలా తేల్చేసావు?"

"వాళ్ళు తాము తప్పు చేయ లేదంటున్నారు కానీ చేయించ లేదంటున్నారా?"

"చేతికి మట్టంటకుండా-తడి గుడ్డలతో గొంతు కోయడం-అంతేనా?!"

"అందరూ దొంగలే!"

"దొంగలే 'దొంగలు! దొంగలు' అని అరుస్తున్నారన్నమాట!"

" ఈ గలాటాలో చివరకి ఈ బల్లులు బలిచేసే తోకలెవరో!"

వేమన చురక:

భూవతి దయనమ్మి భూమి చెరచువాడు
ప్రజల ఉసురు తాకి పడును పిదప
ఎగరవేయ బంతి ఎందాక నిలుచురా
విశ్వదాభిరామ! వినురవేమ!

(దేవాదాయ భూ వివాదంలో దేవాదాయ మంత్రి ఎమ్మెస్, మాజీ మంత్రి దండు శివరామరాజుల బూకరింపుల బూటకాలు చూసి)

- 14.06.05

సినిమా సమీక్ష

ఫాసిస్టు ధోరణులను ప్రేరేపిస్తున్న "అపరిచితుడు"

- జగం

నగరంలో వరస హత్యలతో సంచలనం సృష్టించిన అపరిచితుడు అనబడే రామానుజం జియ్యర్ (హీరో విక్రం) ఒక బహిరంగ సభలో కొన్ని వీడియో క్లిప్పింగ్స్ ప్రదర్శిస్తాడు.

"మనలో గౌరవనీయులైన ఒకరి దినచర్య చూడండి" అంటూ ఓ క్లిప్పింగ్ చూపిస్తాడు. అందులో సోమరిపోతైన ఓ పేదవాడు రోడ్డు మీద ఎక్కడపడితే అక్కడ ఉమ్మివేస్తాడు. అల్పాచమానం చేస్తాడు. సారా తాగుతాడు. ఆ వ్యక్తికి, అపరిచితుడుకి మధ్య జరిగిన సంభాషణ ఈ విధంగా వుంది.

"ఇక్కడ ఏం చేస్తున్నారు"

"చూస్తే కనపడ్డంలా రెస్టు తీసుకొంటూ వున్నా".

"ఏం చేసి రెస్టు తీసుకొంటున్నారు"

"నేను రెస్టు తీసుకొనే టైమే"

"ఇంకా ఏవైనా చేస్తున్నారా?"

"నా లెవల్‌కి నేను చేసే పనేది కనపడలా!"

"మరి ఆదాయం"

"అమ్మ కూలి పని చేస్తుంది. ఇంకా అంట్లుతోమే పని కూడా చేస్తుంది. నాన్న కూలి పని"

"ఖర్చులకు డబ్బులు ఇస్తారా?"

"ఇవ్వకపోతే బలవంతంగా లాక్కొంటాను"

"ఏం పనిస్తే చేస్తారు"

"ఇప్పుడు డ్యూటీలోనే వున్నాను" అంటూ సారామత్తులో పార్కులో బల్లపై పడుకొంటాడు.

"ఇలాంటి అతన్ని ఏం చేయాలి?" అంటూ చుట్టూ వున్న జనాన్ని ప్రశ్నిస్తాడు.

"ఇలాటి సోమరిపోతులు దేశంలో బ్రతకక్కూడదు" జనం ఆవేశంగా (?) బదులిస్తారు.

"అదీ నేనూ చేస్తున్నాను"-అంటూ అతన్ని పాము కాటుతో చంపేస్తాడు.

క్రమశిక్షణ, ఏ లక్ష్యం లేకుండా బ్రతికే వారు జీవించే హక్కులేదని ప్రమాదకరమైన సందేశం ఇచ్చే పై సన్నివేశం తమిళ డబ్బింగ్ తెలుగు చిత్రం 'అపరిచితుడు' చిత్రంలోనిది. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తమిళ దర్శకుడు శంకర్ రూపొందించిన ఈ చిత్రం విజయవంతమై ప్రమాదకర ధోరణులకు నాంది పలికింది.

ఏ పని చేయకుండా, రికామిగా తిరిగే సోమరులు తయారవడానికి ఆ వ్యక్తులే కారణమా! ప్రజలకు సివిక్‌సెన్స్ లేక పోవడానికి వారి సాంఘిక, సాంస్కృతిక వెనుకబాటుతనం వల్ల జరుగుతుంది. పాలకులు ప్రజల బలహీనతలను సొమ్ము చేసుకొనేందుకు, 'ఎందెందు వెతికిన అందందే కలదన్న' చందంగా మద్యం ఏరులై పారిస్తుంటే ప్రజలు సారాకు బానిసలవడంలో ఆశ్చర్యమేముంది? సమాజంలో దిగజారుదు విలువలు ఫలితంగా ఈజీగా డబ్బు సంపాదనా మార్గాలకీ, అవకాశవాదానికి గుర్తై ప్రజలు సోమరులుగా మారతారు. అంతమాత్రం చేత వార్ని హత మార్చడమే పరిష్కారమా! అలాగే బ్రేక్‌వైరు క్వాలిటీగా ఉత్పత్తి చేయలేదని ఫ్యాక్టరీ యజమానిని జలగలతో చంపుతాడు. రైల్వే

క్యాంటిన్ యజమాని ప్రయాణికులు చెల్లిస్తున్న డబ్బుకు మంచి భోజనం పెట్టలేదని అతన్ని నూనె మూకుడులో వేయిస్తాడు. అక్రమంగా ఎక్కువ అద్దె వసూలు చేస్తున్న ఇంటి యజమాన్ని కట్టిపడేసి వాడు సంపాదించుకొన్న సొమ్మును తినిపించి, కడుపు అరక్క విరోచనాలతో చస్తాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఓ ధనికుడు తన కారులో హాస్పటల్‌కు చేర్చలేదని దున్నపోతులతో కుమ్మిచ్చి చంపుతాడు. రైల్లో ప్రయాణీకుడు మద్యం సేవించాడని అతన్ని రైల్లోంచి తోసేసి హతమారుస్తాడు. అత్యంత పాశవికంగా ఈ హత్యల పరంపర సాగుతుంది.

ఈ తప్పులు, నేరాలు సివిక్ సెన్స్ లేక పోవడం, సోమరితనం, మానవత్వం లేక పోవడం, అక్రమ సంపాదనలాంటి స్వభావం కల్గి వున్నాయి. '05 ఏప్రిల్ 10 తేదీన ప్రముఖ కార్మిక నాయకుడు ఎం.పి. గురుదాస్‌గుప్తా పార్లమెంట్ వెలుపల విలేఖరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం దేశవ్యాపితంగా 228 బడా సంస్థలు 6542 కోట్లు బ్యాంకు రుణాలను దిగమింగాయి. మన రాష్ట్రంలో 289 సంస్థలు ఎటువంటి కేసులు లేకుండా బ్యాంకులకు ఎగవేసిన సొమ్ము 2,230 కోట్లు (అక్షరాలా రెండు వేల రెండువందల ముప్పై కోట్ల రూపాయలు).

ఈ ఘరానా దొంగల్లో వార్త, ఆంధ్రప్రభ యజమానులు, రాయపాటి సాంబశివరావు, మాగుంట శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), కందుల శివారెడ్డి, అల్లాడి రాజ్‌కుమార్ (తెలుగుదేశం) వంటి ప్రముఖులు వున్నారు. అఖిల భారత బ్యాంకు ఉద్యోగస్తులు వెల్లడించిన ప్రకారం 3 లక్షల కోట్లు ఎగ్గొట్టిన రుణాలుగా వున్నాయని, వారిలో బడా పెట్టుబడిదారులు ఉన్నారు. ఇక రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల అవినీతి, కుంభకోణాలకు లెక్కేలేదు. వీటితో పోలిస్తే చిత్రంలో చూపించిన నేరాలు కొండల ముందు చిన్న చిన్న మట్టి దిబ్బ ల్లాంటివి. ఈ వైట్ కాలర్ ఘరానా నేరస్తులను వదిలిపెట్టి ఛోటా నేరాలను చిన్న తప్పులను గ్లోరిఫైచేసి చూపించటమంటే ప్రజల్ని ప్రక్క దారి పట్టించటమే.

"మనలో ఎంత మంది మంచి పౌరులుగా వుంటున్నాం? మనలో ఎంత మంది బాధ్యత లను సరిగ్గా నిర్వహిస్తున్నారు?... ఎవరి బాధ్యతను వాళ్ళు సక్రమంగా నిర్వహిస్తేనే దేశం బాగుపడుతుందని" ఆవేదన చెందే అపరిచితుడు తను చేస్తున్న హత్యల ద్వారా తను కోరుకుంటున్న దేశాభివృద్ధి సాధ్యం అవుతుందా? ఒకవేళ సాధ్యమే అనుకొన్నా ఆ భయం ఉన్నంత వరకే. దానివల్ల జరిగే మార్పు ఏదైనా వుంటే అది పాక్షికంగా, స్వల్పంగా వుంటుంది. అయినా ఎంత కాలం ఇలా జరుగుతుంది? కాబట్టి భయం ద్వారా ప్రజల్లో మార్పు తీసుకురావడం సాధ్యం కాదు.

రాజ్యాంగ యంత్రం వ్యక్తిగత ఆస్తికి రక్షణ కల్పిస్తుంది. అయితే ఆ డబ్బు ఎలా సంపాదించారు అన్న విషయం పట్టించు కోదు. అందుకే అడ్డదారుల్లో ధన సంపాదన ప్రబలిపోయింది. అవినీతి వూడలు దిగింది. మానవతా విలువలు కోల్పోయిన ఈ సమాజంలో వ్యక్తి చెడిపోయేందుకు తగిన పరిస్థితులు, అన్ని రకాల అవకాశాలు సృష్టించ బడ్డాయి. లోపభూయిష్టమైన సమాజాన్ని మార్చకుండా వ్యక్తులుగా మనుష్యులందరిలో మార్పు తీసుకురావడం సాధ్యం కాదు. అందుకు సామాజిక అవగాహన, చైతన్యం, సంసిద్ధతలను ప్రజల్లో పెంచి, సంఘటిత ఉద్యమాల్లో భాగస్వాములు చేస్తేనే సామాజిక మార్పు జరుగుతుంది. ఈ అవగాహన లోపించిన అపరిచితుడు చేసే హత్యలు ద్వారా ప్రజల్లో మార్పుకంటే తను ఎంచుకొన్న నేరస్తులను ఏరివేయడమే ప్రధానంగా వుంది.

ఈ స్వభావం విపరీత పరిణామాలకు దారితీసి ఫాసిస్టు ధోరణులు నెలకొనే ప్రమాదం వుంది.

"యమధర్మరాజు ఆజ్ఞ ప్రకారం వాడు (వ్యక్తి) చేసిన పాపానికి తగ్గట్టు.... శిక్ష విధిస్తారు. తనువు చేసే పాపాలను తనువు తోను, మాటలతో చేసే పాపాలను మాటల తోను, మనస్సుతో చేసే పాపాలను మనసు తోను శిక్షించే తీరుతారు". చిన్నతనంలో బామ్మ చేసిన హితబోధను వంట పట్టించు కొన్న ఛాందస బ్రాహ్మణుడైన రామానుజం తనలో వున్న అపరిచితుడు గరుడ పురాణం ప్రకారం నరకంలో విధించే శిక్షలననుసరించి హత్యలు చేస్తాడు. ఇది కర్మఫలం అను భవించక తప్పదనే మూఢనమ్మకాలకు వూపిరిపోయడమేకాక మతచాంధసానికి, మత ఉన్మాదానికి తోడ్పాటునందిస్తుంది.

చిత్రంలో చూపించిన హీరోలో ఏ క్షణంలో కల్గుతుందో, లేదో తెలీని మల్టిపుల్ పర్స నాలిటీ డిజార్డరు (విభిన్న మనస్తత్వాల అపసవ్యత) వల్ల హీరోకు మేకప్, డ్రెస్ ఛేంజ్ అవడం సినిమాటిక్ అనుకోవాలి. అయితే విభిన్న మనస్తత్వాలను ఏకకాలంలో ప్రద ర్శించే రామానుజం, అపరిచితుడు పాత్రల ద్వారా చిన్న తప్పులు, చిన్న నేరాలకు స్పందించి వాటిని పరిష్కరించటంలో (హృదయ దౌర్బల్యం, చేతకానితనం ఉన్నప్పటికీ) రామానుజం చట్ట పరిధిలో చేసే కృషీ, ఆ తప్పులు, నేరాలకు పరిష్కారంగా చూపించిన అమానుష హత్యాకాండ ద్వారా ఫాసిస్టు పెడధోరణీ-ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవడంలో, తమ హక్కులను సాధించుకోవడంలో ఈ రెండు ధోరణులకు గురై ప్రేక్షకులుగా మిగిలిపోయేందుకు దోహదపడుతుంది.

'అపరిచితుడు' చిత్రాన్ని ప్రమోట్ చేయడంలో భాగంగా దర్శకుడు శంకర్ హైద్రాబాదులో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ- "చిన్న చిన్న తప్పులు కనపడనివి. ఉదాహరణకు రెడ్ లైట్ పడితే ఆగాలి. గ్రీన్ లైట్ పడితే వెళ్ళాలి... అందరికీ తెల్సిన కామన్ సూత్రం. కాని దాన్ని అతిక్ర మిస్తున్నాం. అలాగే ఎక్కడబడితే అక్కడ ఉమ్మివేయడం, ఇలాంటివి చిన్న తప్పులుగా అన్పించవచ్చు. దేశం అభివృద్ధి చెందాలంటే చిన్న చిన్న విషయాల్లో నిర్లిప్తత వుండకూడదు". చిత్రంలో డ్రైవ్ చేసిన కాన్సెప్ట్ ఇదే.

సినిమాలో ఉదాహరణగా తీసుకొన్న జపాన్, ఉత్తర కొరియా దేశాల్లో చిన్న తరహా పరిశ్రమలను అభివృద్ధిపర్చడం ద్వారా పెట్టు బడిదారీ వ్యవస్థ అభివృద్ధి జరిగింది. వ్యాపా రాభివృద్ధి జరిగింది. సింగపూర్ వ్యభిచారం ప్రధాన వ్యాపారంగా, నేరస్థ దేశంగా వుంది. దర్శకుడు చెప్పినట్టు ప్రతి చిన్న విషయంలోను నిర్లిప్తత, అలసత్వం పోగొట్టుకొన్నందువల్లనే ఆ దేశాలు అభివృద్ధి కాలేదు. అభివృద్ధి అంటే విశాలమైన రహదార్లు, ఎత్తైన అందమైన భవనాలు మాత్రమేకాదు. ఆ దేశాల్లో జరిగిన అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ అందు తున్నదా? లేదా? అన్నది చూడాలి. ఆ దేశాల్లో పేద, గొప్ప అంతరాలు, వ్యత్యాసాలు బలంగా వున్నాయి. పైపైన ప్రదర్శించే తళుకు బెళుకుల్ని చూపి మొత్తం వారి వ్యవస్థంతా ఆదర్శనీయ మైనదిగా చెప్పటం బందరు మాయ బంగారాన్ని అసలు బంగారమని అమ్మటం లాంటిది తప్ప మరొకటి కాదు.

ఎన్నో అసమానత్వాలతో నిండిన మన సమాజంలో నాగరికతల్లోనూ వాటి అర్థాల లోనూ కూడా ఎన్ని అంతరాలున్నాయి. హైదరాబాదుకు కూతవేటు దూరంలోవున్న పల్లెవాసులకైనా హైదరాబాదు నాగరీకం ఎలా తెలుస్తుంది? ప్రకృతిసిద్ధ అవసరాలు తీర్చుకోవటానికి ఎక్కడ ఏ విధమైన ఏర్పాట్లు (నిజంగా వున్నా) చేశారో ఎలా బోధపడు తుంది? దొంగతనం, అబద్ధ మాడటం,

వ్యభిచారం....నాగరీకమైపోయిన. నేడు, అడవుల్లో గిరిజనులకు అవి ఇంకా పూర్తిగా అలవడలేదంటే సిగ్గుపడే స్పృహైనా ఈ సివిక్ సెన్స్‌గాళ్లకుందా? హైదరాబాదు నగరంలో మురికివాడలు రోజు రోజుకీ పెరగటానికీ... వారికి కనీస అవసరాలు తీర్చుకునే అవసరాలు లేకపోవటానికీ....ఈ దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక-సామాజిక అంతరాలకు సంబంధం వుందని ఈ సినిమాలవారికెప్పుడర్థమవుతుంది? పేద రికం పెరుగుతున్నకొద్దీ దొంగతనాలూ, వ్యభిచారం, నేరప్రవృత్తులు, తాగుడూ, నిర్లక్ష్యం పెరిగిపోతాయనే కనీస సామాజిక పరిచయంలేని దర్శకులు "అపరిచితులు"కాక మరేమవుతారు?

నగరాలకూ-పల్లెలకూ; చదువు కున్నవారికీ-లేనివారికీ, కలిగినవారికీ-లేనివారికీ ధనస్వామ్య పాలకులకూ-అణచివేతకు గురవుతున్న ప్రజానీకానికీ నడుమ అంతరాలు పెరిగిపోయే: కొద్దీ సామాజిక, సాంస్కృతిక సమస్యలు విపరీతంగా పెరుగుతాయి. వీటిని పెంచి పోషించే రాజ్యవ్యవస్థ, ఆర్థిక పరిస్థితులూ తొలగనంత వరకూ సవాలక్ష కుక్కమూతి పిందెల్లాంటి సమస్యలు తలెత్తుతూనే వుంటాయి. రోమలనుత్పత్తిచేసే కుళ్లు దోపిడీ వ్యవస్థ నొదిలి, అవి సృష్టించే సమస్యలే లోకం సమస్యలుగా చూపటం, అమెరికావాడు తాను సృష్టించిన టెర్రరిస్టుల మీద యుద్ధం చేస్తున్నానని మనల్ని నమ్మించే ప్రయత్నం లాంటిదే.

సాహిత్య అధ్యయనం విడనాడిన నేటి విద్యార్థులు తమ కెరీర్ మీద దృష్టి పెట్టినందున 'అపరిచితుడు' ప్రబోధిస్తున్న క్రమశిక్షణతో లక్ష్యాన్ని ఎంచుకోవడం వంటి హితోక్తులకు కన్విన్స్ అయి అపరిచితుడు చేస్తున్న హత్యాకాండను సమర్థిస్తున్నారు. సినిమాను ఆస్వాదిస్తున్నారు. ఇది మన దౌర్భాగ్యం.

శంకర్ రూపొందించిన చిత్రాల గురించి ప్రస్తావించటం అప్రస్తుతం కాదు. "జంటిల్ మెన్"లో రిజర్వేషన్ల వల్ల హీరో తమ్ముడికి మెడిసిన్ సీటు రాక ఆత్మహత్య చేసు కొంటాడు. దీంతో హీరో సాహసోపేతంగా దొంగతనాలు చేసి ప్రజల అవసరాలకు ఆదుకొంటాడు. "బాయ్స్"లో లైంగిక విశృం ఖలత్వాన్ని కుర్రకారు, స్టూడెంట్స్‌లో ప్రేరే పిస్తాడు. "ప్రేమికుడు"లో ఆర్థిక, సామాజిక అంతరాలను విస్మరించి పిచ్చి, వెర్రి ప్రేమను ప్రబోధిస్తాడు. "భారతీయుడు"లో మన కళ్ళ ముందు కనపడే డాక్టర్లు, ఉద్యోగులు చేసే అవినీతిని ప్రధానంచేస్తూ ఉన్నతస్థాయి అవినీతి, కుంభకోణాల జోలికి వెళ్ళడు. "ఒకే ఒక్కడు"లో ఒక వ్యక్తి ఒక్క రోజులో ప్రజానుకూలంగా దేశాన్ని బాగు చేయవచ్చని, రాజ్యాంగ వ్యవస్థపట్ల, ఏ వీరభోగ వసంత రాయుడో వచ్చి పరిష్కరి స్తాడనే భ్రమలు కల్పిస్తాడు. కంప్యూటర్ గ్రాఫిక్స్ మాయా జాలంతో, మషాలా దట్టించి, వీటికి సామా జిక సమస్యలను (?!) జోడించి తీస్తున్న ఈ సినిమాలు ప్రజల మెదళ్ళను ఖరాబుచేస్తూ ప్రస్తుత దోపిడీ వ్యవస్థ మూలాలను పట్టించు కోకుండా ప్రాణం పోస్తున్నాయి. అపరిచితుడు కాన్సెప్ట్ ప్రకారం యువతరంలో పతన విలువలు ప్రోత్సహిస్తూ, ప్రజలను ప్రక్కదారి పట్టిస్తున్న ఈ దర్శక శిఖామణికి గరుడ పురాణం ప్రకారం ఏ శిక్ష విధించాలో ప్రజలు ఆలో చించాలి. ఫాసిస్టు ధోరణులను ప్రేరేపించే అపరిచితుడు విజయవంతం కావడం వల్ల ప్రజలపై జరుగుతున్న సామ్రాజ్యవాద, సాంస్కృతిక దాడిపట్ల ప్రజానీకం అప్రమత్తంగా వుండాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. *

కవిత

యుద్ధంలో మరణిస్తున్న వారి చివరి సందేశం

- అనిశెట్టి రజిత

అతను జీవితాన్ని స్పృశిస్తున్న బాటసారి
సంబంధాలను పరామర్శిస్తున్న పర్యాటకుడు
పలకరిస్తూ ప్రయాణిస్తూ దస్సిపోయి
సొమ్మసిల్లే సమయంలో
ఒక జలపాతం కోసం వెతుక్కుంటూ
తనివి తీరా దాహం తీర్చుకొని స్నానమాడాలనుకున్నాడు
జలపాతం...నీటివాగు....చల్లదనం... తుంపర్లు
ఊహించుకుంటూ జలపాతం కిందికి చేరాడు
కానీ అక్కడంతా చిక్కటి చిత్తడి
పచ్చి నెత్తురు వాసనల కొనఊపిర్ల రాపిడి
అన్ని దిక్కుల్నుండీ వడగాల్పులు
ముట్టడించిన మంటతో
భయంగా బాధగా అరిచాడతడు
ఇదేంటి నీళ్ళులేవా రక్తమెక్కడిదని?

హఠాత్తుగా ఆ పరిసరాల్లోని చెట్లూ గుట్టలూ
మాయమయ్యి విరిగిన కొమ్మల్లా
పడిపోయిన చెట్లలా మూలుగుతూ
బూడిద కుప్పల్లో కూరుకుపోయిన
ఫేనిక్స్ పక్షుల అస్థికల గూళ్ళలా
ఆకారాలు దాల్చిన పసిపిల్లలూ పౌరజనం
రోదిస్తూ... హాహాకారాలతో..

దాడి బాబూ! ఇక్కడ దాడి జరిగింది
మదించిన నియంతలు చేసిన అఘాయిత్యం ఇది
రక్తపిపాసుల రాద్ధాంతం ఇది
ఉన్మాదం ప్రకోపించిన ఆధిపత్యవాదం ఇది
బాబూ! మేము యుద్ధ దహనాలను
వ్యతిరేకించే సామాన్య జనులం

శాంతి సామరస్యాలను కోరుకునే ప్రజలం
చూసావా? మా మీద తూటాలు.. బాంబులు..
క్షిపణులు... తునాతునకలు మా దేహాలు
ఎవని పగకు ఎవని బలి?
వాడికి సిగ్గేరాదా లోకమంతా వెస్తున్నా వెలి?

ఇప్పుడు నీవున్నది సేద తీర్చే వన విహారంలో
శరణార్థులు తలదాచుకునే అరణ్యగర్భంలో కాదు
మారణహోమాల మృత్యునీడల
యుద్ధ క్రీడాస్థలిలో...
యుద్ధమంటే ప్రాణాలు తీసే కిరాయివృత్తి
పాశవికత పెచ్చరిల్లే నీచ ప్రవృత్తి
యుద్ధమంటే ఆయుధాల వ్యాపారం
గెలుపోటముల ప్రయోగశాల బాబూ!
నీవిక యుద్ధంతో సంబంధంలేని
మజిలీలు చేయలేవు
శవాల కుప్పలులేని ప్రాంతాన్ని చూడలేవు..

చిట్టచివరి జీవితుడిగా
నీ కళ్ళముందరే నీ వాళ్ళు
తెగిన మాంసం ముద్దలవుతుంటారు
చూస్తుండగానే పాలుగారే పసిమొగ్గలు
రక్తపుష్పాలై రాలిపోతుంటాయి
వేలాదిమంది బంధుజనాల ఊపిర్లు
నీటి బుడగల్లా చిట్లిపోతుంటాయి
నీవూ నీవుగా మిగలవు...

బాబూ! ఇది యుద్ధభూమి
నాకు చేతగాని యుద్ధం నీవు చేయాల్సిందే
శత్రుత్వమేమీ లేకున్నా తలపడాల్సిందే
రణజ్వాలలకు దయాదాక్షిణ్యాలుండవు
అహంకృత ద్వేషాలకు సహేతుక కారణాలుండవు
యుద్ధంలో విధ్వంసమే సిపాయితనం
మనుషుల్ని చంపటమే వీరత్వం

మన తల్లులూ పిల్లలూ మారణాయుధాలు
పట్టిన వాస్తవాల్నే చూస్తావు
నీ ఇల్లూ నీ ఊరూ
కుప్పకూలిపోయి సగం సగం కాలిన
శకలాల కమురు వాసనలతో దృశ్యాలు
నీవిక యుద్ధంలేని ప్రపంచాన్ని చూడలేవు
యుద్ధంలో క్షతగాత్రులమై మరణిస్తూ
ఇస్తున్న చివరి సందేశం ఇది;
యుద్ధమంటే కసిగా బలి చేయాలి
లేదా ఎవని కసికో బలికావాలి
హతునివో హంతకునివో
అంతే బాబూ! అంతే!

❖

గల్పిక:

ఆనందం

- అలగ్జేండర్ కుప్రిన్

మహా జారుచక్రవర్తి దేశంలో గల అందరు కవులనూ, పండితులనూ సమావేశం కావాల్సిందిగా అజ్ఞాపించారు. వాళ్ళని యిలా ప్రశ్నించాడు.

"ఆనందం అనేది ఎందులో వుంది?"

మొదటివ్యక్తి ఎంతో ఆదుర్దాగా "దీనిలో- అంటే దైవత్వంతో ప్రకాశించే మీ ముఖారవిందాన్నిచూసి, ఎల్లప్పుడూ ఆనందానుభూతిని పొందటంలో" అన్నాడు.

"వీడి కళ్ళు పీకి పారేయండి!" అన్నాడు జారు అనాసక్తంగా. "తర్వాత" అన్నాడు.

"ఆనందమే అధికారం. జారు ప్రభువులైన తమరు ఎంతో ఆనందంగా వున్నారు" అన్నాడు తరువాతి వ్యక్తి.

"నువ్వూ అదే చెప్పావు. నేను శారీరకంగా బాధపడుతున్నాను. దాన్ని నయం చేయ కలిగిన అధికారం నాకు లేదు. ఈ అబద్ధాలకోరు ముక్కు పచ్చడి చేయండి! తర్వాత" అన్నాడు.

"సంపదే ఆనందం" అన్నాడు తర్వాతి వ్యక్తి బెరుకు బెరుకుగా.

"నేను సంపన్నుణ్ణే. అయినా నేనే ఆనందం అంటే ఏమిటి? అని ప్రశ్నిస్తున్నాను. నీ తలకాయ ఎత్తు తూకంగల బంగారాన్ని యిస్తే నీకు తృప్తిగా వుంటుందా?" అన్నాడు జారు చక్రవర్తి.

"ఓ మహాప్రభో!"

"నీకు అంత తూకంగల బంగారం యిస్తారు. వీడి పీకకు వీడి తల బరువంత ఎత్తుగల బంగారపు ముద్దను కట్టి, ఈ ముష్టి వెధవని సముద్రంలోకి విసిరివేయండి!" అన్న జారు చక్రవర్తి. "నాల్గోవాడు" అన్నాడు.

అప్పుడు చిరికిపాతల గుడ్డల్ని కట్టుకొని, జ్వరం వచ్చిన కళ్ళతో వున్న ఒక వ్యక్తి తన పొట్టమీద పాకుకొంటూ వచ్చి

"ఓ మహాతెలివైన చక్రవర్తీ! నాకేం అక్కర్లేదు. నాకు ఆకలిగా వుంది. నన్ను సంతృప్తిపరచు. నాకు ఆనందమేస్తుంది. నేను నీ పేరు, ప్రఖ్యాతలను ఈ విశ్వమంతటా కీర్తిస్తాను" అన్నాడు.

"వీడికి కడుపునిండా భోజనంపెట్టి మేపండి" అన్నాడు ఏవగింపుగా. "వీడు తిండి ఎక్కువై కడుపు పగిలి చచ్చినప్పుడు నాకు తెలియచేయండి" అన్నాడు.

తర్వాత యిద్దరు ముందుకొచ్చారు. వారిలో ఒకడు దృఢమైన దేహంతో, లోతైన నుదురుగల క్రీడాకారుడు. "సృష్టిలో వుంది ఆనందం" అన్నాడు అతడు.

రెండవ వాడు బక్కపలచగా పాలిపోయివున్న ఒక కవి. వీడి రెండు బుగ్గలపైనా మెరుస్తున్న రెండు మచ్చలు వున్నాయి. "ఆరోగ్యంలో వుంది ఆనందం" అన్నాడతడు.

కానీ జారు చక్రవర్తి వెగటుగా చిర్నవ్వు నవ్వి యిలా అన్నాడు.

"మీ యొక్క తలరాతను మార్చగలిగే శక్తే కనుక నాలో వుంటే, కవిగారూ! నువ్వు ఒక నెల రోజుల్లో కవితోత్సాహంకోసం ముష్టెత్తుకుంటావు. హెర్క్యులెస్ ప్రతిరూపంగా వున్న ఓ క్రీడాకారుడా! నువ్వు నీ బరువు తగ్గించుకోవటానికి మాత్రల కోసం డాక్టర్ల చుట్టూ తిరుగుతావు. ప్రశాంతంగా యిద్దరూ వెళ్ళిపోండి. ఇంకా ఎవరున్నారు?"

పుష్పాలతో అలంకరించుకొన్న ఏడవ వ్యక్తి "నేను ఒక సాధారణ మానవమాత్రుణ్ణి. ఆనందం అనేది ఉనికిలో లేకపోవటంలో వుంది" అన్నాడు బడాయిగా.

"వీడికి శిరచ్ఛేదం చేయండి!" అన్నాడు చక్రవర్తి ఎంతో బద్ధకంగా.

"మహాప్రభో! దయచూపండి. నా ఉద్దేశ్యం అదికాదు" అంటూ పాలిపోయిన ముఖంతో వేడుకొన్నాడు.

"వీణ్ణి తీసుకుపోయి తల నరకండి. చక్రవర్తి మాట అంటే అది కఠిన శిల లాంటిది అన్నాడు చక్రవర్తి.

చాలామంది యితరులు వచ్చారు. వారిలో ఒకడు రెండే పదాలు అన్నాడు.

"స్త్రీ యొక్క ప్రేమ" అని.

"మంచిది" అంటూ జార్ ఒప్పుకొన్నాడు". వీడికి మనదేశంలో వందమంది గొప్ప అందగత్తెలైన యువతులనూ, స్త్రీలనూ యివ్వండి. దాంతోపాటు ఒక.ఉగ్గు గిన్నెడు విషం కూడా యివ్వండి. సమయం వచ్చి నప్పుడు నాకు చెప్పండి. నేను వీడి శవాన్ని ఒకసారి చూస్తాను" అన్నాడు.

మరొకడు

"ఆనందం అనేది నా కోర్కెలను వెన్వెంటనే పరిపూర్తి చేయటంలో వుంది" అన్నాడు.

"అయితే యిప్పుడు నీకు ఏం కావాలి?" అన్నాడు జారు చక్రవర్తి ఎంతో నేర్పరి తనంగా.

"నాకా?"

"అవును నీకే"

"మహాప్రభో...యీ ప్రశ్న నేను ఎన్నడూ వూహించనిది"

"వీణ్ణి నిలువునా పాతిపెట్టండి. ఓహో మరో తెలివైన మనిషా?. మంచిది. కొంచెం ముందుకు రండి. బహుశా ఎందులో ఆనందం వుందో మీకు తెల్సివుండొచ్చు" అన్నాడు చక్రవర్తి.

అతడు నిజంగా తెలివైన వ్యక్తే!. అతడు "ఆనందం అనేది మానవుని ఆలోచనలో వుంది" అన్నాడు.

"ఓహో. మానవుని ఆలోచనలోనా? మానవ ఆలోచన అంటే ఏమిటి?" అన్నాడు చక్రవర్తి.

అతడు నిజంగా తెలివైన వ్యక్తే కాబట్టి, జాలిగా నవ్వుతూ, అతడి ప్రశ్నకు తిరిగి జవాబు యివ్వకుండా మవునంగా అలాగే నుంచొని వున్నాడు.

అప్పుడు జారు చక్రవర్తి అతడ్ని బయటి నుండి ఏ శబ్దమూ వినిపించని, చిమ్మచీకటిగా వుండే భూగర్భఖైదులో బంధించాల్సిందిగా ఉత్తర్వు యిచ్చాడు.

ఒక సంవత్సరం తర్వాత ఆ ఖైదీని తిరిగి జారు చక్రవర్తి ముందుకు తీసుకువచ్చారు. అప్పటికే అతడు చెవిటివాడు, గ్రుడ్డివాడు అయిపోయాడు. అతడు తన కాళ్ళమీద తాను నుంచోలేని స్థితిలో వున్నాడు.

"నువ్వు యిప్పుడూ ఆనందంగానే వున్నావా?" ప్రశ్నించాడు జారు చక్రవర్తి.

"అవును. నేను ఆనందంగానే వున్నాను. నేను ఖైదులో వున్నంతకాలం జారు చక్రవర్తిని. బాగా ధనవంతుడ్ని. ప్రేమలో పడ్డవాడిని. నేను కడుపునిండా తిన్నాను. ఆకలితోనూ వున్నాను... యివన్నీ నాకు నా ఆలోచనలు సమకూర్చాయి" అని ఎంతో నిశ్చలంగా అతడు బదులిచ్చాడు.

"అప్పుడు. ఆలోచన అంటే ఏమిటి?" అని ప్రశ్నించాడు జారు అసహనంగా.

"నేను యింకో ఐదు నిమిషాల్లో నిన్ను వురితీసి, నీ ముఖంమీద ఉమ్మువేయ బోతున్నాను. గుర్తుంచుకో. ఇప్పుడు చెప్పు. మరి నీ ఆలోచనలు నీకు ఉపశాంతి నిస్తాయా? నువ్వు యిప్పుడు ఎంతో గొప్పగా చేసిన ఆలోచనలు అప్పుడు ఎక్కడుంటాయి?" అని ప్రశ్నించాడు జారు చక్రవర్తి.

అతడు నిజంగా తెలివైన వ్యక్తి కాబట్టి "తెలివితక్కువ దద్దమ్మా! ఆలోచనకు మరణం లేదు" అన్నాడు మరింత నిశ్చలంగా.

(రష్యన్ నుండి ఇంగ్లీషు అనువాదం డగ్లస్ ఏష్బే) ఇంగ్లీషు నుండి తెలుగు అనువాదం: జి.వి.భద్రం.

పరిచయం:

కొన్ని కొత్త, పాత సాహిత్య, సాంస్కృతిక పత్రికలు

1970-80 ప్రాంతాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ఎన్నో చిన్న చిన్న సాహిత్య, సామాజిక పత్రికలు వస్తుండేవి. వాటిలో కొన్ని వామపక్ష, విప్లవ భావజాలాన్ని ప్రచారంచేస్తే, మరికొన్ని అభ్యుదయకర, ప్రగతిశీల భావాలతో నిండిన రచనలతో నిండి వుండేవి. క్రమంగా అవన్నీ అదృశ్య మయ్యాయి.

ఇప్పుడు తెలుగులో ప్రచురింపబడుతున్న కొన్ని చిన్న పత్రికలను ప్రజాసాహితి పాఠకులకు పరిచయం చేస్తున్నాం. సిద్ధాంత పరంగా చూస్తే ఈ పత్రికలలో వివిధ రకాల భావజాలం కనబడుతుంది. అయినా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో వివిధ రకాల భావజాలాలలో జరుగుతున్న కృషి గురించి తెలుసుకోడానికి ఈ పరిచయం ఉపయోగ పడుతుంది.

1. చినుకు: గతంలో ఒక దశాబ్దం క్రితం ఈ పేరుతో గుంటూరు నుండి పాపినేని శివశంకర్ ఒక సాహిత్య బులెటిన్ నడిపి ఆపేశారు. అదే పేరుతో ఏప్రిల్ 2005 నుంచి నండూరి రాజగోపాల్ సంపాదకత్వాన విజయవాడ నుండి వస్తున్న ఈ సాహిత్య మాస పత్రిక వెల పది రూపాయలు. 1/8 డెమ్మీ సైజులో 64 పుటలతో ప్రచురింప బడ్తోంది. అశోక్‌కుమార్ నెల నెలా ఈ పత్రికలో శ్రీశ్రీ క్విజ్‌నూ, మధ్యపుటలలో మినీ కవితల వేదిక 'అణువు' శీర్షికలను నిర్వహిస్తున్నారు. సంప్రదాయ, అభ్యుదయ, విప్లవ భావజాలం గల కథలు, కవితలు, వ్యాసాలు, వార్తలు, పుస్తక సమీక్షలు ప్రచురిస్తున్నారు. జూన్ 2005 సంచిక మహాకవి శ్రీశ్రీ ప్రత్యేక సంచికగా వెలువడింది.

చిరునామా: 27, 28-3వ అంతస్తు, దత్తాస్ నయా బజార్, రాజ్, యువరాజ్ థియేటర్స్ ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ-520 003. సంవత్సర చందా రు.100/-.

2. రమ్యభారతి: విజయవాడ నుండే ఫిబ్రవరి 2004 సంచికతో ప్రారంభింపబడిన ఈ సాహిత్య త్రై మాసపత్రికకు ఎడిటర్ చలపాక ప్రకాశ్. 1/8 సైజులో 34 పుటల ఈ పత్రిక వెల: రు.6/-. సంవత్సర చందా రు.25/-. కవితలు, సమీక్షలు, రచయితల పరిచయాలు, పుస్తకావిష్కరణలు, సాహిత్య సభల వార్తలతో పుస్తక పరిచయ విశేష సంచికగా మే-జూలై 2005 సంచిక విడుదలైంది.

చిరునామా: ఎడిటర్, రమ్యభారతి, పోస్టు బాక్స్ నెం.5, పి.ఏ.మార్కెట్, షాపు నెం.61, జండా వీధి, విజయవాడ-1. దూరవాణి: 9247378411.

3. మానవ వికాసం: ఇది మానవవాద మాస పత్రిక. జనవరి 2005 నుండి హైదరాబాదు కేంద్ర స్థానంగా ప్రచురింప బడుతోంది. 1/8 సైజులో 36 పుటలు గల ఈ పత్రిక ఖరీదు రు.10/-. సంవత్సర చందా రు.100/-. బాల్య వివాహాలపై సంపాదకీయం, ఈమని శివనాగిరెడ్డి, కె.అయ్యన్న, మల్లాది సుబ్బమ్మ, ఎన్.ఇన్నయ్య, బి.సాంబశివరావు, ఇసనాక మురళీధర్ మొదలగువారి రచనలతో జూన్ సంచిక వెలువడింది. మానవ వికాస వేదిక, ఆంధ్రప్రదేశ్ వారి నిర్వహణలో ఇది ప్రచురింపబడ్తోంది. సంపాదకుడు: ఎన్.విక్రమ్.

చిరునామా: మానవ వికాసం, 5-22-9, జె.పి.యన్.నగర్, మియాపూర్, హైదరాబాదు-500 049. దూరవాణి: 040-23042528.

4. కళాదీపిక: వి.యస్.రాఘవాచారి సంపాదకుడుగా 1/4 సైజులో 12 పుటలతో తిరుపతి నుండి ప్రచురింపబడుతున్న ఈ మాస పత్రిక సంవత్సర చందా రు.60/-.

ఇది కళా సాహిత్యరంగాల భూమికగా, కళాకారుల పరిచయ వేదికగా వెలువడు తోంది. స్తోత్రాలు, సంప్రదాయ నాటక రంగం, రాయలసీమ ప్రాచీన సాహిత్యం, మనుచరిత్ర, చిత్రకళా వికాసం, రుంజ వాద్యం, సాహిత్య, సాంస్కృతిక సంస్థల సభల వార్తలు, నాటక పోటీల వార్తలు మొదలగు వాటితో మార్చి-ఏప్రిల్ 2005 సంచిక వెలువడింది.

చిరునామా: కళాదీపిక, మాస పత్రిక, 12-202, తిలక్ రోడ్డు, తిరుపతి-517 501. దూరవాణి: 0877-2001645

5. హాసం క్లబ్ బులెటిన్: చక్కని అభిరుచితో హాస్యం, సంగీతం మేళవించిన రచనలతో 2004 డిశంబరు వరకు ప్రచురింపబడిన హాసం, పక్షపత్రిక తరఫున ప్రారంభమైన హాసం క్లబ్‌కు సంబంధించిన బులెటిన్ ఇది. 1/8 సైజులో 16 పుటలతో వెలువడుతోంది. హాసం బుక్స్ గురించీ, హాసం క్లబ్‌ల గురించీ విశేషాలుంటాయి.

వివరాలకు: హాసం ప్రచురణలు, ఇ-101, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, మదీనాగూడ, హైదరాబాదు-500 049. దూరవాణి: 040-23047638.

6. మూసీ: బి.ఎన్.శాస్త్రిగారి సంపాద కత్వాన గతంలో హైదరాబాదు నుండి వెలువడిన ఈ సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక మాస పత్రిక ఆయన 2002 ఏప్రిల్ 4న మరణించడంతో తాత్కాలికంగా ఆగిపోయి, ఏప్రిల్ 2005 సంచికతో ఇప్పుడు డా॥ సాగి కమలాకరశర్మ సంపాదకత్వాన పునఃప్రారంభమైంది. 1/4 సైజులో 40 పుటలు గల ఈ పత్రిక వెల రు.10/-. సంవత్సర చందా రు.100/-. ఎక్కువగా సంప్రదాయ సాహిత్యం, చారిత్రక వ్యాసాలు వున్న మే 2005 సంచికలో అంపశయ్య నవీన్ రాసిన చీకటి రోజులు నవలపై ఆచార్య పేర్వారం జగన్నాథం రాసిన సాహిత్య వ్యాసం వుంది.

చిరునామా: మూసీ, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాదు-500 027. దూరవాణి: 27560616, 27550530

7. నేటి నిజం: ఇది హైదరాబాదు నుండి బైస దేవదాసు సంపాదకత్వాన గత 11 ఏళ్ళుగా వెలువడుతున్న స్థానిక దినపత్రిక. అయితే ప్రతి గురువారం దాదాపు 2 పుటలు (దినపత్రిక సైజులో) సాహిత్యానికి కేటా యించి, వ్యాసాలు, కవితలు, కథలు, సమీక్షలు ప్రచురిస్తున్నారు. అంతేగాక సంవత్సరానికి 4 ప్రత్యేక సాహిత్య సంచికలు 1/4 సైజులో 70 పుటలతో ప్రచురిస్తున్నారు. 'సాహితీ కెరటాలు' గల నేటి నిజం 52 సంచికలూ, 4 ప్రత్యేక సంచికలు కలిపి సంవత్సర చందా రు.100/-.

చిరునామా: నేటి నిజం, ఎస్.ఆర్.టి. 74, జవహర్ నగర్, హైదరాబాదు-500 020. దూరవాణి: 27662477, 27632012

8. ప్రజాతంత్ర: ఎనిమిదేళ్ళ క్రితం బ్రాడ్‌షీట్ సైజులో దేవులపల్లి అమర్ సంపాదకత్వాన సంపూర్ణ స్వతంత్ర వార పత్రికగా ప్రారంభమైన ఈ పత్రిక ఇటీవల 1/4 సైజులో 34 పుటలతో వెలువడుతోంది. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వ్యాసాలు, రచయితల పరిచయాలు, కవితలు, సాహిత్య వ్యాసాలు, కథలు మొదలైన రచనలతో వెలువడుతున్న ఈ వార పత్రికకు ప్రస్తుత సంపాదకుడు దేవులపల్లి అజయ్. వెల: రు.5/-.

చిరునామా: ప్రజాతంత్ర హౌజ్, 12-1-62, విజయా గార్డెన్స్, బండ్లగూడ, నాగోల్, రంగారెడ్డిజిల్లా.

దూరవాణి: 55583424. ఫ్యాక్స్: 24221908

9. భావవీణ: కొల్లా శ్రీకృష్ణారావు సంపాదకత్వాన గుంటూరు నుండి ప్రచురింప బడుతున్న సాహిత్య మాస పత్రిక ఇది. 2004 జనవరి నుండి (తరువాయి 13వ పేజీలో)

సలహాలు

- కొప్పల సృజన (6వ తరగతి)

ఒక ఊరిలో రాంబాబు అనే అబ్బాయి వున్నాడు. అతడు చదువుకున్నాడు కాని ఉద్యోగం దొరకలేదు. చాలాసార్లు ఉద్యోగం వచ్చినట్లే వచ్చి, అతడు లంచం ఇవ్వకపోవడంవల్ల నిరుద్యోగిగానే వున్నాడు. ఖాళీగా వుండటమెందుకని ఒక పుస్తకాల దుకాణం, తను చదివిన కళాశాల ఎదుట పెట్టాలనుకున్నాడు. ఈ విషయం తన స్నేహితులకూ, చుట్టాలకూ చెప్పాడు. అందరూ అతన్ని భుజంతట్టి ప్రోత్సహించారు.

రాంబాబు ఒక రోజున దుకాణం ప్రారంభించి చుట్టాల్ని, స్నేహితుల్ని పిల్చాడు. దుకాణంలో తన కిష్టమైన వెంకటేశ్వరస్వామి పటాన్ని పెట్టాడు. ప్రారంభోత్సవానికి ఒక్కొక్కరే రావడం ప్రారంభించారు. ఒక మిత్రుడు దుకాణమంతా చూసి, రాంబాబుతో "అన్ని అడ్డంకులను తొలగించే దేవుడు వినాయకుడు. అతని పటం కూడా పెట్టు" అని సలహా ఇచ్చాడు. ఈ సలహా బాగానే వుందనిపించి వినాయకుడి పటాన్ని దుకాణంలో పెట్టాడు.

ఆ తర్వాత వచ్చిన మరో మిత్రుడు "అసలు డబ్బుకు దేవత లక్ష్మీదేవి గనుక. ఆ పటం కూడా వుంటే మంచిది కదా" అన్నాడు. వెంటనే రాంబాబు లక్ష్మీదేవి పటాన్ని తెప్పించి పెట్టించాడు. అతనితో వచ్చిన మరోవ్యక్తి "మహాలక్ష్మి ప్రక్కన మహావిష్ణువు పటాన్ని పెడితే చూడముచ్చటగా వుంటుంది" అని అన్నాడు. అతని మాట తీసివేయలేక రాంబాబు అలాగే చేశాడు.

ఇంతలో వచ్చిన రాంబాబు దూరపు బంధువు "పుస్తకాల దుకాణంలో చదువుల తల్లి సరస్వతి పటం లేకుండా ఎలా?" అన్నాడు. రాంబాబుకి ఈ మాట బాగా నచ్చి, ఆ పటాన్ని తెచ్చిపెట్టాడు. అయ్యప్ప భక్తుడైన మరో మిత్రుడు -"అసలిప్పుడు మహత్తుకల్గిన దేవుడు అయ్యప్పే. ఆయన పటానికి రోజూ పూజచేస్తే వ్యాపారానికి ఢోకా వుండద"ని సలహా ఇచ్చాడు. ఈ సలహానీ కాదనలేకపోయాడు రాంబాబు.

ఇలా సాయంత్రానికల్లా బంధు, మిత్రుల సూచనలతో దుకాణమంతా దేవుళ్ళ పటాలతో నిండిపోయింది. పుస్తకాలకోసం చేయించిన అరలన్నీ పటాలు ఆక్రమించాయి. పుస్తకాలు ఎక్కడ పెట్టాలో రాంబాబుకు తోచలేదు. ఇంతలో మరో మిత్రుడు వచ్చాడు. అతను దుకాణమంతా చూచి, 'ఇది పుస్తకాల దుకాణమా, పటాల కొట్టా' అని అడిగాడు.

రాంబాబు జరిగిందంతా ఆయనతో చెప్పాడు. అప్పుడతను పెద్దగా నవ్వి, "ఓరి పిచ్చోడా! ఇలా దేవుళ్ళందర్నీ పూజించడం ప్రారంభిస్తే మనకిక వేరే పని చేయడానికి సమయం దొరకదు. దీని బదులుగా నీవు చేసే పనిపై శ్రద్ధ పెట్టి, వృత్తినే దైవంగా భావించి పూజిస్తే చాలు. నీకు మంచి జరుగుతుంది" అన్నాడు.

రాంబాబుకు ఈ సలహా బాగా నచ్చింది. దేవుళ్ళ పటాలన్నీ తీసివేసి, అరలనిండా పుస్తకాలు పెట్టాడు. శ్రద్ధగా పనిచేశాడు. మంచి వ్యాపారస్తుడిగా పేరు పొందాడు. ❖

అలసిన పువ్వుల ఆశలు

- నారా

"కాకి ఒకటి నీళ్ళకు..." పాటొకటి పాడమ్మా!
"పిచుకమ్మది పిడకలిల్లు..." కథనాకు చెప్పమ్మా!
చినుకు చినుకు చిందులేసిన
మట్టి వాసన గుబాళించిన
ఆటపాటల పండగల్ని
సాయం కాలాల్లో పండించమ్మా!

అక్షరాల గడులు గీసి
పాఠాలకు నన్ను కట్టేసి
కొట్టి తిట్టి కసురుకొనే
కాలాలను వెన్నెలగా
నెమలి కన్ను గిలిగింతలుగా
నవ్వుల పువ్వులు పూయించమ్మా!! ❖

కళ్ళు మూసినా-కళ్ళు తెరిచినా
కదిలే బొమ్మల బుల్లి పెట్టే!
అదే పనిగా పదే పదే
చూస్తుంటే చూపు మసకబారేనే!
బడిలో చెప్పే ఇంటిపని
కొండలు కొండలుగ పెరిగేనే!
ఆటాపాటా వంటికి మేలు
టీ.వీ. నొదిలితే కంటికి మేలు

- నారా

పెద్దలైన పాఠకులకు చిన్న సూచన

బాలసాహితి శీర్షికలో వచ్చే విషయాలను పనిగట్టుకుని పిల్లల చేత చదివించండి. వాళ్ళ స్నేహితులచేత చదివించేట్లు ప్రోత్సహించండి. చాలామంది తల్లిదండ్రులు, టీచర్లు తమ పిల్లలకు టీ.వీ.లు, సినిమాల మీద చూపుతున్న ఆసక్తి చదువుమీద లేదని వాపోతుంటారు. కోతి చేతికి ఒక వస్తువు దొరికిందే అనుకుందాం. దాన్ని ఎలా తీసుకుంటాం? బెదిరిస్తే అదీ బెదిరిస్తుంది. కొట్టబోతే పైకెళ్ళి కూర్చుంటుంది. దాని చేతికి వేరొక వస్తువును ఇచ్చి మన వస్తువును దాని చేతిలోనుండి తీసుకోవాలని మనం దరకూ తెలిసినదే. సహజమైన విషయమే. ఇదీ అంతే. ప్రత్యామ్నాయ కార్యక్రమాల మీదికి దృష్టి మళ్ళించకుండా ఏది మీరు సరైంది కాదనుకుంటున్నారో దాన్ని పిల్లలకు దూరంగా ఉంచలేరు. బాలసాహితిని చదివించడం మీ విధిగా భావించమని మా సూచన.

సెప్టెంబర్‌లో ముఖ్యమైన తేదీలు

డా॥ రాజారావు మరణం	8.9.1964
జూలియస్ ఫ్యూజిక్ ఉరి	8.9.1943
సుంకర సత్యనారాయణ మరణం	9.9.1975
సుబ్రహ్మణ్యభారతి మరణం	12.9.1921
ఉన్నవ లక్ష్మీనారాయణ మరణం	25.9.1959
రాజా రామమోహనరాయ్ మరణం	27.9.1833

❖

పాట

చెత్తకుప్పల మధ్య చెదిరిన బాల్యం

- కె.సుదర్శన్ చక్రవర్తి, (సీనియర్ ఇంటర్)

చిట్టిపొట్టి పాపలం- మేమంత చిన్నారి బాలలం
మా పొట్ట కూటి కోసం వెట్టి చాకిరీ చేసే
బాల కార్మికులం
చెత్తకుప్పల మధ్యనే- ఓరన్నా చేజారెను మా బాల్యము
చేత పలకబట్టి బడికిపోయే అదృష్టం మాకు దూరము
రోగాలు రొష్టులన్నీ- మా దగ్గర చుట్టాలన్నా
మమ్మల్ని ఎప్పుడు విడిపోని ఆప్తమిత్రులన్నా
సందులు గొందులతోనే-మాకు దోస్తీ అన్నా
వ్యాధులు బాధలు ఎన్ని వచ్చినా తోడు ఉండదన్నా-
మా గోడు వ్యర్ధమన్నా. ||చిట్టి||
కడుపునిండుగా తిన్నామంటే-మాకు పండగన్నా
ఆ పండగ కూడా ఏడాది కొకసారి మించదన్నా
బంధాలు, బాంధవ్యాలు-మాకు దూరమన్నా
ఆనందాలు, ఐశ్వర్యాలు, మాకు దూరమన్నా ||చిట్టి||
తల్లి ఎవరో, మా తండ్రి ఎక్కడుంటాడో
ఎందుకు పుట్టామో ఎలా పెరిగామో మాకు తెలియదన్నా
మాకు తెలిసిందల్లా కాగితాల సేకరణేనన్నా
ఇది సత్యమన్నా-మరి నువ్వు నమ్మకున్నా ||చిట్టి||
ప్లాట్‌ఫారమ్, హంస తూలిక తల్పమన్నా
అది కూడా పోలీసోళ్ళు చూడనంత వరకే నన్నా
దోమల ఝుంకారాలు, మాకు సాధారణమేనన్నా
వాటి కరుణతోనే మాకు కంటినిండా కునుకన్నా
లేదంటే మాకు ప్రతి రాత్రి శివరాత్రే నన్నా
మరి జాగారాలు తప్పవన్నా ||చిట్టి||
చెప్పుకుంటే పోతే మా బాధలు అనంతమన్నా
వాటిని లెక్కవెయ్యాలంటే, గణితశాస్త్రం చాలదన్నా
మా గోడు మొత్తం వింటానికి ఒక జీవితం చాలదన్నా
అందుకే ఏ ప్రభుత్వము మమ్మల్ని పట్టించుకోదన్నా ||చిట్టి|| *

విజ్ఞానశాస్త్ర ధారావాహిక-16

ప్రాచీన యుగాల్లో శ్రమ విభజన

- డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్

మానవ సమాజం శ్రమ మీదనే పూర్తిగా ఆధారపడుతుంది. శరీరశ్రమ లేకుండా మనుషులకు ఎన్నడూ జరగలేదు. గుహల్లో జీవించిన దశలోనైనా, గ్రామాలూ, పట్టణాల్లో కాలం గడిపినప్పుడైనా ప్రజలు ప్రతిదానికీ ఒళ్ళు వంచి కష్టపడుతూనే వున్నారు. శ్రమ లేకుండా వినియోగానికి వస్తువులూ, సంపదలూ ఏనాడూ సృష్టి కాలేదు. అయితే సమాజంలో అందరూ ఒకే రకంగా పనిచెయ్యరు. ఎక్కువమంది చెమటోడ్చినా కొందరు "బుద్ధిబలాన్ని" మాత్రమే ఉపయోగిస్తారు. ఈ రోజుల్లో "చదువుకున్నవారు" తగిన అవకాశాలు దొరక్క శరీరశ్రమ చెయ్యడానికి సిద్ధపడితే అది వారికీ, ఇతరులకూ కూడా అవమానకరంగా అనిపిస్తుంది. ఈ ఎక్కువ తక్కువలు మొదలై కొన్ని వేల సంవత్సరాలయింది. ఇది "అనాది"గా మాత్రం ప్రారంభమైన భావన కాదు. ఎందుకంటే తొట్టతొలి మానవ సముదాయాల్లో శ్రమ విభజన అంటూ ఉండేది కాదు. అందరూ కలిసి కష్టించేవారు. వేటలోనైనా, ఏరుకు తినడంలోనైనా పసిపిల్లలు తప్ప తిని కూర్చునే వర్గం ఉండేది కాదు. శ్రమకు ఫలితం అందరికీ సమానంగా దక్కేది. అప్పటి భాషలో "నేను" అనే పదమే ఉండేది కాదనీ "మేము' అనే మాటను మాత్రమే వాడేవారనీ కొందరు పరిశోధకుల అభిప్రాయం. ఈ సమానత్వం తగ్గి, పనుల నిర్వహణలో వ్యత్యాసాలు నెమ్మదిగా ఏర్పడసాగాయి. అయితే ఈ శ్రమ విభజన ఈనాటిది కాదు. ఆదిమయుగంలో ఇది మొదటిసారిగా గణాచారులూ, మంత్రగాళ్ళూ, మతపెద్దలూ, అతీతశక్తులను గారడీ ద్వారా వశపరుచుకునేందుకు ప్రయత్నించిన ఇతర వర్గాలతో మొదలయి ఉంటుంది. మనిషి మనుగడకు తిండీ, ఇల్లూ, బట్టలేకాక ప్రకృతి శక్తులతో సంపర్కం పెట్టుకుని వాటిని "మంచి" చేసుకోవడం కూడా చాలా అవసరమనిపించింది. ఆ రోజుల్లో కష్టాలకు ఎదురీదుతున్న మానవజాతికి ప్రకృతి ఎంత యదార్థమైనదిగా కనబడేదో వాటి వెనక ఉన్నట్టుగా వారు ఊహించుకున్న అతీతశక్తులు కూడా అంత యదార్థమైనవిగానూ అనిపించేవి. అందువల్ల ఇటువంటి పనులు చేపట్టడం సమాజ శ్రేయస్సు కోసమేనని అందరూ భావించారే కాని పని ఎగగొట్టే ఉపాయమని అనుకోలేదు.

ఆనాటి సమాజంలో మొదటిసారిగా పొడచూపుతున్న ఆధ్యాత్మిక ధోరణులవల్ల ఈ తొలి ఆటవిక పూజారులకు శరీరశ్రమ చేసే అవసరం తప్పింది. ఇలాంటివారు ఈనాటికీ అతి పురాతనమైన ఆదివాసీ తెగలలో కనిపిస్తారు. తరవాతి దశలలో ఆత్మకూ, శరీరానికీ ఉన్న తేడాలూ, అలాగే మనసుకూ, శరీరానికీ భేదాలూ, ఆలోచనకూ, ఆచరణకూ వ్యత్యాసాలూ అవగతం కాసాగాయి. ఇది అప్పటి సమాజాన్ని ప్రగతి పథాన ముందుకు నెట్టింది. ఇందులో భాగంగానే శరీరశ్రమకూ, మానసిక శ్రమకూ తేడాలు ఏర్పడడంతోటే సమాజంలో వర్గాలు కూడా మొదలయాయి. జీవనోపాధికై శ్రమించనక్కర్లేని అల్పసంఖ్యాక వర్గం ఒకటి తొలిసారిగా ఏర్పడింది.

ఒళ్ళు హూనం చేసుకోకుండా తీరికగా ఉండే అరుదైన అవకాశాన్ని మనుషులు మొదటగా ఆకాశాన్ని పరిశీలించడానికే ఉపయోగించుకున్నట్టు కనబడుతుంది. ఎక్కడో ఆకాశాన ఉన్న నక్షత్రాలకేసి చూడడమూ, వాటిని గురించి ఊహించుకోగలగడమూ మనిషితప్ప మరే జంతువూ చెయ్యలేని పని. నక్షత్ర పరిశీలన క్రమంగా ఒక ఉపయోగ కరమైన ప్రక్రియగా తయారు కాసాగింది. కాలంతోపాటు తారల , గ్రహాల కదలికలూ, కాలగణనానికి పనికొచ్చే ఈ మార్పులను బట్టి పరిసరాల్లో ప్రతి సంవత్సరమూ కలిగే పరిణామాలూ అన్నీ తమ జీవితాలకు పనికొచ్చేవిగా మనుషులు గుర్తించసాగారు. అప్పట్లో ఇది ఖగోళశాస్త్రంగా కాక మతభావనలతో కలగలిసిపోయిన అయోమయంగానే రూపొందినప్పటికీ మానవ నాగరికతకు ఇదే తొలి పునాది అయింది. ప్రాచీన ఈజిప్ట్‌లో గణితశాస్త్రాన్ని మొదలుపెట్టినది అక్కడి పూజారి వర్గమే. ప్రకృతిని గురించిన సమాచారమూ, దానితో బాటు మంత్రతంత్రాలూ ఇవే మొదటగా రూపొందిన జ్ఞాన, విజ్ఞానాలు. ఇవి సమాజాన్ని నియంత్రించగలిగే శక్తివంతమైన సాధనాలుగా రూపొందుతున్న కొద్దీ వీటిని అదుపులో ఉంచుకునే అల్పసంఖ్యాకులది క్రమంగా పైచెయ్యి కాసాగింది. ఉదాహరణకు ఈజిప్ట్‌లో నైల్ నది పొంగినప్పుడల్లా ప్రజలకు తీవ్రమైన నష్టం కలుగుతూ ఉండేది. రుతువుల మార్పును బట్టి ఇటువంటి దెప్పుడు జరుగుతుందో ఊహించి సరిగ్గా చెప్పగలిగిన గుళ్ళోని "శాస్త్రుర్లు" గారిని తక్కినవారు "నోరు వెళ్ళపెట్టుకుని" చూడడమే కాదు, తమ ప్రాణాలను కాపాడ గలిగిన దేవుడిగా కూడా భావించి ఉండవచ్చు.

అలాగే లిపులను ఉపయోగించి, రాతపని చెయ్యడం కూడా "పామరులకు" అసాధ్యంగా ఉండేది. దీని "రహస్యాలను" పూజారులు ఇతరులకు చెప్పేవారు కాదు. లిపి అనేది మొదటగా తయారైన సుమేరియన్ నాగరికతలో రాయడమనేది ఒక్క పెద్ద విషయంగా ఉండేది. జరిగిన విషయాలను రాసిపెట్టడమే కాదు, జరగబోయేవి కూడా పాత రచనల్లో దాగి ఉంటాయని అక్కడి పూజారులు ఊహించసాగారు. అందులో యదార్థంతో బాటు మంత్ర భావనలు కూడా ఉండేవి. అధిక సంఖ్యాకులు చేతులతో కష్టపడి పనిచేస్తున్న యుగంలో ఒక చిన్న మేధావివర్గం తయారు కాసాగింది. క్రమంగా ఈ రెండు వర్గాలకూ మధ్య పూడ్చలేని ఎడం ఏర్పడసాగింది. కేవలం తమ తెలివితేటలతో నెట్టుకు రాగలిగిన వర్గం ఇతర సామాన్య ప్రజలకు క్రమంగా దూరం అవుతూవచ్చారు. వారికి శరీరశ్రమ అంటే ఏహ్యాభావం పెరగ సాగింది. కండలు కరిగించి పనిచేసే వర్గం వారు అక్షరాలా గొడ్డుచాకిరీకి మాత్రమే పనికొస్తారనే భావన ఏర్పడింది. అక్షర జ్ఞానమూ, పదసంపదా, ఆలోచించ గలగడమూ "ఉన్నతమైన" లక్షణాలుగా భావించబడ్డాయి.

ఇలాంటి తూస్కార ధోరణిని దాచుకో వలసిన అవసరమూ తగ్గిపోయింది. క్రీస్తుకు పూర్వం 2000 ఏళ్ళ క్రితం తన కొడుకును "వ్రాయసకాడు"గా శిక్షణ నిప్పించదలచిన తండ్రి కుర్రవాడితో జరిపిన సంభాషణ చరిత్రకారులకు లభ్యమయింది. తండ్రి ఉద్బోధ ఈ విధంగా సాగుతుంది. "శరీరశ్రమ చేసేవాడికి అది చెయ్యడం తప్ప మరో మార్గంలేదు. రాతపని చేసేవాడికి తక్కిన బరువు బాధ్యత లేవీ ఉండవు. కమ్మరి చేతివేళ్ళు చూడు, మొసలి ఆకారంలో ఉంటాయి. వాడి దగ్గర ఒకటే కంపు. ఇళ్ళు కట్టేవాడెప్పుడూ పందిలాగా బురదలో దొర్లుతూ ఉండాలి. వాడి బట్టలు కూడా బురదతో అట్టలుకట్టి

ఉంటాయి. బాణాలు వేసేవాడు రాతిములికి కోసమని గాడిదలాగా ఎడారుల వెంట తిరగాలి. చాకలి నైల్‌నది ఒడ్డుకు వెళితె మొసళ్ళు వాణ్ణి పలకరిస్తూ ఉంటాయి. అదే వ్రాయసకాడవైతె ఎవరూ నిన్ను గదమాయించలేరు. రాజుగారింటి భోజనం లభిస్తుంది. మంచి జీవితం, ఆరోగ్యం, సిరిసంపదలూ ఉంటాయి. నీకేకాదు, నీ పిల్లలకూ, వారి పిల్లలకూ అందరికీని."

ప్రాచీన గ్రీక్ నాగరికతలో కూడా ఇటువంటి భావనలే ఉండేవి. "చేతిపని చెయ్యడం అవమానకరం. పొద్దస్తమానమూ గదిలో ఏ నిప్పుల కుంపటి దగ్గరో కూర్చుని ఉండాలి. అలాంటి జీవితం దేహాన్నే కాదు, ఆత్మను కూడా నాశనం చేస్తుంది. ఈ పనివారికి స్నేహితం చెయ్యడమూ, పౌర బాధ్యతలు చేపట్టడమూ వీలవదు. అందుకే వీరితో ఎక్కువమంది స్నేహంగా ఉండరు. వీరికి తగినంత దేశభక్తి కూడా ఉండదు". సాటి ప్రజలకోసం రెక్కలు ముక్కలు చేసుకునే వర్గం పట్ల ఈనాటికీ కనిపిస్తున్న చులకన ఏనాటిదో, దీన్నిబట్టి తెలుస్తుంది. మనిషి మనస్సు వికసించి, ఊహాశక్తివల్ల తక్కిన ప్రాణులతో పోలిస్తే అపూర్వమైన విజయాలను సాధించడం మొదట్లో మానవజాతిని ప్రభావితం చేసినమాట నిజమేకాని, ఇటువంటి నిరసనభావం మాత్రం సమాజం వర్గాలుగా విడిపోవడాన్నే సూచిస్తుంది. అంతేకాదు; భావనలూ, ఆలోచనలూ, మాటలూ మొదలైనవాటికి యదార్థ ప్రపంచంతో సంబంధం లేని ఒక ప్రత్యేక అస్తిత్వం ఉన్నట్టుగా భ్రమ కూడా కలగ సాగింది. చేతులకు మట్టి అంటుకోకుండా నెలల తరబడి ఇహ, పర లోకాలను గురించి ఆలోచిస్తూ రకరకాల ప్రతిపాదనలు చెయ్యడం, వాటి గురించి సాటి వేదాంతులతో చర్చించడం, సమాజాన్నీ, జీవితాలనీ విశ్లేషించడం మొదలైనవన్నీ మేధావి వర్గానికి పరిమితమైన మేధోవ్యాపారంగా తయారైంది. యదార్థ ప్రపంచానికి అంతకంతకూ దూరం కాసాగిన వర్గానికి కనబడుతున్నదంతా మాయ అనీ, ఆలోచనల ప్రపంచవే నిజమైనదనీ అనిపించడంలో ఆశ్చర్యం లేదు. మతాలలోనూ, వేదాంతంలోనూ కనబడే మూలభావన ఇదే. శ్రమవిభజనను చక్కగా ఉపయోగించుకుని "పైకొచ్చిన" వర్గాలు ఇప్పటికీ రాజ్యమేలుతున్నాయని వేరే చెప్పక్కర్లేదు. ❖

ఆర్.ఎస్.కృష్ణమూర్తి స్మారక కథల పురస్కారం 2005 ఫలితాలు

మొదటి బహుమతి (రు.3000) **'కోరిక'** బి.షణ్ముఖరావు, విశాఖపట్నం

రెండవ బహుమతి(రు.2000) **వృక్షస్థలే'** జగద్ధాత్రి, విశాఖపట్నం.

మూడవ బహుమతి(రు.1000) **'సంధిగ్ధ'** వి.ప్రతిమ, నెల్లూరు

ప్రత్యేక బహుమతులు **'ఎల్లలు'** శారద బి.మురళి ఆస్ట్రేలియా (రు.500)

'ముద్దాయి' మంజరి, విజయనగరం.

ఈ బహుమతులు 6.6.2005న విశాఖపట్నం పట్టణ పౌరగ్రంథాలయంలో జరిగిన సాహిత్య కార్యక్రమంలో విజేతలకు అందచేశారు. ❖

అట్టడుగు జీవితాల వ్యధలు
అట్టాడ అప్పల్నాయుడు కథలు

- అదృష్టదీపక్

స మీ క్ష

సామాన్యుడు నిత్యం అనుభవిస్తున్న సంఘర్షణ ఉత్తరాంధ్రలో అయినా, రాయల సీమలో అయినా, తెలంగాణాలో అయినా ఒక్కలాగే ఉంటుంది. జీవితంలోని మారు మూల చీకటికోణాల్లో మనిషి ఎదుర్కొంటున్న దుర్భర విషాదాన్ని ఎంతో సహజంగా చిత్రించిన అట్టాడ అప్పల్నాయుడు కథల్ని ఉత్తరాంధ్ర ప్రాంతానికే పరిమితం చెయ్యకుండా యావదాంధ్ర దేశంలోని పీడితులూ, తాడితులూ అనుభవిస్తున్న బాధల గాధలుగా పరిగణించాలి. పోరాటాలతో అట్టుడికిపోతున్న పల్లె ప్రాంతాలూ, వివిధ వర్గాల ప్రజల మనోభావాలూ ఎలా వుంటాయో తెలుసుకోవాలంటే అప్పల్నాయుడు రాస్తున్న కథలు చదివి తీరాలి.

కొంతకాలం క్రితం విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రంవారు ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం సందర్భంలో అక్కడకు చేరిన కవి మిత్రులందరం కబుర్లు చెప్పుకుంటున్నాం. ఒకజిల్లా పౌరసంబంధశాఖాధికారి ఆశీస్సులు పుష్కలంగా ఉన్న ఒకానొక కవయిత్రి మాటల మధ్యలో "సాహిత్యంలో ఈ విప్లవాలూ, పోరాటాలూ ఏమిటండీ? కథల్లోనూ, కవిత ల్లోనూ వాళ్ళనూ, వీళ్లనూ విమర్శించడం తప్పు కదూ? తప్పుచేసినవాళ్లను మంచి మార్గంలో పెట్టే ప్రయత్నం చెయ్యాలికానీ- తుపాకులూ, బాంబులూ అంటూ సాటి మనుషుల్ని చంపెయ్యడం ఎంత దారుణం! అందుకే అలాంటి రచనలు నేను అస్సలు చదవను!" అంటూ మాకు శాంతిసందేశం అందజేసింది. కవి అరణ్యకృష్ణ "సాహిత్య ప్రయోజనమూ, సామాజిక స్పృహ" అంటూ చాలాసేపు ఆవిడతో చర్చించాడు. "ఏమో బాబూ-ఇలాంటివి నాకెంతమాత్రం ఇష్టం లేదు" అని ఆవిడ ఒక్కమాటలో తేల్చి చెప్పేసింది. ఈ సంఘటన గురించి ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే-సమాజంపట్ల బాధ్యతా, సక్రమమైన అవగాహనా ఉండవలసిన సాహితీవేత్తలు ఎంతో మంది తమ చుట్టూ జరుగుతున్న దారుణాలనూ, దురంతాలనూ ఏమాత్రం పట్టించు కోవడం లేదు. మనుషుల మధ్య అంతకంతకు పెరుగుతున్న దూరం గురించీ, అంతరాల గురించీ ఆలో చించడం లేదు. కల్లోల సముద్రంలా తయారైన జీవన నేపథ్యాన్ని అధ్యయనం చెయ్యడంలేదు. ఇలాంటివాళ్ళు అడవుల్లోకీ, కొండల్లోకీ వెళ్లి జీవితాన్ని ఎలాగూ పరిశీలించలేరు. కనీసం అప్పల్నా యుడులాంటి నిబద్ధ రచయితలు రాసిన కథలు సిన్సియర్‌గా చదివితే మన చుట్టూ వున్న సమాజం యొక్క వికృతరూపం కొంతైనా అర్థమవుతుంది.

అప్పల్నాయుడు కొత్తకథా సంపుటిని "ఒక పొట్టివాడూ-కొందరు పొడవువాళ్ల కథ" పేరుతో జనసాహితి ప్రచురించింది. టైటిల్ పేరుతో ఉన్న కథతోపాటు "వాళ్లు" అనే కథా, "యజ్ఞం...తర్వాత" అనే కథా ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి. సాహితీప్రియుల గుండెల్లో స్థిరంగా నిలచిపోయిన కాళీపట్నం రామారావుగారి "యజ్ఞం" కథలో పాత్రలు-

"తర్వాత యేమై వుంటాయి, యేయే మార్పులకు, సంఘర్షణలకు గురయి వుంటాయి. ఆ కథ తర్వాత నడచిన కాలమూ, సమాజమూ-ఆ పాత్రల ప్రయాణమూ యెలా వుంటుంది?" మొదలైన ప్రశ్నలకు జవాబుగా "యజ్ఞం....తర్వాత" కథ రాసినట్టుగా రచయిత పేర్కొన్నాడు. ఇటీవలి కాలంలో ఇదే ప్రయత్నం మరికొందరు రచయితలు కూడా చేశారు. కానీ కథా, కథనాలలో అప్పల్నాయుడు చేసిన పొడిగింపు ఒక్కటే కాళీపట్నం రామారావు మాస్టారి హృదయానికి దగ్గరగా కనిపిస్తోంది.

"ఆలివ్ గ్రీన్ రంగులో కన్పిస్తోన్న" పోరాటాల అటవీ ప్రాంతంలో "ఎత్తుకుపై ఎత్తులూ, సోదాలూ, దాడులూ" కలగలిసిన వాతావరణాన్ని "వాళ్లు" కథలో రచయిత ఎంతో ప్రతిభావంతంగా చిత్రించాడు. సాధారణంగా ఉద్యమ రచయితలు పోలీసులను ముష్కరులుగానూ, కర్కోటకులుగానూ చిత్రిస్తారు. ఈ కథలో ఘనసున్న ఒక పోలీసు అధికారి అడవిలో జరిగిన సంఘటనలకు స్పందిస్తూ అనుభవించిన అంతర్మథనాన్ని అప్పల్నాయుడు చాల కన్విన్సింగ్‌గా చెప్పాడు.

యుద్ధం ఆరంభమై, శత్రువు దాడికి దిగిపోయిన సమయంలో ఆ దాడుల్ని తిప్పికొట్టడానికీ, ఉద్యమాన్ని రక్షించుకోడానికీ, చట్టధిక్కార పద్ధతులలోకి ప్రజా పోరాటం దారి మళ్లిన సందర్భాన్ని "ఒక పొట్టివాడూ-కొందరు పొడవువాళ్ల కథ"లో అతిసహజంగా కళ్లకు కట్టాడు. అనేక రకాలుగా అణచివేతకు గురవుతున్న సామాన్య ప్రజలు చైతన్యవంతులై దోపిడీదారుల దౌర్జన్యాన్నీ, పీడననూ ఎదుర్కొనే క్రమ పరిణామాన్ని గొప్పగా వివరించాడు. ఈ కథ చదువుతుంటే ప్రతి సన్నివేశాన్నీ పకడ్బందీగా నడపించి క్లైమాక్స్‌కు చేర్చిన మంచి స్క్రీన్‌ప్లే కనిపిస్తుంది.

అప్పల్నాయుడు ఈ పుస్తకం తొలిపేజీల్లో రాసుకున్న "ఒక విన్నపం"లో "నాకు సాహిత్య విద్వత్ వారసత్వం లేదు... సాహిత్య పరిమితీ, పరమావధి గురించి కూడా సంపూర్ణంగా తెలీదు"-అని మరీ మోడెస్టీగా ప్రకటించుకున్నాడు. ఇవన్నీ అబద్ధాలేనని చెప్పక తప్పదు. ఎంత క్లిష్టమైన విషయమైనా అతిసరళంగానూ, సూటిగానూ వ్యక్తికరించే నేర్పూ, అనవసరమైన, ఆర్భాటపూరితమైన వర్ణనల జోలికిపోకుండా చిన్న చిన్న వాక్యాలతోనే అందంగా చెప్పగల నైపుణ్యమూ అప్పల్నాయుడులో పుష్కలంగా ఉన్నాయి.

"ఒక పొట్టివాడూ-కొందరు పొడవువాళ్ల కథ"లో జన్ని ముసలమ్మచేత సామ్రాజ్యవాదమంటే ఏమిటో ఎంత అద్భుతంగా చెప్పించాడో చూడండి-"కానుగుసెట్టు అడవిల-కాఫీతోట పెరగటం, జనువుగింజల పోడు మీద- నీలగిరి మొక్క లెదగటం, యింటిపెరటి భూమి మీద పనసచెట్టు మాయమయిపోయి- పామాయిలు చెట్టు కొమ్మలిరబోసుకోవడం, నా యింటి ఎన్నుకప్పు మీద-యెక్కడిదో తెల్లకొంగవోలటం..."!

పాత్రల మానసికస్థితిని అతి చిన్న వాక్యాలతో ఎంత గొప్పగా చెప్పాడో గమనించండి-

"దుఃఖము మూటలా మిగిలేడు అప్పల్రాంవుడు తాత". (31 పేజీ)

"మాస్టారి గుండెల్లో...ముళ్లకంప యేదో కదలాడినట్లయింది". (57 పేజీ)

"రుక్మిణమ్మకు-మనసంతా కోళ్లు దువ్విన పెంటకుప్ప అయ్యింది". (73 పేజీ)

సజీవమైన భాషనూ, సామాజిక చైతన్యాన్నీ సమపాళ్లలో రంగరించి తెలుగు కథను సుసంపన్నం చేస్తున్న అప్పల్నాయుడుని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

❖

వ్యాసం

మార్క్స్: నేటి మనిషి

- ఫ్రాన్సిస్ వీన్

చేతిలో చిల్లి గవ్వ కూడా లేకుండా లండన్‌లో ఆశ్రయాన్ని కోరిన ఒక వ్యక్తిని దూషిస్తూ, గత వారంలో, ఒక బ్రిటీష్ మితవాద టేబ్లాయిడ్ పత్రిక రెండు పేజీల నిండా నిందాపూర్వక వ్యాసాన్ని ప్రచురించింది. ఈ విషయంలో పెద్దగా ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు-కాకపోతే ఆ వ్యక్తి మరణించింది 1883వ సంవత్సరంలో.

బి.బి.సి. 4 ఛానెల్ నిర్వహించిన అభిప్రాయ సేకరణ వేలాదిమంది శ్రోతలు ఓటు వేసి, తమ అభిమాన తాత్త్వికుడుగా ఎంపిక చేసు కొన్నందుకు ఆగ్రహపూరిత ప్రతిస్పందనగా ఆ పత్రిక ఆ వ్యాసాన్ని ప్రచురించింది. ఆ వ్యాసానికి "రాక్షసుడు మార్క్స్" అనే శీర్షికపెట్టి తన ఆక్రోశాన్ని వ్యక్తం చేసింది.

> మార్క్స్ 150 సంవత్సరాల క్రితమే ప్రపంచీకరణ గురించి ఆలోచించి రాశాడు. అంతేకాదు. అసమానత్వం గురించీ, రాజకీయ అవినీతి గురించీ అర్థంచేసుకోవటానికి వీలుగా ఒక చక్కటి అవగాహనా చట్రాన్ని మనకు అందచేశాడు.

"అతడి నరహంత శిష్యులలో స్టాలిన్, మావో, పాల్‌పాట్-ఆఖరికి ముగాబే కూడా వున్నారు. అటువంటప్పుడు కార్ల్‌మార్క్స్‌నే వారు అతిగొప్ప తాత్త్వికవేత్తగా ఎందుకు ఓటు వేసి ఎంచుకొన్నారు?"

ఈ కలవరపాటును అర్థం చేసుకోగలం. 15 సంవత్సరాల క్రితం తూర్పు యూరపు దేశాల్లో కమ్యూనిజం కూలిపోవటంతో, మార్క్స్ ఒక "మాజీ చిలుక" (ex-parrot) అన్న అభిప్రాయం వ్యక్తం చేయబడింది. అతడు మరణించాడు. అతడి శరీరం చుట్ట చుట్టబడి, పగల గొట్టబడిన బెర్లిన్ గోడ యొక్క శిథిలాల్లో కలసిపోయింది. ఇక అతడిని గురించి ఎవ్వరూ, మరెన్నడూ ఆలోచించ నవసరంలేదు. అతడి రచనలను చదువ వలసిన అవసరం అసలే లేదు అనే ఒక సాధారణ అభిప్రాయం వ్యక్తం అయింది.

"మనం యిప్పుడు చూస్తున్నదేమిటంటే సాగిపోతూ వున్న ఒక నిర్దిష్ట కాలానికి సంబంధించిన యుద్ధానంతర చరిత్ర మాత్రమే కాదు. అది మొత్తం చరిత్ర యొక్క ముగింపే. అంటే మానవజాతి యొక్క సైద్ధాంతిక పరిణామం యొక్క ముగింపు బిందువు అన్నమాట" అని ఫ్రాన్సిస్ ఫుకు యామా ప్రకటించాడు.

కానీ చరిత్ర మరింత వ్రతీకారంతో, వెన్వెంటనే తిరిగి ముందుకు వచ్చింది. 1998 ఆగస్టు నాటికి రష్యాలో ఆర్థికస్థితి కరిగిపోవటం, ఆసియాలో కరెన్సీలు కూలిపోవటం, ప్రపంచ మార్కెట్లు అంతా భయం ప్రబలటం అనే పరిణామాలు లండన్ ఫైనాన్స్ టైమ్సు పత్రికను "మనం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ విజయాల నుండి కేవలం ఒక్క దశాబ్ద కాలంలోనే దాని యొక్క సంక్షోభపు స్థితిలోకి కదిలి వెళ్ళేమా?" అని ఆశ్చర్యం ప్రకటించేందుకు ప్రోద్బలం చేశాయి. ఆ వ్యాసానికి "పునర్దర్శనమిచ్చిన పెట్టుబడి (దాస్ క్యాపిటల్) అనే శీర్షికను పెట్టింది ఆ పత్రిక.

ఆఖరుకు పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి లాభాలను పొందినవారు సహితం, పెట్టుబడిదారీ వ్యవస్థ బ్రతికి బట్టకట్టకలుగుతుందా? అంటూ ప్రశ్నించటం మొదలెట్టారు.

బిలియనీర్ స్పెక్యులేటరు అయిన జార్జి సోరోస్ యిప్పుడు తనలాంటి పెట్టుబడి యజమానులను "వారు అందరినీ తమ కాళ్ళ క్రింద త్రొక్కి పారేయటానికి ముందే వారి పశువుల మంద ప్రవృత్తిని అదుపు చేయాలి!" అంటూ హెచ్చరిస్తున్నాడు. "పెట్టుబడిదారీ వ్యవస్థను గురించి మార్క్సు, ఎంగెల్స్‌లు 150 సంవత్సరాల క్రితమే చాలా చక్కటి విశ్లేషణను చేశారు. ఆ విశ్లేషణ సాంప్రదాయక ఆర్థికశాస్త్ర సిద్ధాంతమయిన సమతుల్య సిద్ధాంతంకన్నా కొన్ని విధాలుగా మెరుగైనది అని నేను చెప్పక తప్పదు" అని అతడు రాశాడు. "వారి జోస్యాలు నిజం కాక పోవటానికి గల కారణం, ప్రజాస్వామ్య దేశాలలో సమఉజ్జీగా జరిగిన రాజకీయ జోక్యాలు. దురదృష్టవశాత్తూ తిరిగి మనం చరిత్ర నుండి తప్పుడు నిర్ధారణలు, తప్పుడు పాఠాలు చేయబోయే ప్రమాదంలోపడ్డాం. ఈసారి ఆ ప్రమాదం వచ్చేది కమ్యూనిజం నుండి కాదు. మార్కెట్టు ఛాందసవాదం నుండి" అని అతడు రాశాడు.

న్యూయార్కర్ పత్రికకు చెందిన బిజినెస్ కరస్పాండెంట్ అయిన జాన్ కేసిడీ 1997 అక్టోబర్‌లో తాను షేర్లలో పెట్టుబడులు పెట్టే ఒక బ్యాంకర్‌తో జరిపిన సంభాషణలను ప్రచురించాడు. "నేను ఎంత ఎక్కువకాలం వాల్‌స్ట్రీట్‌లో గడిపితే, అంత ఎక్కువగా మార్క్సు వాదనే సక్రమమయిందని నమ్ముతున్నాను" అని ఆ పెట్టుబడిదారుడు చెప్పాడు. అంతే కాదు "పెట్టుబడిదారీ విధానం గురించి పరిశీలించేటప్పుడు మార్క్సు అనుసరించిన విధానమే ఉత్తమమైనదని నాకు పూర్తి నమ్మకం కుదిరింది" అని కూడా ఆయన చెప్పాడు. ఆ విషయాలను విన్న కేసిడీలో కుతూహలం పెరిగి, అతడు మొట్టమొదటి సారిగా మార్క్సు గ్రంథాలను చదివాడు. "ఏకబిగిని చదివించగలిగే ప్రపంచీకరణను గురించిన, అసమానత్వాన్ని గురించిన, రాజకీయం అవినీతిని గురించిన, గుత్తాధిపత్యీకరణను గురించిన, సాంకేతిక ప్రగతికి గురించిన, దిగజారిపోతున్న ఉన్నత మైన సంస్కృతికి గురించిన, నానాటికీ పట్టును కోల్పోతున్న ఆధునిక కాలపు మనుగడను గురించీ-నేడు ఆర్థికవేత్తలు తిరిగి ఎదు ర్కొంటున్న సమస్యలు, కొన్ని సందర్భాలలోనే ఆర్థికశాస్త్రవేత్తలు, తాము కార్ల్‌మార్క్సు అడుగుజాడల్లోనే పయనిస్తున్నామనే విషయాన్ని గుర్తించకుండా ఎదుర్కొంటున్న సమస్యల గురించిన అధ్యాయాలు మార్క్సు రచనల్లో వున్నాయనే విషయాన్ని జాన్ కెసిడీ కనుగొన్నాడు.

బూర్జువావర్గం అంతరించలేదు. కానీ, అదే విధంగా మార్క్సు కూడా అంతరించలేదు. పెట్టుబడిదారీ క్రూరమృగం యొక్క స్వభావాన్ని బహిర్గతపరుస్తూ ఆయన చేసిన సునిశితమైన, ఖచ్చితమైన నిర్ధారణలు, ఆయన చేసిన తప్పులు లేదా ఫలించని ఆయన జోస్యాలు అనే వాటిని మించి ఆ వైఫల్యాలనబడే వాటిని మించిన సరయిన దృక్పథాన్ని కలుగుచేశాయి.

"నిరంతరం ఉత్పత్తిని విప్లవీకరించటం, అన్ని సామాజిక పరిస్థితులూ నిరంత రాయంగా కల్లోలాలకు గురికావటం, అనిశ్చిత- ఆందోళనకర పరిస్థితులు శాశ్వతంగా వుండటం అనే లక్షణాలు పెట్టుబడిదారీ విధానాన్ని, అంతకు ముందు వున్న అన్ని రకాల వ్యవస్థల నుండి వేరు చేస్తున్నాయి" అని ఆయన కమ్యూనిస్టు ప్రణాళికలో రాశారు.

ఇటీవలి కాలం వరకూ బ్రిటన్‌లో ఎక్కువ మంది ప్రజలకు తాము ఒకే ఉద్యోగంలో లేదా ఒకే సంస్థలో, పనిచేసే జీవిత కాలమంతా నిలకడగా వుండగలరు అన్నట్లు కన్పించింది. కానీ యిప్పుడు అలా ఎవరు శాశ్వతంగా

వుండగలుగుతున్నారు. మార్క్స్ చెప్పినట్లు "దృఢమైన ఘనపదార్థంగా వున్నదంతా గాలిలో కరిగిపోతోంది". అతడి మరో మహత్తర గ్రంథమయిన "పెట్టుబడి" (దాస్ క్యాపిటల్)లో ఆయన "వాస్తవంగా మానవులకు-మానవత్వానికీ సంబంధించినది అంతా ఎలా ప్రాణంలేని వస్తువుగా అంటే వ్యాపార సరుకుగా ఘనీభవించిపోతుందో అప్పుడు ఆ వ్యాపార సరుకులు బ్రహ్మాండమైన శక్తి, సామర్థ్యాలను ఎలా సంతరించు కొంటాయో? అటువంటి వ్యాపార సరుకులు తమను ఉత్పత్తి చేసే ప్రజలను ఎంత క్రూరంగా చూస్తాయో చాలా చక్కగా నిరూపించారు.

బి.బి.సి. అభిప్రాయ సేకరణ యొక్క ఫలితాలు మన జీవితాలను శాసించే శక్తుల గురించి మార్క్స్ చేసిన చిత్రీకరణ అంటే అనిశ్చితతత్వం, పరాయీకరణలు-అవి సృష్టించే దోపిడీలు యిప్పటికీ ప్రతిధ్వనిస్తూనే వున్నాయనీ, అవి యిప్పటికీ ప్రపంచాన్ని కేంద్ర స్థానంలోకి తీసుకురాగలవనీ" సూచిస్తున్నాయి. గుర్తు చేస్తున్నాయి.

ఆయన బెర్లిన్ గోడ శిథిలాల క్రింద కప్పెట్టబడటంకన్నా, ఆయన మరింత వాస్తవమైన ప్రాముఖ్యతతో తిరిగి యిప్పుడు పుట్టుకు వస్తున్నాడు. ఎంతో ఆక్రోశంతో, మితవాద పత్రికా వ్యవస్థ ఎన్ని కారుకూతలు కూసినా, వెర్రిమొర్రి కేకలు పెట్టినా కార్ల్ మార్క్స్ ఇప్పటికీ 21వ శతాబ్దపు అత్యంత ప్రభావం కల తత్త్వవేత్త-ఆలోచనాపరుడుగా వుంటాడు.

(ఫ్రాన్సిస్ వీన్ రాసిన కారల్ మార్క్స్ జీవిత చరిత్ర ప్రసిద్ధి చెందిన గ్రంథం.)

(గార్డియన్ న్యూస్ పేపర్స్ లిమిటెడ్ 2005 నుండి ది హిందూ పత్రికలో -జూలై 22, 2005న ప్రచురించిన వ్యాసానికి అనువాదం: హరిబాబు)

*

మన తెలుగును రక్షించుకుందాం

భూపతి నారాయణమూర్తిగారు 'బోధన, పాలన, జనజీవన రంగాలలో తెలుగు' అనే పుస్తకం రాసి, 1998లో తెలుగు ప్రజా సమితి ద్వారా ప్రచురించారు. ఈనాటి మాతృభాషోద్యమ కార్యకర్తలకు ఈ పుస్తకంలోని వివరాలు చాల ఉపయోగపడతాయి.

దీనిలో మాతృభాష ప్రాధాన్యం, పసిబిడ్డలపై దాని ప్రభావం, పరభాషా వ్యామోహం, రాజ్యాంగపరంగా భాషా సమస్య. అధికార భాషగా తెలుగు రావడానికి కారణం, దాని అమలుకు అవాంతరాలు మొదలైన విషయాలను ఒక క్రమపద్ధతిలో వివరించారు. అంతేగాక తెలుగు లిపి సంస్కరణ గురించీ, ప్రపంచ తెలుగు మహాసభల తీరుతెన్నుల గురించీ కూడా వివరించారు. నాటి పరిస్థితులను, నేడు మాతృభాషపై జరుగుచున్న చర్చ నేపథ్యంలో పరిశీలించుకోవడానికి ఈ పుస్తకం సహకరిస్తుంది. మాతృభాష విషయంలో గత ప్రభుత్వానికీ, ఈనాటి ప్రభుత్వానికీ తేడా లేదని, ఈ ప్రభుత్వం మరింత తిరోగమన దశలో వుందని విశాఖపట్నం మునిసిపల్ కార్పోరేషన్ తీసుకున్న నిర్ణయం సాక్ష్యంగా నిలుస్తుంది. అక్కడి నగర పాలక అధికారి, పురపాలక సంఘ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం అమలుచేస్తున్నందుకు చాల గర్వపడుతున్నట్లు ప్రకటించారు. జిల్లాకు రెండు పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశపెట్టాలని విద్యాశాఖ మంత్రి ఉబలాటపడుతున్నారు.

ఈ పరిస్థితుల్లో భూపతి నారాయణమూర్తి గారి పుస్తకం తెలుగు భాషోద్యమ కార్యకర్తలకు బాగా ఉపయోగపడుతుంది. మైత్రీ బుక్ హౌస్, విజయవాడకు రాసి తెప్పించుకోవచ్చు. వెల: 20 రూపాయలే.

*

శారద 50వ వర్ధంతి సందర్భంగా

(మరణం: ఆగస్టు 17, 1955)

దేశమును ప్రేమించుమన్నా!

సామాన్యుడు దేశభక్తికోసం పెద్ద బజారంతా వెతికాడు. అంతా బ్లాకుమార్కెట్టు. ఎక్కడా దొరకలేదు. అతను దేశభక్తుణ్ణి వెతికి పట్టుకుని అడిగాడు, ఎక్కడ దొరకుతుందని. దేశభక్తుడు ఖద్దరు టోపీ చేతిలోకి తీసుకుని సామాన్యుణ్ణి అనుమానంగా ఒకసారి ఎగాదిగా పరకాయించి చూసి, 'నువ్వు ఏ ఇజం' అని అడిగాడు. సామాన్యుడు 'నేను ఏ 'ఇజమూ' ఎరగనే!' అన్నాడు అమాయకంగా. అతనికి ఆశ్చర్యంగా ఉంది ఆ ఇజం ఏమిటోనని. దేశభక్తుడు శాంతించిన హృదయ స్పందనానికి గుర్తుగా ఖద్దరు టోపీ నెత్తిన బెట్టుకుని, 'అయితే చిన్న బజారు స్వదేశవస్తు విక్రయశాలలో దేశభక్తి కంట్రోలు రేటుకి అమ్ముతున్నారు. అక్కడికి వెళ్లు, దొరుకుతుంది' అని చెప్పి వెళ్లి పోయినాడు.

సామాన్యుడు దేశభక్తికి మూల్యం తెలియక ఇదివరకే అవస్థపడ్డాడు గాబట్టి స్వదేశ వస్తువిక్రయశాలలో ప్రవేశిస్తూనే పది రూపాయల నోటుచేతబుచ్చుకుని విక్రయశాల యజమాని త్యాగశీలం గారిని కనుక్కున్నాడు 'ఓ సవాశేరు దేశభక్తి ఎంత' అని.

త్యాగశీలంగారు, ఇంకెవ్వరికో అప్పుడే 'దేశసేవ' ఇచ్చి, సామాన్యుడి వంక చూసి, 'ఇంకా తెలీదుటయ్యా దేశభక్తి ధరా?' అని గదమాయించాడు.

'తెలీకనే కదండి అడుగుతూంటా!' అన్నాడు సామాన్యుడు కాస్త లజ్జపడి.

'నువ్వు వొడికిన నూలు వీశెడు తెస్తే, సవాశేరు దేశభక్తి ఇస్తాం. అదిగో బోర్డు రాసి లేదుటయ్యా? చూడు కావలిస్తే.

'బోర్డు చూశానండి. ఆ అక్షరాలేవో బోధపళ్లేదు లెండి. అయినా, నాకు నూలు వొడికే తీరిక లేదు. నాకు దేశభక్తి లేనట్టేనా?' సామాన్యుడు బాధగా, ఆశ్చర్యంతో కనుక్కున్నాడు.

'మంచి బేరమే తెచ్చావయ్యా మహాను భావా! హిందీ బోర్డు తెలీదంటున్నావు. నూలు వొడకలేనంటున్నావు, పద పద' అన్నాడు త్యాగశీలం గారు చిరాకుగా, సామాన్యుడు తలగోక్కుంటూ కొంప చేరుకున్నాడు!

(జనవరి 28, 1949, తెలుగు స్వతంత్ర సౌజన్యంతో)

సమీక్ష

కొందరు తెలుగు కథకులను గూర్చిన విశ్లేషణాత్మక వ్యాసాలు

- అంపశయ్య నవీన్

తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ" అన్న గ్రంథంతో తెలుగు మనో వైజ్ఞానిక నవలల విమర్శకుడిగా పేరుగాంచిన కోడూరి శ్రీరామమూర్తి కొందరు తెలుగు కథకుల కథల్ని విశ్లేషిస్తూ రచించిన వ్యాసాల సంపుటి ఈ గ్రంథం. ఈ కథా సాహిత్య వ్యాససంకలనానికి "తెలుగు కథ-నాడూ-నేడూ" అని పేరుపెట్టడం సముచితంగా లేదనిపించింది. ఈ శీర్షికను చూసినప్పుడు ఈ గ్రంథంలో తెలుగు కథా సాహిత్యంలో ప్రారంభం నుండి ఇప్పటి వరకు ఉత్పన్నమైన అనేక పరిణామాల్ని గూర్చిన విశ్లేషణ ఉంటుందని పాఠకులు ఆశించే అవకాశం ఉంటుంది. కొద్దిమంది కథకుల కథల్ని మాత్రమే విశ్లేషించిన ఈ వ్యాస సంకలనానికి అంత విస్తృతమైన పరిధిని సూచించే ఈ శీర్షికను స్థిరపరచాల్సిందికాదు.

ఈ సంకలనంలో మొత్తం 12 వ్యాసాలున్నాయి. ఈ పన్నెండు వ్యాసాల్లోనూ కోడూరి శ్రీరామమూర్తిగారి లోతైన విశ్లేషణాత్మక దృష్టి వ్యక్తమవుతుంది. ఈ రచయితకు మనోవిశ్లేషణాత్మక సాహిత్యమంటే చాలా ఇష్టంలా కనిపిస్తుంది. తెలుగులో మనోవిశ్లేషణాత్మక విమర్శ చాలా తక్కువగానే వెలువడింది. కోడూరి శ్రీరామమూర్తిలా ఈ తరహా సాహిత్యాన్ని పట్టించుకున్న విమర్శకులు చాలా అరుదుగా కనిపిస్తారు. ఈ కారణంవల్లనే మనోవైజ్ఞానిక లేక మనోవిశ్లేషణాత్మక సాహిత్యాన్ని సృష్టించిన కథకులకుగానీ, నవలాకారులకు గానీ దక్కాల్సిన గౌరవం దక్కలేదు.

ఈ వ్యాస సంకలనంలో చోటు చేసుకున్న వ్యాసాల్లో "చలం కథలు-మనోవిశ్లేషణ" "బుచ్చిబాబు కథలు- మనోవైజ్ఞానిక దృక్పథం", "పొగమంచులో చిక్కుకున్న మనిషి కథను ఆవిష్కరించే త్రిపురనేని కథలు", "పద్మరాజు కథలు- ఒక పరిశీలన" అన్న వ్యాసాల్లో ఈ విమర్శకుడికున్న సునిశిత పరిశీలనాదృష్టి, విశ్లేషణాత్మకత ద్యోతకమవుతాయి.

పందొమ్మిది వందల ఇరవైల నుండే స్త్రీలపట్ల సమాజం చూపిస్తున్న వివక్షను కథలుగా నవలలుగా రచించిన చలాన్ని తెలుగు సాహిత్యపు మొట్టమొదటి స్త్రీవాద రచయితగా విమర్శకులు గుర్తించారు. చలం రచించిన కథల్ని సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మనోవిశ్లేషణ సూత్రాలతో విశ్లేషించడంలో ఎంతో కొత్తదనం ఉంది.

"చలం రచనల్లో ప్రత్యేకించి అతడి కథల్లో, నవలల్లో పాత్రలు మనస్తత్వ చిత్రణను గురించి ప్రస్తావించేటప్పుడు దానిని ప్రధానంగా మూడు తరహాలుగా వర్గీకరించవచ్చు. 'నేను- -'నాది' అనే పొసెసివ్ ఇన్‌స్టింక్ట్ ఫలితంగా వ్యక్తి అంతరంగంలో చెలరేగే అలజడిని ఆవిష్కరించడం మొదటి తరహాకు చెందినదయితే, వ్యక్తి తనలో ఉన్నాయని అంగీకరించలేక నమ్ముకున్న విలువల్ని వదులుకోలేక అతడు లోనయ్యే మానసిక అవేదనను చిత్రించడం రెండవ

తరహాకు చెందింది. ఇక మూడవది: సంఘం, సంప్రదాయం నిర్దేశించిన విలువలను వ్యతిరేకించిన వ్యక్తులు తమ విలువలను తాము అన్వేషించుకుంటూ చేసే జీవన యాత్రలో లోనయ్యే సంఘర్షణకు అక్షర రూపం కల్పించడంగా పేర్కొనవచ్చు" అంటాడు కోడూరి శ్రీరామమూర్తి. ఈ మూడు తరహాల వర్గీకరణలతో చలం రాసిన కొన్ని కథల్లోని పాత్రల మనస్తత్వాల్ని విశ్లేషించడం బాగుంది. చలం రచించిన "నాయుడుపిల్ల", 'రామభక్తుడు' "ప్రేమ పర్యవసానం" హంపీ కన్యలు" సుశీల "నవ యవ్వనం" కథల్ని ఈ రచయిత విశ్లేషించిన విధానంలో వ్యక్తమయిన లోచూపు మనల్ని ఆకట్టుకుంటుంది.

"బుచ్చిబాబు కథలు-మనోవైజ్ఞానిక దృక్పథం" అన్న వ్యాసంలో కూడా ఈ విమర్శకుడికున్న లోచూపు వ్యక్తమవుతుంది. బుచ్చిబాబు సామాజిక ప్రయోజనాన్ని గూర్చిగానీ, అర్థికపరమైన శక్తులను గూర్చి గానీ ఎక్కువగా ఆలోచించలేదనీ, హృదయానికి సంబంధించిన ఆర్ద్రతల్ని గూర్చే ఆలోచించాడనీ, బుచ్చిబాబు సోమర్సెట్ మామ్‌కు ఏకలవ్య శిష్యుటనీ, ప్రకృతి సొగసుల్ని చూసి పులకరించిపోయే కవి తాత్మక హృదయం అతనిదనీ అన్న కోడూరి శ్రీరామమూర్తి బుచ్చిబాబును చాలా చక్కగా అర్థం చేసుకున్నాడనిపిస్తుంది.

బుచ్చిబాబు పట్ల ఈ విమర్శకుడికి ఎంతో ఆరాధనాభావం ఉన్నప్పటికీ కథకుడిగా బుచ్చిబాబులోని లోపాల్ని కూడా శ్రీరామమూర్తి గుర్తించాడు. పాఠకులు తన కథల్ని సరిగ్గా అర్థం చేసుకున్నారో లేదో అనే అనుమానంతో బుచ్చిబాబు కథల చివర్లో కొన్ని వివరణలు ఇస్తుంటాడు. శిల్పరీత్యా ఇది ఆయన కథల్లోని లోపమని శ్రీరామమూర్తి బుచ్చిబాబు రాసిన "నన్ను గురించి కథ రాయవూ?" అన్న కథను విశ్లేషిస్తూ చెప్పాడు- "బుచ్చిబాబు కథల్ని మొత్తంమీద చూచినప్పుడు ఒక విషయం మనకు సులువుగా అవగాహనకు వస్తుంది. అతని కథల్లో సాధారణంగా కనబడేది అంత రంగంలో అణచివేయబడిన శృంగార భావనలు." "ప్రేమించి దూరంగా ఉండి, శరీరం సుఖంకోరక, మనస్సుని ఆనందంతో నింపుకునే ఉదంతం సాహిత్యంలో రాణిస్తుంది" అంటాడతను"(బుచ్చిబాబు). ఈ అంశాన్ని మనం ఆయన రాసిన "నన్ను గురించి కథ రాయవూ?", "మేడమెట్లు", "ఆశాప్రియ", "పొగలేని నిప్పు", "వీరేశ లింగం ఏం చెయ్యాలి?", "తెరచాప దించిన పడవ" మొదలైన కథల్లో గమనిస్తామంటూ శ్రీరామమూర్తి చేసిన విశ్లేషణ ఎంతో యథార్థంగా ఉంది.

మానవజీవితంలోని అసంబద్ధతను **(absurdity)** చిత్రిస్తూ త్రిపుర కొన్ని కథల్ని రచించాడు. ఎవరో కొందరు మేధావులకు తప్ప త్రిపుర కథలు సామాన్య పాఠకులకు అర్థంకావు. త్రిపుర కథలు కోడూరి శ్రీరామ మూర్తిలాంటి మేధావులైన విమర్శకులకు చాలా పని కల్పిస్తాయని ఈ సంకలనంలోని "పొగమంచులో చిక్కుకున్న మనిషి కథను ఆవిష్కరించే త్రిపుర కథలు" అన్న సుదీర్ఘ వ్యాసం రుజువు చేస్తుంది.

"....ఇట్లాంటి అస్తిత్వ సంక్షోభం **(Existential crisis)** మానవ జీవితంలోని అసంబద్ధతపట్ల గ్రహింపుకు సాహిత్యంలో స్థానం కల్పించిన కథకులు, నవలాకారులు ప్రపంచ సాహిత్యంలో ఎందరో ఉన్నారు. సార్త్ర్, కాఫ్కా కామూ, అప్‌డైక్ మొదలయిన వారు ఈ తరహాలో చిరస్మరణీయమైన రచనలెన్నో చేశారు. అయితే తెలుగులో ఈ ధోరణిలో వచ్చిన రచనలు తక్కువ. అందునా, కథలు మరీ తక్కువ. ఈ పనిని సమర్థవంతంగా చేసిన కథకుల్లో 'త్రిపుర'

ఒకరు మాత్రమే కాదు. చాలా ముఖ్యుడు కూడా" అంటూ శ్రీరామమూర్తి త్రిపుర కథల్లోని అంతరార్థాలను మనకు అర్థం చేయించడానికి ప్రయత్నిస్తాడు.

ఈ సంకలనంలోని మరో మంచి వ్యాసం "పద్మరాజు కథలు-ఒక పరిశీలన" అన్న పాలగుమ్మి పద్మరాజు కథల్ని విశ్లేషిస్తూ శ్రీరామమూర్తి రాసిన వ్యాసం.

పాలగుమ్మి పద్మరాజు తన "గాలివాన" కథతో తెలుగు కథకు అంతర్జాతీయఖ్యాతిని కల్పించాడు. 1952లో "హెరాల్డ్ ట్రిబ్యూన్" అన్న అమెరికాకు చెందిన పత్రిక నిర్వహించిన అంతర్జాతీయ కథల పోటీలో పద్మరాజు రచించిన "గాలివాన" కథకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ కథను శ్రీరామమూర్తి ఈ వ్యాసంలో సవివరంగా విశ్లేషించాడు.

"ఈ కథలో పద్మరాజు గారు చెప్పిన గాలివాన మనిషి అంతరంగానికి సంబంధించిందే అయినా, గాలివాన బాహ్యరూప వర్ణన కూడా అత్యంత వాస్తవికంగా ఉంటుంది. దీనికి కారణం ఆ గాలివాన పద్మరాజుగారి జీవితానుభవం కావడమే అని అనుకుంటాను" అంటాడు శ్రీరామమూర్తి.

'గాలివాన' కథలోని ప్రధాన పాత్రలైన రావుగార్కి, ముష్టిదానికి మధ్యన ఒక అద్వైతస్థితి ఏర్పడిందనీ, మొదట్లో రావుగారు ఈ విషయాన్ని గుర్తించలేకపోయాడనీ, కథ చివర్లో రావుగార్కి ఆ అవగాహన కల్గిందని శ్రీరామమూర్తి చెప్పడం- ఈ దృష్టితో మనం 'గాలివాన' కథను మరోసారి చదివితే ఆ కథలోని గొప్పతనమేమిటో అర్థమవుతుంది.

ఈ నాలుగు వ్యాసాలే కాకుండా ఈ సంకలనంలోని "కుటుంబరావు కథలు-సాంఘిక, ఆర్థిక నేపథ్యం", "తెలుగు కథల్లో రసెల్ దృక్పథం" వ్యాసాలు కూడా మనల్ని ఆలోచింపజేస్తాయి.

ఈ సంకలనంలోని మొదటి వ్యాసంలో శ్రీరామమూర్తి మంచికథ లక్షణాలేమిటో చెప్పడానికి ప్రయత్నించాడు. ఈ వ్యాసంలో ఆయన కొత్తగా చెప్పిందేమీ లేదు.

"పాతికేళ్ళ తెలుగు కథ-కొన్ని ఆలోచనలు" అన్న వ్యాసం సమగ్రంగా లేదని శ్రీరామమమూర్తిగారే అంగీకరించారు. పాతికేళ్ళలో ఎన్నో కథలు వెలువడ్డాయి. వాటిల్లో ఎన్నో మంచి కథలు కూడా ఉంటాయి. వాటిల్లో ఈ రచయిత దృష్టికొచ్చిన కొన్ని కథల్ని మాత్రమే పేర్కొనడం, ఆయన దృష్టికిరాని ఎన్నో కథల్ని వదిలివెయ్యడం జరిగింది. ఇంత పెద్ద వ్యవధిని తీసుకున్నప్పుడు ఈ లోపం సాధారణంగా జరిగేదే.

"ఓ ఏడాది తెలుగు కథ గురించి" అన్న వ్యాసంలో కూడా ఇదే జరిగింది.

ఒక్కొక్క విమర్శకుడికి ఒక్కో అంశంపట్ల ప్రత్యేకమైన అభినివేశం, ఆసక్తి ఉంటాయి. ఆ విమర్శకుడు ఆ అంశానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వబడిన రచనల్నే ఎన్నుకొని పరిశీలిస్తాడు. కోడూరి శ్రీరామమూర్తి గారి విషయంలో కూడా ఇదే జరిగింది. అయితే తను పరిశీలనకోసం ఎన్నుకున్న రచనల్ని ఆయన సమర్థవంతంగా విశ్లేషించగల్గాడు. ఆ రకంగా ఆయన ఆయా రచయితల్ని ఆ రచయితలపట్ల అభిమానం ఉన్న పాఠకులు సరిగ్గా అర్థం చేసుకోవడానికి దోహదం చేశాడు. అలా ఓ విమర్శకుడు చేయాల్సిన పనిని కోడూరి శ్రీరామమూర్తి సమర్థవంతంగా చేసినందుకు ఆయనను అభినందించాలి.

(తెలుగు కథ: నాడూ-నేడూ, కథా సాహిత్య వ్యాసాలు, రచయిత: కోడూరి శ్రీరామమూర్తి. పేజీలు: 190, వెల: రూ.100. ప్రతులకు: శ్రీమతి కోడూరి భారతి, డి-5, అఖిల్ అపార్ట్‌మెంట్స్, దానవాయిపేట, రాజమండ్రి.)

*

సుబ్బారావు టాక్స్ - 16

ఎవరు విప్లవకారులు?

- చంద్రవంక

'ది మోస్ట్ కాంట్రవర్షియల్ థింగ్ ఈజ్ రివల్యూషన్ అండ్ రివల్యూషనరీ' ఈ విషయం మీద నేను మాట్లాడాలి. నేను మాట్లాడేస్తాను. ఎందుకంటే నాకు సిగ్గులేదు. కాబట్టి. నాకు భయంలేదు కాబట్టి. 'సిగ్గెందుకు' లేదని మీరు అనొచ్చు. పూటకో మాట మాట్లాడేవాడు. పూటకో వేషం వేసేవాడు కనీసం సిగ్గుని అభినయించాలి. మనకి సిగ్గులేకపోవటం రక్తంలో భాగం అయిపోయింది. లార్డ్ కృష్ణలో అన్నీ నేనే అని మీకు తెలుసు. అందుకే ఎనీథింగ్ అండర్ ది స్కై సుబ్బారావు మాట్లాడేస్తాడు.

అసలు విషయానికొస్తా-కంప్లీట్ అయింది కాబట్టి.

ఎవరయితే తుపాకులు పట్టుకుంటారో, ఎవరయితే కాల్పుల్లో చచ్చిపోతారో వాళ్లే విప్లవకారులు అంటాడు మా బామ్మర్ది. మరి కలాలు, మైకులు, ఇంకా అనేక రకాల ఆయుధమ్స్ ఇంక్లూడింగ్ కుంచె, చీపురూ-వీళ్లందరూ విప్లవకారులు కాదా! అంతకు మించి మార్క్స్-లెనిన్, మావో, ఇంకా ఓ నలభై మంది విప్లవకారులు ఎప్పుడేం చెప్పారు. ఏం రాసారు. ఇవన్నీ డిస్కవర్‌చేసి, వాటి మీద పుస్తకాలు రాసేవారు. మాట్లాడే వారు విప్లవకారులు కాదా అని నేను కోప్పడ్డాను.

మా పక్కింటి రాజారావు ఏదో ఉద్యమం జరుగుతుందని తెలియకే. ఎప్పట్లానే పైరవీ కోసం సెంటర్‌కొచ్చాడు. వాడికి తుపాకి తూటా తగిలింది. దాంతో అమర వీరుడయ్యాడు.

వాడు ఎప్పుడూ విప్లవం గురించి మాట్లాడలేదు. వాడికి తెలిసింది పైరవీ ఒక్కటే. అయినా వాడు అమరవీరుడు. వెధవ ప్రాణం పోయినా వాడు శిలగా మిగిలాడు.

ఏభై సంవత్సరాలుగా ఎర్ర జెండా పట్టుకుని, నలుగుర్నో, పది మందినో, వంద మందినో వెనకాల వేసుకొని లాఠీదెబ్బలు తిని, జైలుకెళ్లి, ఉన్నదంతా పోగొట్టుకుని, పిల్లలకి దరిద్రం మాత్రమే యిచ్చి గుండాగి చచ్చిపోయిన మనుషులు కనీసం వెయ్యి మంది నాకు తెలుసు.

వాళ్లు విప్లవకారులు కాదంటే కాదు. ఎందుకంటే....

'అగ్' మార్క్ వేసినట్లు ఇక్కడే 'విప్లవ' మార్క్ వేయటానికి దేరార్ సోమెనీ ఇంటలెక్చువల్స్'. వాళ్లు ఎవర్ని విప్లవకారులంటే వారే విప్లవకారులు. అయితే అభిప్రాయబేధాలు వచ్చినప్పుడు మాత్రం కాదు. అంచేత ఎంత త్యాగం చేసినా వాళ్లు శిథిలాల్లో మిగిలారు. అందుకే ఈనాటి విప్లవకారులు రేపు కాదు. వాళ్లు ద్రోహులు కావచ్చు. సుగరూ, బీ.పీ. వచ్చి మంచం ఎక్కవచ్చు. అప్పుడు ప్రవచించటం తప్ప పనిచేయలేరు కదా అందుకే నిబద్ధత, నిమగ్నత మీద దశాబ్దాలుగా కొట్టుకున్నా ఇంతవరకు కంక్లూజన్‌కి రాలేకపోయాం.

నన్నడిగితే ఎవరు విప్లవకారులు అనేది తొందరపడి నిర్ణయం చేయకూడదు. ఆఫ్టర్ డెత్ అనగా మరణం తర్వాత- అనగా మరణించిన తర్వాత మాత్రమే అది డిసైడ్ కావాలి. పోయినోల్లందరూ మంచోళ్లంటే

కుదరదు. ఎందుకు మంచి వాళ్లో చెప్పాలి. ఎంత వరకు మంచివాళ్లో చెప్పాలి. మా బామ్మర్దికి నేనేం చేస్తే అది విప్లవం. నన్ను మించిన విప్లవకారుడు లేడంటాడు. ప్రైవేట్‌గా విభేదిస్తాడనేది వేరే విషయం. ఆ రకంగా మన బంధువులయినంత మాత్రాన మన కులమూ, ప్రాంతమూ అయినంత మాత్రాన విప్లవకారులయిపోరు. మనం గుర్తించనంత మాత్రాన విప్లవ కారులు కాకుండానూ పోరు.

సుబ్బారావులు ఆంధ్రదేశంలో చాలా మంది వున్నారు. వాళ్లకు బొక్కలు వెతికే కార్యక్రమమే వుంటుంది. వాళ్లకు ఎప్పుట ొకప్పుడు మెదడులో పురుగుచేరి తొలి చేస్తుంటుంది. అంచేత వాళ్లు విప్లవం అనగానేమి? ఎవరు విప్లవకారులు అని ప్రజలకు ప్రశ్నలువేసి, జవాబులు చెబుతుంటారు. నిజానికి పోలీసులకి తెలిసినంతగా ఎవరికీ విప్లవకారుల గురించి తెలియదని ఈ సుబ్బారావు థియరీ. పోలీసులు తుపాకులకు భయపడరు. అవి వాళ్ల దగ్గర వున్నాయి కాబట్టి.

వాళ్లు భావాలకు భయపడతారు.

ఎందుకంటే అవే స్ప్రెడ్ అవుతాయి. విత్తనాలు మొలకలెత్తినట్లు, చివుళ్ల తొడిగినట్లు, మహావృక్షాలయినట్లు భావాలే డేంజర్.

అంత మాత్రాన భావాలున్నందుకే భయపడరు.

భావాలు అందరికీ వుంటాయి. అందులో కొన్ని యాంటీ-కొన్ని ప్రో. దేనికో దానికి భావాల్ని మనలో దాచుకున్నంత కాలం వాళ్లు పట్టించుకోరు. భావాల్తోపాటు రంగంలోకి దిగితే మన మీద అప్పుడు కన్నేస్తారు. అంటే ఆచరణలోకి దిగి పోయేవాళ్లు ప్రమాదం అని వారికి ఆరో సెన్సు చెప్పేస్తుంది.

మనకు ఏజ్‌నిబట్టి, తగిలే దెబ్బల్ని బట్టి, దరిద్రం మీద పడుతున్న కొద్దీ. అతిగా మనల్ని పొగుడుతున్న కొద్దీ, వార్తల్లో కనిపించాలనే తాపత్రయం వల్లా. నూతన పరిచయాల వల్లా మన అభిప్రాయాలు ఛేంజ్ అవుతుంటాయి. అవి మనల్ని వెనక్కీ ముందుకీ లాగు తుంటాయి. అందుకే ఎప్పుడో ఒకప్పుడు ఇంత వరకు చేసింది చాల్లే అనిపిస్తుంది. అలా నిర్వీర్యం చేయటానికి కొంత మందిని కాలమే నిర్ణయించుకుంటుంది.

ఇంతకూ ఏది విప్లవం. ఎవరు విప్లవ కారులు ఈ విషయం తేల్చమంటారు.

నేను తేల్చలేనంటాను. ఈ రోజున మనందరం ఒకటే కోరుకోవాలి. అన్నీ ప్రజల కోసమే....

పోలీసులూ, పెట్టుబడిదారులూ అందుకు ఒప్పుకోరు.

అయినా కూడా ప్రజలందరూ సుఖంతోనూ, శాంతితోనూ బతకాలి.

సుఖమూ-శాంతీ చాలా చంచలమైనవి. ఈ ప్రపంచం మొత్తం విప్లవంతో తరించి నప్పుడే అవి కాస్త నిలకడగా వుంటాయి.

మా బామ్మర్దిగాడు ఆడికి నచ్చినవాడ్ని ఆకాశంలో వుంచుతాడు. నచ్చనివాడ్ని నేలకిసిరేస్తాడు. అదే రివల్యూషన్ అను కుంటాడు. భ్రమ పడతాడు. అలాంటివాళ్లని ఆ ప్రపంచంలో బతకనియ్యాలి.

కడదాకా ప్రజలకోసం ఆలోచించేవాడు, తపించేవాడు, కాలిపోయేవాడు, ప్రజలు బతుకులో సమూల మార్పులు కోరుకునే వాడు, తుపాకి పట్టినా, పట్టకపోయినా, అడవుల్లో వున్నా, నగరాల్లో వున్నా అతను ప్రజల మనిషవుతాడు. ప్రజల్తో తిని, ప్రజలతో నడిచి, ప్రజలకోసం బతుకుని అంకితం చేసుకున్నవారు రివల్యూషనర్‌లు అనిపించు కున్నా, కాకపోయినా వాళ్ల బతుకు ధన్యం అవుతుంది.

అందుకే ప్రపంచంలో మహా నాయకుల్ని ప్రజల మనుషులుగా కీర్తించారు. త్యాగధనులుగా కీర్తించారు. మానవాళి శ్రేయస్సు కోసం వారు ఏ మేరకు కృషి చేస్తే ఆ మేరకు గుర్తుంచుకున్నారు.

ఈ 'విప్లవకారులెవరు?' అనే సమస్య మాత్రం ప్రజల్ది కాదు.

అది కాంట్రావర్సీల్తో బతికే సుబ్బారావుల్ది.

సో ఎక్కడ మొదలుపెట్టామో, అక్కడే ఆగాం.

ఏది విప్లవం?

ఎవరు విప్లవకారులు?

ఈ ప్రశ్నలకు సమాధానం కాలంలోనే వెతుక్కోవాలి!

కాలంకు మించిన న్యాయనిర్ణేతలు ఎవరుంటారు?

ఉన్నా మనం అంగీకరిస్తామా?! ✳

జనసాహితి-జంటనగరాలశాఖ

ఆహ్వానం

ఛిద్రమౌతున్న గ్రామీణ జీవితం: దుర్భరమైన వలస బతుకులు

అనే అంశంపై సాహిత్య సభ

హైదరాబాదు-సిటీ సెంట్రల్ లైబ్రరీ

అశోక్‌నగర్-(చిక్కడపల్లి)

ఉదయం 10.00 గంటలకు

2005, సెప్టెంబర్ 11 ఆదివారం

కొన్ని దశాబ్దాలుగా సాగుతున్న సామ్రాజ్యవాద దోపిడీ, గత దశాబ్దం నుండి కొత్త ముసుగులో (ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ) ఉధృతమైన వాస్తవాన్ని దృష్టిలో వుంచుకొని, దీని ఫలితంగా జరుగుచున్న గ్రామీణ జీవన విధ్వంసాన్ని, మధ్య, పేద రైతాంగం, రైతు కూలీలు, చేతివృత్తుల ప్రజానీకం జీవనాన్నీ పల్లెల నుండి పట్టణాలకు పొట్టచేత పట్టుకొని వలసపోయి, అక్కడ దుర్భర జీవితాలు గడుపుతున్న వాస్తవాన్నీ ఈ జీవన సంఘర్షణకొక మౌలిక పరిష్కారాన్ని సూచించే అముద్రిత రచనలను ఆహ్వానిస్తున్నాం.

ఈ సభలో పై అంశంపై రాసిన అముద్రిత కవితలు, పాటలు, గల్పికలు వినిపించవచ్చు. అముద్రిత కథలు, నవలలు, వ్యాసాల యొక్క సారాంశం వివరించవచ్చు. అంతేగాక, ఇతర సమకాలీన సమస్యలపై కూడ తమ అముద్రిత రచనలను ఈ సభలో శ్రోతలకు వినిపించవచ్చు.

కవులకూ, కవయిత్రులకూ, రచయితలకూ, రచయిత్రులకూ, సాహిత్య, అభిమానులకూ ఇదే మా ఆహ్వానం.

పాట

ఏడాది పరిపాలన ఏం ఒరగబెట్టింది?!

- పి.ఎస్.

స్వర్ణాంధ్ర బులబాటం అటక ఎక్కి కూర్చుంది
హరితాంధ్ర ఉబలాటం అందలం ఎక్కింది
కొత్త సీసా-కొత్త పేరు
పాత సారా-అదే మత్తు!
ఏడాది పరిపాలన-ఏం ఒరగబెట్టింది
మరింకెన్నొ గాయాలు-మనుగడలో పొటమరించె

॥ ఏడాది॥

ఆత్మహత్యలాగలేదు
ఉచితం షాకిచ్చింది
చచ్చుబడిన చర్చల్లో
శాంతి బద్దలయ్యింది
భ్రమల పొరలు వెదజల్లే
ప్రలోభాలు పెచ్చుమీరె

॥ఏడాది॥

ధరలేవీ నేలపైకి
దిగివచ్చిన జాడలేదు
కూలీలూ, జీతాలూ
పెరిగొచ్చిన ఐపులేదు
ఎదురు చూపు మిగిలింది
ఎదర దారి ములిగింది

॥ఏడాది॥

పాదయాత్ర, పల్లెబాట
శాంతియాత్ర, నగరబాట
రైతుల చైతన్యయాత్ర
ప్రజల్లేని ప్రజాపథం
అంతులేని పయనాలు
దరిచేరని గమ్యాలు

॥ఏడాది॥

అభ్యుదయం అరిగిపోయి
అభివృద్ధిక వెల్లివిరిసె
వికాసం అలసిపోయి
ప్రగతి దారి పొడుచుకొచ్చె
సమసమాజ నినాదాన్ని
దిగలాగెను సుడిగుండం!

॥ఏడాది॥

హామీలకు కొదవలేదు
కరువన్నది చావలేదు
లాఠీలకు, తూటాలకు
"శాంతీ భద్రత" అదుపు కాదు
జనం ఓటుతో గెల్చి
జనానికే బహుదూరం

॥ఏడాది॥

బహుళజాతి సేవలో
పరిపాలన పరపాలన
కమీషన్ల కతుకుడులో
కాట్లాటల అరాచకాలు
ఏళ్ళు గడిచినా తగ్గని
భరతమాత గుండెకోత!

॥ఏడాది॥

(పునరంకిత బూటకాల పైశాచిక
వేడుకల్ని అసహ్యించుకొంటూ)

*

కొ.కు. 25వ వర్ధంతి సందర్భంగా

కొ.కు. మరణం: 17.8.1980

పారిన్ కొలాబొరేషన్

- కొడవటి గంటి కుటుంబరావు

నిర్ఘాంతపోయాను. పాపారావు బంకు ఏమయింది? శ్రేష్టమైన లంక పొగాకు చుట్టలిచ్చే పాపారావును ఏదో పెద్ద చేప మింగింది? పాపారావు బంకు ఉండవలసిన చోట అద్దాల షాపు వెలిసింది. నేను ప్రపంచాన్ని తిట్టుకొని పాపారావు కోసం జాలిపడుతుండగా ఒక ఫాషన్‌బుల్ మనిషి పెరిగిన జుట్టుతో బెల్‌బాటమ్ పాంట్‌తో బయటికి వచ్చి, నన్ను చూసి చిన్న కేక పెట్టాడు.

పాపారావే? హీ వండర్ ఫుల్? చిన్న చేపను పెద్ద చేప మింగలేదు. చిన్న చేప పెరిగి పెద్దదయింది. కాని ఈ మార్పు ఎలా సాధ్యమయింది? పాపారావుకు పెట్టుబడి లేదు? పెద్ద ఆర్జనా లేదు-రోజుకు నాలుగు రూపాయలు అంతే?

పాపారావు నన్ను లోపలికి తీసుకుపోయాడు. కోకాకోలా తెచ్చి ముందు పెట్టాడు. షాపు నిండా కోక్‌లే?

"ఏమిటిది? ఏమయింది? జీతముమీద ఇక్కడ ఉంటున్నావా?" అన్నాను.

"అమెరికన్ కొలాబొరేషన్ గురూగారు? పీన్‌కోర్‌వాట్ట. డాలర్లు పెట్టుబడి చేస్తాననీ, వ్యాపారం పెంచమనీ అన్నాడు. ఇదంతా ఆడి చలవ. అమ్మకాలు రోజుకు రెండింతలు దాటతాయి. అయితే అంత ఆడికే పోతుంది. పోదూమరీ? ఇదంతా నిజానికి అడిదేగా? నాకు రోజుకు అయిదారు రూపాయలు మిగులుతాయి చాలదా" అన్నాడు.

పాపారావును అభినందించాడు.

ఇది కిందటేడు. ఈ ఏడు అటుకేసి వెళితే "ఇండో-అమెరికన్ కోకాకోలా సెంటర్" ఉన్నది గాని అందులో పాపారావు లేడు. ఇంకెవడో ఉన్నాడు. అమెరికా వాడు ఇండియా నుంచి ఉడాయిస్తూ షాపును మరెవడికో అమ్మాట్ట. పాపారావు ఏమయ్యాడో తెలీదు. మళ్ళీ బంకు తెరుస్తాడా? తెరవడు. మళ్ళీ లంక పొగాకు చుట్టలు అమ్ముతాడా? అమ్మడు.

ఇంక పాపారావు నాకు కనిపించే అవకాశం లేదు.

ముద్రణ: యువ, జూన్ 1977

"సమాజ పరిణామంకోసం కృషిచేసే విప్లవవాదులు మతం గురించి తలలు పగులగొట్టుకోనవసరం లేదు. ప్రజల జీవితంలో నుంచి దోపిడీని తొలగించడమే మతాన్ని ఎండగట్టడానికి ఒక మార్గం. మన విప్లవవాదులూ, మార్క్సిస్టులూ, మూఢవిశ్వాసాలేవీ అనేది నిర్ణయించడంలోనూ, వాటికి విరుద్ధంగా ప్రచారం చెయ్యటానికి శ్రమించటంలోనూ, ఎక్కువ ప్రయోజనం కనబడదు. జీవితాన్ని మార్చాలి. వ్యక్తుల మనస్సులను ఒక్కొక్క మూఢవిశ్వాసం నుంచీ తొలగించుతూ కూర్చుంటే పుణ్యకాలం వెళ్ళిపోతుంది. ప్రజల రక్తాన్ని తాగేస్తున్న వర్గం వాళ్ళకు ఏ మూఢవిశ్వాసంతోనూ పనిలేదన్నది మనం మరచిపోకూడదు".

- కొడవటిగంటి కుటుంబరావు

రచనా కాలం: 1979 (కొ.కు. తాత్విక వ్యాసాలు. పుట.94

కవిత

తొలిపొద్దు తిరుగుబాటు

- సి.హెచ్.వి.బృందావనరావు

వెలుగుతూ ఆరుతూ అల్పకాంతితో వున్నదని
హీనంగా చూడకు దాన్ని
అది ఇవ్వాళ మిణుగురే కావచ్చు
రేపు అదే అనంత కాంతి భాండంగా
విస్ఫోటించవచ్చు
శత సహస్ర కాంతి జ్వాలా శకలాలుగా
వియత్తును విద్యుదీకరించవచ్చు
దిక్కుల్ను వెలిగిస్తూ, చుక్కల్ను రగిలిస్తూ
కళ్లు మిరుమిట్లు గొలిపే
వెలుతురు జలపాతంలా దూకవచ్చు
నల్లని చిన్ని విత్తనమే కదా అని
ఛీత్కారంతో చిదిమేయకు దాన్ని
గొయ్యితీసి పాతిపెట్టి
చిన్ని విత్తును ఛిన్నాభిన్నం చేశానని
విఱ్ఱవీగాక
రేపదే మహావృక్షపు మందుపాతరై పేల్తుంది
నేలలోకి వేళ్లనూ, ఆశాతీరాల్లోకి శాఖలనూ
విస్తరించి
నీ అల్పత్వానికి ఆకాశమెత్తు సాక్ష్యమవుతుంది
దూరాకాశంలో అరచెయ్యంత కూడా లేని
నల్లని మరకను చూసి
అదేందిలే అని అలుసు ప్రదర్శించకు
ఒక చల్లని గాలిపెర సోకినా చాలు
నిత్య చలనశీలమైన ఆ మబ్బు తునక
వ్యాకోచించి వ్యాకోచించి
మహోభ్ర ఝంఝగా మారి
భూమ్యాకాశాల అంతరాళాల్లో
జల ప్రళయం సృష్టించవచ్చు
ఒళ్లంతా వేళ్లుగా, కాళ్లుగా, నోళ్లుగా విజృంభించి
నీ దొంగ ప్రపంచాన్ని తుడిచి పెట్టవచ్చు
కడుపులు మాడుతూంటే కర్మ సిద్ధాంతాలు
పనిచేయవు
ఆవగింజంత అశాంతి చాలు అక్షిగోళాలు
అరుణ కేతనాన్ని ఎగురవేయడానికి
అసంతృప్తి అగ్ని గుండాలను
అధికార సముద్రాలు ఆర్పలేవు
వేకువంటే ఏమిటో తెలుసా నీకు
కడసారి సూపులకైనా.. బిడ్డలొత్తే బాగున్ను

(64వ పేజీతరువాయి) **ప్రణయ కుంతి (నాటకం) రచన:** స్వరూపరాణి. 1/8 డెమ్మీ, పుటలు: 74, వెల: రు.45/-. ప్రచురణ: నవ్య సాహిత్య పరిషత్, కరీంనగర్, వారి 38వ ప్రచురణ. మొదటి ముద్రణ: 2005. ప్రతులకు: స్వరూపరాణి, టీచరు, 35-3-80/సి, కేశవస్వామిపేట, ఒంగోలు-523 001. దూరవాణి: 08592-221556. లేదా డా॥ మలయశ్రీ, వేమననగర్ (రేకుర్తి), కరీంనగర్-505 451. దూరవాణి: 0878-2256049. విశాలాంధ్ర అన్ని శాఖలలో.

జారుడు బండ మరికొన్ని కతలు: ఎలికట్టె శంకర్‌రావు. 1/8 డెమ్మీ, పుటలు:112, వెల: రు.45/-. అమృత ప్రచురణలు. నల్లగొండ. 29 మే, 2005. ప్రతులకు: డా॥ నోముల సత్యనారాయణ, రవీంద్రనగర్, నల్లగొండ-508 001. దూరవాణి:08682-224642; అరుణ, 21, ఇ.డబ్ల్యు.ఎస్.హెచ్., హెచ్.బి.కాలనీ, రాజీవ్‌పార్కు, నల్లగొండ-508 001. సంచారవాణి:9848656808-9346359268. విశాలాంధ్ర, నవోదయ, ప్రజాశక్తి, సహచర అంగళ్ళలో లభించును.

ఆంధ్ర బౌద్ధ భాష్యకారుడు ప్రొఫెసర్ పి.లక్ష్మీనరసు (వ్యాసావళి) టి.రవిచంద్, 1/8 డెమ్మీ, 90 పుటలు, వెల: రు.30/-. మిళింద ప్రచురణలు 1994-2004 దశాబ్ది ప్రచురణ. ప్రథమ ముద్రణ: డిసెంబరు 18, 2004. ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకాల అంగళ్ళలోను.

భర్తృహరి సుభాషితాలు ఎన్.వి.బ్రహ్మం, 1/8 డెమ్మీ, 72 పుటలు, వెల: రు.40/-. కాలజ్ఞాన ప్రచురణలు: మనీషా విద్యావిహార్, చీరాల-523 155. ప్రథమ ముద్రణ: మార్చి 2005. *

ప్రజాసాహితి ప్రత్యేక సంచిక 2005 గురించి

ప్రధానాంశం:

గ్రామీణ సంక్షోభం-రైతాంగ ఉద్యమం

సంచిక: 277 సెప్టెంబరు/అక్టోబరు 2005

ఏనాడో ప్రారంభమైన వలస, సామ్రాజ్యవాదం ఈనాటికి ప్రపంచీకరణ అవతారమెత్తి గత 15 సంవత్సరాలుగా మన ప్రజానీకపు మూల్గుల్ని పీల్చుతోంది. దీని దుష్ప్రభావ ఫలితంగా గ్రామీణ జీవితం ఛిద్రమవుతోంది. ఈ విధ్వంసంలో భాగంగా మధ్యతరగతి, పేద రైతులు, రైతుకూలీలు, చేతివృత్తుల జీవనం మరింత సంక్షోభపు సుడిగుండంలో చిక్కుకుంది. పట్టణాలకు వలస కూలీలుగా అభద్రతలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆత్మాభిమానం చంపుకోలేనివారు తమను తామే చంపుకుంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ప్రపంచబ్యాంకును, ప్రపంచ వాణిజ్య సంస్థను, అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (డబ్ల్యు.బి-డబ్ల్యు.టి.వో.-ఐ.ఎం.ఎఫ్)లను అడ్డంపెట్టుకుని బహుళజాతి కంపెనీల దోపిడీని ప్రపంచ పోలీసుగా వున్న అమెరికా సామ్రాజ్యవాదం తీవ్రతరం గావిస్తోంది. బడుగు దేశాలను అణగదొక్కుతోంది. అందులో భాగంగా కొనసాగుతున్న భూస్వామ్య వ్యవస్థ మరింత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది.

ఈ నేపథ్యంలో గ్రామీణ సంక్షోభపు బహుముఖ వ్యక్తీకరణలను, కథ, కవిత, వ్యాసం,నవల, నాటిక, గల్పిక తదితర సాహిత్య రూపాలలో రచనలను ప్రజాసాహితి ప్రత్యేక సంచికను ఆహ్వానిస్తున్నాం.

1. నిర్దిష్ట ప్రాంతీయ జీవన సంబంధాలను-రాయలసీమ, తెలంగాణా, కోస్తా, ఉత్తరాంధ్ర రైతాంగపు జీవితాలను-తమవైన భాషా పలుకుబడులతో రచనలుండవచ్చు.
2. రైతాంగమంటే వ్యవసాయకూలీ జనులతోసహా అనీ, గ్రామీణ సంక్షోభమంటే చేతివృత్తుల జీవనం కూడాననీ మా భావం.
3. ఈనాటి కార్పోరేట్ వ్యవసాయం, కొత్త భూస్వామిక దోపిడీ రూపాల చిత్రీకరణ, గూడుకడుతున్న నిరసనపై రచనలు.
4. భూస్వామ్య వ్యవస్థకూ-కులవ్యవస్థకూ గల విడదీయలేని సంబంధాన్ని బలంగా వ్యక్తం చేయగల రచనలు కావాలి.
5. వ్యవసాయక విప్లవ అవగాహనతో సంఘటిత రైతాంగ ఉద్యమం ఈనాటి చారిత్రక అవసరం. ఆ దిశగా రచనల మొన వుండాలని మా సూచన.
6. కూలి-కౌలు-సాగునీరు-తాగునీరు-నాములు-వడ్డీలు-గిట్టుబాటు ధరలు- ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు, నాణ్యత, మిగులు భూములు-దున్నేవానికే భూమి-ఒక్కమాటలో రైతుకూలీ ఉద్యమావశ్యకతను జీవన వాస్తవికతను చిత్రించే రచనలు పంపవచ్చు.

7. రైతాంగ పోరాటాలు-ఉద్యమాలూ-త్యాగాలూ-గెలుపోటములూ- సంస్కరణవాదులూ-వ్యక్తిగత హింసావాద దుష్ఫలితాలూ...సాహిత్య రూపాలతో వ్యక్తమైన జీవన సంఘర్షణపై విశ్లేషణా-విమర్శా- పరామర్శలకు మా ఆహ్వానం.
8. సామ్రాజ్యవాదశక్తుల ఆర్థిక-రాజకీయ-సాంస్కృతిక ప్రభావం యొక్క పరిణామక్రమం-వర్తమాన ప్రపంచీకరణ దాకా.... గ్రామీణ జీవనంపై వలస బతుకులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలతో కూడిన కొత్త రచనలు పంపవచ్చు. పాత రచనలను విశ్లేషించవచ్చు.
9. రాజ్యవ్యవస్థ యొక్క ప్రజా వ్యతిరేక-ముఖ్యంగా రైతాంగ వ్యతిరేక- తత్వాన్ని బహిర్గతపరిచే రచనలు.
10. పై దృక్పథం పరిధిలోని పాత కథలూ- ఇతర భాషా సాహిత్యాలను మాకు పంపటమూ, సూచించటమూ చేయవచ్చు.
11. రచనలు సెప్టెంబరు 2005 మొదటి వారంలోగా మాకు అందినవి మాత్రమే పరిశీలించగలం.

రచనలు పంపవలసిన చిరునామాలు:

కొత్తపల్లి రవిబాబు
ప్రజాసాహితి
ఐతానగరం
తెనాలి-522 201.

నిర్మలానంద
ప్రజాసాహితి
18-747/11/40
బాగ్‌లింగంపల్లి
హైదరాబాదు-500 044.

(6వ పేజీతరువాయి) అజ్ఞానులేం కాదు. తెలిసి తెలిసి లొంగుబాటు విధానాలను అమలుపరుస్తున్నారు. అంతే!

కాంగ్రెసు వారి బ్రిటీషు అనుకూల దళారీ స్వభావాన్ని భగత్‌సింగ్‌లాంటి దేశభక్తులు ఏనాడో కనిపెట్టి ప్రజల్ని హెచ్చరించారు.

"కాంగ్రెసు ఉద్యమం వల్ల ఫలితాలు, వైఫల్యాలు, శక్తి సామర్థ్యాల గురించి మనసులో ఎలాంటి భ్రమలు ఉంచుకోరాదు...ఇది స్వాతంత్ర్యాన్ని సమర్థించేదికాదు. పైగా భాగస్వామ్యాన్ని కోరుతోంది...సంపూర్ణ స్వరాజ్యానికీ, భాగస్వామ్యానికీ పొత్తు కుదరదు. అవి పరస్పర విరుద్ధ విషయాలు" (1931-ఫిబ్రవరి-**నా నెత్తురు వృథాకాదు**, పుస్తకం నుండి).

74 సంవత్సరాల క్రితం కాంగ్రెసు పార్టీ యొక్క విధానాల పర్యవసానాల గురించి షహీద్ భగత్ సింగ్ ఇచ్చిన అంచనాను ఈ నెల 8న బ్రిటను దేశంలో ప్రధాని మన్మోహన్ సింగ్ యిచ్చిన ఉపన్యాసపు సారాంశం ఖరారు చేసినట్టవలేదా?

ఈ కుహనా స్వాతంత్ర్యాన్ని నిజమైన స్వాతంత్ర్యంగా భ్రమపడుతున్న వారందరూ ఇకనైనా కళ్లు తెరిస్తేనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు.

"ఆగస్టు పదిహేను విద్రోహాన్ని విప్పి చెప్పనిరోజు
అన్నమయినా సహించదు నాకు" - (చెరబండరాజు)

- 24.7.'05

ఛాయరాజ్ 'దుక్ఖేరు" గురించి రెండు మాటలు...!

- డా॥ లక్ష్మీనారాయణ భట్టు

మనిషి, ప్రకృతికి సమాజానికి సంబంధం లేకుండా జీవించలేడు. మనిషికి ఉన్న మానవ సంబంధాల్లో జీవన వైరుధ్యాలను, సమాజంలోని వ్యవస్థీకృత సంబంధాల్ని వ్యక్తం చేయడానికి కవిత్వం ఓ ముఖ్య సాధనం. ఈ కవిత్వం చైతన్య వంతంగా ఉన్నపుడే సామాజిక రూపాన్ని సంతరించుకుంటుంది. అందుకే సామాజిక విశ్లేషణ లేకుండా కవి రచనగాని, కవిత్వం గాని వుండదు. అది గతితార్కికంగా భౌతిక వాదముతో కూడుకున్నదయితే ఆ కవిత్వం సమాజాన్ని పురోగామి పథంలో నడిపించ డమే కాకుండా విప్లవ కాంక్షను సమాజంలో వెదజల్లుతుంది.

ఛాయరాజ్‌గారు ఓ విప్లవ కవి. ఆయన కవితలన్నీ విప్లవ కవితలే అని చెప్పక తప్పదు. "శ్రీకాకుళం" అనే మొట్టమొదటి కావ్యంలోనే ఆయన తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడంటే అతిశయోక్తి కాదు. ఛాయరాజ్‌గారు "శ్రీకాకుళం" తరువాత ఎన్నో దీర్ఘకావ్యాల ద్వారా (నిరీక్షణ, గుమ్మ, బుదడు, తొలెరుక) ప్రజాసాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. "దుక్ఖేరు"లో వర్తమాన సామాజిక, ఆర్థిక, రాజకీయ గందర గోళాలతో వ్యవసాయం ఏ దశలోకి నెట్ట బడిందో వివరించారు.

కవిత్వానికి కవి ఎన్నుకునే వస్తువులే గీటురాళ్ళు. వర్తమాన ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యల్ని ప్రతిబింబమేగాక, విశ్లేషణా రూపమే "దుక్ఖేరు".

సమాజానికి సంబంధించిన చారిత్రక గమనంలో ఒక మహత్తర దశని గతితార్కిక భౌతికవాదంతో దుక్ఖేరులో ఆవిష్కరించారు. ఛాయరాజ్‌గారు ఎంత ప్రతిభావంతుడో, ఎంతటి విప్లవ కాంక్షా శీలియో రైతును జెండాకెక్కించి దుక్ఖేరును వెలువరించడమే నిదర్శనం. అందుకేనేమో "ఆలెన్ బాండ్ అనే రచయిత "The socialistic poets should have more technical equipments than other poets" అన్నాడు. ఇలాంటి ఉపకరణాలు ఛాయరాజ్‌గారి రచనల్లో పుష్కలంగా లభిస్తాయి.

ఛాయరాజ్‌గారు తన పీఠికలో "రైతుల దీనావస్థని చిత్రించని, శిల్పించని, గానం చెయ్యని కవులకు, కళాకారులకు అన్నం ఎట్లా సహిస్తుంది అని" ప్రశ్నిస్తుంటే పురాణాల్లో ప్రహ్లాదుని ప్రస్తావన గుర్తుకు రాక మానదు. "ఒకసారి తన తండ్రి అయిన హిరణ్య కశపునితో ప్రహ్లాదుడు ఇలా అంటాడు "హరినామస్మరణ చేయిని ఆ నాలుక నాలుకేనా... అది ఉన్నా ఏమి ప్రయోజనం" అంటూ తన తండ్రి యొక్క హరిద్వేషాన్ని ఈసడిస్తూ అసహ్యించుకుంటాడు. అందుకే రైతులకు అన్యాయం చేస్తున్న దుష్టశక్తుల్ని శాపనార్థాలు పెడుతూ వాటి నాశనాన్ని గానం చేస్తానని ప్రతినబూని యిలా అంటాడు "ఆగ్రహాగ్నిలో మన్నును పుష్పింపజేయడానికి దుఃఖోగ్ర జ్వాలల్ని తాపిన నాగళ్ళను శృతిచేస్తు న్నానని చెప్పడంలోనే ఇమిడిపోయింది... ఛాయరాజ్‌గారి విప్లవకాంక్ష...! అందువల్లే!

దుక్కి కన్నా పేజీలు గొప్పవి కాదని, నాగలికన్నా కలం గొప్పదికాదని చెబుతూనే ఇంకోవైపు నుండి కలంలోనికి 'రైతును' నింపి కార్యంలోనికి 'కాడె'ను దించాడు-దించి ఊరుకున్నాడా! నాగళ్ళను దండయాత్రకు పురిగొల్పాడు. అంతేకాదు "కర్రులు చట్ట వ్యతిరేకులై కమతాలను ముట్టడించాలని ఓ గొప్ప విప్లవ సందేశాన్ని మనకందించాడు.

ఇదిగో నూకనూ-నూలును సమాజ రక్తానికందించే నాగళ్ళకు చేతులెత్తి నమస్క రిస్తున్నాడు-కూకటివేళ్ళతో దుఃఖాలను పెకిలించవేయమని నాగళ్ళను ఉసిగొల్పు తున్నాడు. ఛాయరాజ్‌గారిలో విప్లవకాంక్షను నిరూపించడానికి యింతకన్నా ఏమి ఋజువు కావాలి...

గిట్టుబాటుధరలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న అవస్థల వ్యవస్థను ఎంద్ర కాయ వీపుమీది చారలతో పోల్చి ఆ ధరలు ఎలా నేలవాలిపోయాయో కళ్ళకు కట్టినట్లు చూపించాడు.

'బోరులో నీరులేదు, వర్షాలు లేవు-దాహం-దాహం ఎవరిదీ ద్రోహం' అంటూ ప్రభుత్వాలవైపు స్వార్థ రాజకీయాలవైపు వేలెత్తి చూపుతున్నాడు.

ఛాయరాజ్‌గారు రైతును జెండాకెత్తి రైతు సమస్యల్ని ఎజెండా జేసుకుని "దుర్భర జీవితం నుండి వెలువడుతున్న మూలుగుల కన్న అర్థవంతమైన భావవ్యక్తీకరణ ఉంటుందా?" అంటూ రచయితలను, కళా కారులను ప్రశ్నిస్తున్నాడు. రైతును గానం చేస్తూ పురోగామిపథంలో పయనించడం హర్షించదగిన విషయం. అంతేకాకుండా రచయితలను కార్యోన్ముఖులను చేయడానికి ఎంతో ఉద్వేగంగా యిలా అంటాడు "మట్టిని నాశనంచేసి, విత్తనాన్ని నాశనంచేసి, భూమిని -భూమి చెమ్మను నాశనంచేసి రైతు శ్రమ శక్తిని నిర్వీర్యంచేసి రైతులను ఆత్మహత్యలకు పురికొల్పే దుర్మార్గమయిన విషయాన్ని బట్టబయలు చేసేది ఎవరు? రచయితలు, కళాకారులు కాకుంటె" అని నిలదీస్తూ చెంపచెళ్ళుమనిపించాడు.

అందుకే ఛాయరాజ్‌గారు

"ఉష్ణోగ్రతల నుండి విద్యుద్దీపాలను వెలిగిస్తున్నాడు" దుఖ్ఖేరులో చూడండి.

సాలును మీటి రసవత్తరమయిన సంగీతాన్ని సృజించే నాగలిని శృతి చేసుకుంటున్నాడు విందాం రండి-

మణికట్లకు మువ్వలు గట్టి మట్టి పుష్పాలు మనకందించాడు తీసుకోండి... దుఖ్ఖేరును అందుకోండి. రైతాంగాన్ని ఆదుకోండి!

దుఖ్ఖేరు వస్తువు ఎంతో బాగున్నప్పటికీ, శిల్పసౌందర్యం ధారాళంగా నడిచినప్పటికీ ఉత్తరాంధ్ర పదాల సందోహంలో యితర ప్రాంతీయులకు కొంచెం యిబ్బందికరంగా ఉంది. వాటి అర్థాలు పేజీకి అడుగుభాగంలో యిస్తే బాగుండేది. (శ్రీకాకుళం కావ్యంలో అలా ఇచ్చారు.)

*

జనసాహితి ప్రచురణ

నా నెత్తురు వృథాకాదు

(భగత్‌సింగ్ రచనలు) మూడవ ముద్రణ

కొన్ని కొత్త రచనలతో

అనువాదం: నిర్మలానంద

1/8 డెమ్మీ, 304 పుటలు,

వెల: రు.60/-

ప్రతులకు:

మైత్రీబుక్‌హౌస్,

మసీదువీధి,కారల్‌మార్క్సరోడ్,

విజయవాడ-2

సాహిత్య లేఖలు:

బొల్లిముంత సాహిత్యం-విప్లవం

ప్రజాసాహితి జూలై సంచిక బొల్లిముంత శివరామకృష్ణగారిపై ప్రత్యేక సంచికగా రావటంతో శీర్షికలన్నీ ఆసక్తితో చదివాను. నా కంటె ముందు నుండి ప్రజాసాహితి పాఠకునిగా ఉన్న మా మిత్రుడూ, నేనూ ఈ పత్రిక గురించి కలసినప్పుడల్లా అంతో యింతో చర్చించుకోకుండా వుండం. ప్రత్యేక సంచిక కనుక కొంత ప్రత్యేకంగానే మాట్లాడుకున్నాం.

బొల్లిముంత చనిపోయి నెల తిరక్కుండానే పత్రికను ప్రత్యేకంగా తీసుకురాగలగటాన్ని నేను ప్రశంసాపూర్వకంగా మా మిత్రుని దగ్గర ప్రస్తావించాను. "ఇది వాళ్లకు మొదటిదేం కాదు. గతంలో రావిశాస్త్రి, కె.వి.ఆర్, కాళోజీలు చనిపోయి నెల తిరక్కుండానే వారిపై సంపాదకీయాలతోసహా ప్రత్యేక సంచికలు తీసుకు వచ్చారు. ఆ ఒరవడి ప్రజాసాహితి వారికి ప్రత్యేకమైంద"న్నట్టుగా చెప్పాడు.

"తక్కువ సమయంలో తీసుకురావటంవల్ల ఒకోసారి లోతైన, సమగ్రమైన విశ్లేషణకు అవకాశం తగ్గుతుంది గదా! ఉదాహరణకు ఈ సంచికలోనే "మృత్యుంజయులు" నవలపై వచ్చిన సమీక్ష పరిచయంలాగా వుందనీ లోతైన విశ్లేషణ లేకపోయింది గదా?" అన్నాను.

"ఏ రచయిత గురించయినా ఒక ప్రత్యేక సంచికే సర్వసమగ్రం కాదు. అది కొనసాగవలసిన సాహిత్యాన్వేషణా, పరిశోధనగా వుంటుంది. వేగంగా వచ్చినందువల్ల రచయిత స్మృతుల్ని అందరి హృదయాల్లో వెలిగించినట్లవుతుంది. అవి భవిష్యత్తు పరిశీలకులకు స్ఫూర్తివంతంగా ఉండటానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఇక్కడ కూడా జరిగిందదే" అన్నాడు.

చర్చ బొల్లిముంతపై శ్రీకాంత్ రాసిన వ్యాసం వైపు మళ్లింది. "తెలంగాణా పోరాటంలో ఆయన తుపాకీ పుచ్చుకుని నిజంగా పోరాడాడా? అని అనుమానాన్ని వ్యక్తం చేశాను నేను. "కొడవలి పుచ్చుకుని కోతలు కోసినవాడే వ్యవసాయదారుడా?" అన్నాడు మా మిత్రుడు. "కాదనుకో! కానీ కోతలు కోసినవారిలో ఉన్నాడని శ్రీకాంత్ మోతగా రాశాడు గదా" అన్నాన్నేను.

"ఇప్పుడొక మానియా తయారయింది, విప్లవం అంటే తుపాకీ పుచ్చుకోవటమేననీ, ఏదున్నా లేకున్నా తుపాకీ శరీరంలో భాగం చేసుకున్నాడన్నట్టుంటేనే విప్లవకారుడనీ! దీన్నే మీడియాతోసహా విప్లవ వ్యతిరేకులు కూడా బ్లో అప్ చేస్తున్నారు. ఈ ప్రభావం చాలామంది మీద వుంది. అందుకే తుపాకి పుచ్చుకున్న పోరాటంలో పాల్గొన్నవాడంటే తుపాకీ పుచ్చుకున్నాడన్న భావం విపరీతంగా వ్యాపించింది. నిజానికి సాయుధ పోరాటం అంటే వర్గ పోరాటం యొక్క అత్యున్నత రూపం. ఆ స్థితి రావటానికీ, కొనసాగటానికీ విస్తృతమైన, బహుముఖమైన, లోతైన కృషి చాలా చాలా వుంటుంది. భావజాలరంగం, సాంస్కృతికరంగం కూడా అందులో భాగమే. విప్లవం దిశగా సాగించే కృషిలో నిమగ్నమైన వారెవరైనా విప్లవకారులే. విప్లవం యొక్క విరాట్ స్వరూపాన్ని అర్థం చేసుకోలేనివారందరూ తుపాకీనే విప్లవానికి పర్యాయపదంగా భావించి వ్యాఖ్యానం చేసుకుంటున్నారు. ఇది కవిత్వంలో కొంత చెల్లుబాటు కావచ్చుగానీ వాస్తవంలో ప్రతికూల ప్రభావం కలిగిస్తుంది. ఈ తుపాకీ సంస్కృతి విప్లవానికి

నష్టం కలిగించేదే తప్ప ప్రయోజనం చేకూర్చేదికాదు. బొల్లిముంత శివరామకృష్ణగారు రాసిన "మృత్యుంజయులు" నవల ఒక్కటి చాలు ఆయన్ని ఆనాటి విప్లవకారుల జాబితాలో చేర్చటానికి" అన్నాడు.

"చల్లపల్లి జమీందారుకు వ్యతిరేక పోరాటంలో ఆయన పాల్గొన్నట్టు రాసింది కూడా అంతే అవుతుందా" అన్నాన్నేను.

"ఆ రోజుల్లో ఆయన తెనాలి తాలూకాలో ముఖ్యకార్యకర్తల్లో ఒకడు. చల్లపల్లి జమీందారీ గ్రామాలు భౌగోళికంగా ఒక్క దివిసీమలోనే లేవు. కృష్ణానదికి పడమటన గల తెనాలి, రేపల్లె ప్రాంతాల్లో కూడా వున్నాయి. గాజుల్లంక, పోతార్లంక తదితరాలు అట్లాంటివే. ఆ ఉద్యమ నిర్మాణ కృషిలో రహస్యంగానో, పరోక్షంగానో ఆయన పాల్గొని వుంటే చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా పోరాడినట్టు కాదా?" అన్నాడు.

"1967 ఎన్నికల్లో బొల్లిముంత శివరామకృష్ణ సి.పి.ఐ. అభ్యర్థిగా, మోటూరు హనుమంతరావు సి.పి.ఎం. అభ్యర్థిగా ఇద్దరూ కాంగ్రెసు అభ్యర్థుడైన చల్లపల్లి జమీందారుపై, బందరు పార్లమెంటు సీటుకోసం పోటీ చేసినప్పుడు, మోటూరుని జమీందారు దగ్గర ఉద్యోగం చేసినవానిగా ప్రచారం చేసినట్టు శ్రీకాంత్ రాశారు. ఆ విధంగా మోటూరిని చులకన చేయటం తప్పుకాదా?" అని ప్రశ్నించాను.

"మోటూరి హనుమంతరావు కమ్యూనిస్టు కార్యకర్తగా మారకముందు చల్లపల్లి కోటలో కొద్దిపాటు ఉద్యోగం చేశాడు. నిజమే. జమీందారుకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికీ, తెలంగాణా పోరాటానికీ ఆనాటి గుంటూరుజిల్లా పార్టీ బాధ్యునిగా ఆయన చాలా కృషి చేశాడు. భూస్వామి తరిమెల నాగిరెడ్డి (నాగిరెడ్డి తండ్రి)పైన వాళ్ల కుటుంబాలలో పాలేరుగా పనిచేసిన బోయ ముత్యాలప్పను 1949లో జరిగిన జిల్లా బోర్డు ఎన్నికలలో సింగనమల ఫిర్కాలో ఆనాడు పోటీ పెట్టారు. అది కూడా వర్గ పోరాటంలో భాగమే. మోటూరి హనుమంతరావు జమీందారు కోటలో ఉద్యోగే కానీ, ఏజెంటు కాదు గదా! శ్రీకాంత్, ఆనాటి చౌకబారు ఎన్నికల ప్రచారానికి కనీసం విచారమన్నా ప్రకటించి వుండాల్సింది" అన్నాడు మా మిత్రుడు.

మొవ్వ ముత్యాలు   హైదరాబాదు

2

జూలై 'ప్రజాసాహితి'లో బొల్లిముంత గురించి శ్రీకాంత్ వ్యాసం చదివాక ఈ అంశాలు రాయాలనిపించింది.

"చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో స్వయంగా పాల్గొన్నారు" అని రాశారు శ్రీకాంత్. ఆ పోరాటంలో బొల్లిముంతగారు పాల్గొనలేదని మేమనుకుంటున్నాం. ఈ సమాచారం ఎక్కడ సేకరించారో శ్రీకాంత్ వివరిస్తారా?

అల్లాగే తెలంగాణా పోరాటం గురించి నవలలు, కథలు, గేయాలు రాసిన రచయితలు (కోస్తా ప్రాంతంవారు) ఎవరూ కూడా (ఉదా: సోమసుందర్, గంగినేని, బొల్లిముంత) తుపాకి పట్టుకుని సాయుధ పోరాటంలో పాల్గొనలేదని గుర్తు. అయితే తెలంగాణా సాయుధ పోరాట స్ఫూర్తిని సమర్థవంతంగా రచించినది మాత్రం వాస్తవం.

కొడవటిగంటి కుటుంబరావు రచన 'పిల్లి' కాదు. 'పిల్లి కథ' (అభ్యుదయ, 1946 డిసెంబరు) మీద బొల్లిముంత ఎందుకు విరుచుకుపడ్డారు? 'నగారా'లో సాగిన వాద వివాదాలు అచ్చులో అందజేయమని శ్రీకాంత్‌గారిని సవినయంగా కోరుతున్నాను.

ఆచార్య ఆత్రేయకి 'ఘోస్ట్'గా బొల్లిముంత 'కలిసి వుంటే కలదు దుఃఖం', 'కలిమిలేములు' లాంటి చిత్రాలకి రచన చేశారని రాశారు.

'కలిసి వుంటే కలదు దుఃఖం' సినిమాకి మాటలు రాసింది సదాశివబ్రహ్మం. 'కలిమిలేములు' చిత్రానికి మాటలు రాసింది గోపీచంద్. గోపీచంద్‌కి నేను అసిస్టెంట్‌గా పనిచేశాను కూడా.

పాత సంగతులు రాసేటప్పుడు వాస్తవాల గురించి శ్రద్ధవహించడం సాహిత్య ప్రపంచంలో మరింత అవసరం. అభిప్రాయాలు ఎవరివి వారివే. విభేదాలుండవచ్చు. వాదించుకోవచ్చు. కాని వాస్తవాలు అలా కాదు గదా! వాటి మీద వాదాలుండవు. సత్యమొక్కటే గీటురాయి.

15.07.'05 – చలసాని ప్రసాద్

3

బెంగాల్‌లో ఉత్తమ కవిత్వం చిన్న పత్రికల్లో వస్తోంది. ఉద్యమాలు లేకపోవడంవల్ల ఇక్కడి కవితా వస్తువు నిశ్శబ్దంగా, మార్మికంగా ఉంది. జై గోస్వామి, శ్రీజాత్ ఇక్కడి ప్రముఖ కవులు. వీళ్లలో జై గోస్వామి ఆనంద్ బజార్ గ్రూపులో సబ్ ఎడిటర్‌గా ఉంటున్నాడు. మే 9, 2005న రవీంద్రనాథ్ ఠాగూర్ జన్మదినం. ఆ రోజు నేనుంటున్న హర్‌పూర్‌లో కవితా సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నారు. నన్ను ముఖ్యఅతిథిగా పిల్చారు. మన తెలుగు కవిత్వం, దాని స్ఫోరకశక్తి ఇక్కడి వాళ్లకి విభ్రమం కలిగిస్తూ ఉంది.

బహుశా భారతదేశమంతలోనూ ఒక తెలుగులోనే ఉద్యమపరంగా ఉత్తమ కవిత్వం వస్తున్నదేమో అనిపిస్తోంది. మనకి భారతి లైన్సులో ఒక మంచి సాహిత్య పత్రిక అవసరం ఉంది. ఎన్నో సంవత్సరాలు ప్రజాసాహితి నా కవితలు ప్రచురించి నన్నొక కవిగా -ప్రజాకవిగా తీర్చిదిద్దింది. ఆ రకంగా ప్రజాసాహితి కి నేనెంతో ఋణపడి ఉన్నాను.

మళ్లీ ఆ తల్లి నన్ను ఒడిలోకి తీసుకొని ఆదరిస్తుందా?

విజయచంద్ర **పశ్చిమబెంగాల్**

4

గత సంచికలలో అరసవిల్లి కృష్ణ రాసిన 'ఆడిపాడిన తోట' కథ చదివాను. చాలా బాగుంది. తరిగిపోతున్న బాల్యాన్ని, సంతోషాల్ని చక్కగా ఆవిష్కరించిన కథ. సామాజిక దురాచారాలపై నిరసన పెంచే చైతన్య ప్రేరిత కథ. ఇటువంటి మంచి కథలు ప్రచురిస్తున్న "ప్రజాసాహితి" కి అభినందనలు. ప్రజాసాహితి ప్రతి పేజీ ఎంతో విలువైన చైతన్యాన్ని ప్రేరేపిస్తోంది.

షేక్ కరీముల్లా **వినుకొండ**

చైతన్య వాహిని

9.7.2005న రాజమండ్రి గౌతమి గ్రంథాలయంలో వైజ్ఞానిక గ్రంథాల, ఛార్టుల ప్రదర్శన సందర్భంగా సాయంత్రం ఏర్పాటు చేసిన గోష్ఠిలో సివి.సర్వేశ్వరశర్మ, జమ్మికోనేటిరావు, రెడ్డి రాఘవయ్య, బొర్రా గోవర్ధన్, పసల భీమన్న, గద్దె రామమూర్తి, వెలగా వెంకటప్పయ్య, రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు, గంధం అప్పారావు, రాజు, మాదిరాజు గోవర్ధనరావు, కత్తుల ఆనందరావు, కొత్తపల్లి రవిబాబు మొదలగు శాస్త్ర విజ్ఞాన గ్రంథ రచయితలు, ప్రచురణకర్తలు, సంపాదకులు మాట్లాడారు. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ గోష్ఠికి అనుసంధాకులుగా వ్యవహరించారు.

విజ్ఞానశాస్త్ర గ్రంథాలు భారతీయ భాషలలో చాల తక్కువగా వస్తున్నాయనీ, గత 5, 6 ఏళ్ళ కాలంలో 500 పుస్తకాలు కూడా రాలేదనీ, సైన్స్ అకాడమీ నామమాత్రంగా వుందనీ, పుస్తకాల షాపుల్లో సైన్సు పుస్తకాలడిగితే జ్యోతిష్యం, వాస్తు పుస్తకాలు చూపిస్తున్నారనీ, యువకులు సైన్సు పుస్తక రచనకు పూనుకోవాలనీ వక్తలు మాట్లాడారు. కొత్తపల్లి రవిబాబు తన ప్రసంగంలో, "శాస్త్ర విజ్ఞాన గ్రంథాలు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించకపోతే, అటువంటి సైన్సు గ్రంథాలు తమ లక్ష్యాన్ని కోల్పోయినట్లే. గ్రహణాల మీద పుస్తకం రాసిన రచయితా, అది చదివిన పాఠకుడూ తన నిత్యజీవితంలో గ్రహణం సందర్భంగా గ్రహణ స్నానం చేసినట్లైతే ఆ పుస్తకం శాస్త్ర విజ్ఞాన గ్రంథం కాజాలదు. శాస్త్ర విజ్ఞాన గ్రంథాలు రచయితల్లో పాఠకుల్లో శాస్త్రీయ అభినివేశాన్ని పెంపొందించాలి" అన్నారు.

నెల్లూరులోని మణి బుక్ స్టాల్ ఆధ్వర్యంలో స్థానిక కె.టి.పి. హాల్‌లో 10.7.'05 ఆదివారం ఉదయం 11 గంటలకు సాహిత్య సభ జరిగింది.

ఈ సభను నిర్వహించిన ప్రజాసాహితి సంపాదకవర్గ సభ్యులు దివికుమార్ మాట్లాడుతూ-

రచయితలంటే సామాజిక చరిత్రకారులనీ, జీవితాలను, ఆలోచనలను, సంస్కృతి, సాంప్రదాయాలను అర్థవంతం గావించే విధంగా రచనా వ్యాసంగాలను కొనసాగిస్తారనీ, రచయితలు మనో ప్రపంచ నిర్మాతలనీ, రచనకు సాహిత్యపరమైన పరమార్థము వుండాలనీ అన్నారు. సమాజంలోని సంఘర్షణలను సాహిత్యం ప్రతిబింబించాలన్నారు.

మానవ జీవిత మూలాలను తెలుసుకోవడానికీ, అధ్యయనం చేయటానికి స్వేచ్ఛ కావాలి. ఆ స్వేచ్ఛ నుండి సామాజిక అభివృద్ధికి దోహదపడేందుకు సాహిత్య సృజన చేయవలసి వుంది. సమాజాన్ని ముందుకు నడిపించడానికి దోహదపడడమే సాహిత్యం యొక్క అర్థం, పరమార్థం అన్నారు.

సాహిత్యంలో వస్తువు ప్రధానమైనదని, వస్తువును అర్థవంతం చేసేదే శిల్పమని, సాహిత్యం సామాజిక ప్రయోజనం నిమిత్తమే వుండాలన్నారు. సాహిత్యం సామాజిక సంఘర్షణలను వేగవంతంచేసి సామాజికాభివృద్ధికి దోహదపడాలన్నారు. రచయితలు, అధికార, పాలకవర్గ రాజకీయాలపై ప్రతిపక్షంగా వ్యవహరించి ప్రజలపక్షాన, శ్రామికుల పక్షాన నిలవాలన్నారు.

ఈ సభకు ముఖ్యఅతిథిగా వచ్చిన ప్రముఖ రచయిత, సాహితీ విమర్శకులు పాపినేని శివశంకర్ మాట్లాడుతూ-

సమాజానికి, సాహిత్యానికి మధ్య అవినాభావ సంబంధం వుందనీ కవి, రచయిత జీవన సారాన్ని ఆకళింపు చేసుకొని సాహిత్యీకరించాలని, అప్పుడే సాహిత్యం గుబాళిస్తుందన్నారు. సాహిత్యం సమాజంతో ఆదాన ప్రదానం కలిగి వుంటుందన్నారు. భారతదేశ రాజకీయాలలో అన్ని పార్టీలు ఒకే భావజాలం కలిగి వున్నాయన్నారు. అధికారాన్ని ఎలా హస్తగతం చేసుకోవాలన్నది వారి భావజాలమన్నారు.

సమాజంలో రైతాంగ ఆత్మహత్యలు ఒకవైపు, పట్టణాలలో రెండవ వైపు ఎస్టేట్‌లుగా ఎస్టేటులుగా పెరిగిపోతున్న రియల్ ఎస్టేట్ రంగం సమాజానికి గమనాన్ని ఏ దిశలో నిర్దేశిస్తున్నదో అర్థం చేసుకోవాలన్నారు. ఉత్పత్తి ప్రక్రియకు-సమాజానికి సంబంధంలేని నమూనా అంతర్జాతీయంగా తయారవుతూ, ఈ నమూనాను ప్రపంచబ్యాంక్, ఐ.ఎం.ఎఫ్, డబ్ల్యు.టి.ఓ.లాంటి ఏదో ఒక సంస్థ నిర్దేశిస్తున్న ఈ పరిస్థితుల్లో రచయిత యొక్క బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇక్కడ పంటలు-విత్తనాలు ఏవి ఎన్నుకోవాలో కూడా మరెక్కడో (అంతర్జాతీయంగా) నిర్దేశితమవుతున్నాయి.

మనుషుల మధ్య బంధాలు, సంబంధాలు మారిపోతున్నాయని, అభివృద్ధి అంటే బ్రహ్మాండమైన రోడ్లు, భవనాలే అనుకుంటున్న, అవి నమ్మిస్తున్న సమాజంలో మనం ఎందుకు ఆనందంగా వుండలేకపోతున్నామో తెలుసుకోవాలి. సమాజంలోని ఈ ఒడిదుడుకులను సాహిత్యం పరిశీలించాలని, పరిగణనలోనికి తీసుకోవాలని, అనుసృజన చేయవలసిన అత్యంత సామాజిక బాధ్యత రచయితపై వుందన్నారు. చదువుల్లో పోటీతత్వానికి కవులు వ్యాఖ్యానిస్తూ జీవితంలో గెలుపు, ఓటములు అనివార్యమని, జీవితరంగానికి పోటీలేదని, జీవితమే ఒక కళ అని 'బోర్న్ టు లివ్' అనే సూత్రాన్ని ఆచరించాలని అన్నారు.

కవులు, రచయితలు అభివృద్ధి నిరోధకమైన విలువలను నెట్టివేసి విశాల సామాజిక దృష్టికోణం నుండి రచనలు చేయాలన్నారు.

సభకు విచ్చేసిన ఆత్మీయ అతిథి, నెల్లూరుజిల్లా వాసి, కథా రచయిత మహమ్మద్ ఖదీర్‌బాబు మాట్లాడుతూ- నెల్లూరు సాహితీ సాహితి మిత్రులను కలవడానికి దాదాపు కథా రచయిత అయిన తరువాత 10 సంవత్సరాలు పట్టిందన్నారు. 1977లో మొదటి కథను వ్రాశానని, కథను ఎన్నుకోవడం ఎలా అని ఆలోచిస్తున్నప్పుడు మన జీవితమే, మన చుట్టూ అనుభవిస్తున్న జీవితాన్నే కథా వస్తువుగా స్వీకరించవచ్చునని తెలుసుకున్నానని. కథ అంటే మనమే, కథ మనం అనుభవించేది, చూసేది, తారసపడే వ్యక్తులు చెప్పేది కథ అని అన్నారు. మనం నడిచి వచ్చిన నేలను, మనం నిలబడిన నేలను గూర్చి వ్రాశానని, వ్రాయాలని అన్నారు. మనం పిల్లలను కని, కష్టపడి పెంచి, చదువులు చెప్పించి తెలివైనవాళ్ళగా తీర్చిదిద్ది అమెరికాకు అప్పగిస్తున్నామన్నారు. పై విధంగా తన కథా రచయితగా తొలినాళ్ళను గుర్తుచేసుకుంటూ తన రచనా వ్యాసంగాన్ని వివరిస్తూ సమకాలీన కథలగూర్చి చెప్పుతూ భావితరాల రచయితల కొరకు సూచనలిచ్చారు.

సభానంతరం జరిగిన సాహిత్య చర్చలో స్థానిక రచయితలు పి.జయప్రద, వి.ప్రతిమ, వి.పద్మావతి, డి.పద్మాకర్, పాయసం సుబ్రమణ్యం, సాహితీ ప్రియులు ఎ.సుబ్రమణ్యం, కె.శోభాదేవి, డి.ఎల్.సుహాసిని, తెలుగు భాషోద్యమ నాయకులు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, ఎన్.దశరథరామయ్య, డా॥ వెంకటేశ్వర్లు మొదలగువారు పాల్గొని, ఇలాంటి సాహిత్య సభలు జరగాలని ఆకాంక్షించారు. సమకాలీన సాహిత్య, సాంస్కృతిక రంగాలలో వస్తున్న అపశృతులను త్రోసివేసి అభ్యుదయ, ప్రగతికాముక సాహిత్యం రావాలని, ఇంకా కవులు, రచయితలు అభివృద్ధి కావడానికి ఈ సాహిత్య సభలు దోహదపడాలని ఆకాంక్షించారు. *

స్వీకారం

పునాదిరాళ్ళు మహేశ్వరపు నరేందర్‌రెడ్డి కవితా సంపుటి. 1/8 డెమ్మీ, పుటలు: 64, వెల: రు.40/- ప్రచురణ: శ్రీ లేఖ సాహితి, వరంగల్లు. ప్రచురణ సంఖ్య:55, 15 జూన్ 2005, ప్రతులకు: ఎమ్.రామచంద్రారెడ్డి, దమ్మన్నపేట (పోస్టు), వర్ధన్నపేట మండలం; వరంగల్లుజిల్లా -506 316. విశాలాంధ్ర, ప్రజాశక్తి, దిశ, నవోదయ.

కింద నేల ఉంది మహమ్మద్ ఖదీర్‌బాబు రాసిన కథ. 1/8 డెమ్మీ, పుటలు:32, వెల: రు.10/-. చూపు ప్రచురణ. జూన్ 2005. ప్రతులకు: 204, నీలాద్రి, సెవెన్ హిల్స్ అపార్ట్‌మెంట్స్, నిజాంపేట్‌రోడ్, హైదరాబాదు-500 072. దూరవాణి: 040-55960867. అన్ని ముఖ్య పుస్తక కేంద్రాలలో... (తరువాయి 55వ పేజీలో)

B67

వెండి పండుగ

- శ్రీశ్రీ

మత కలహాల మారణ హోమాల మధ్య
1947 ఆగస్టు 14-15 అర్ధరాత్రి
ఆవిర్భవించిన స్వాతంత్ర్యం
అవినీతిని భారీపరిశ్రమ చేసింది
ఆకలికి సార్వభౌమాధికారం ఇచ్చింది
ధన స్వామ్యానికి ప్రజాస్వామ్యం అని పేరుపెట్టి
పేదవాళ్ళను మరింత పేదలను చేసింది

ఇంకా ఈ స్వాతంత్ర్యం ఏమిటి ఒరగబెట్టింది?
ఆకలి చావులు, హరిజన దహనాలు
అప్పుడప్పుడు నరబలులు
వైజ్ఞానికుల ఆత్మహత్యలు
ఈ స్వాతంత్ర్యంలో
బాగుపడినవాళ్ళు పదిమంది ఉంటే
బాధపడుతున్న వాళ్ళు
పదివేలమంది
ఈ బాధల స్వభావాన్ని
బహిరంగ పరచడమే నిజాయితీగల
ఈనాటి కవుల ఏకైక కర్తవ్యం
(ఆలిండియా రేడియోలో టేప్ రికార్డ్ చేసిన గీతాల నుండి)

నిజం.నిజం,నిజం-విరసం ప్రచురణ. 15.8.1977 సౌజన్యంతో)

◆

KLUA101M)18 BC

AUGUST, 2005 Rs.10/-
Postal Regd.No:PMG/VJ/13-19/03 RNI NO. APTEL/1977/571

కవిత

నెమలీక

- కోసూరి రవికుమార్

98494
98884

దూసర గాలికి ఎగిరొచ్చిన
నెమిలీక కళ్ళను కప్పేసింది
పచ్చిక చచ్చి పాదాలతో పాపిట దీసినట్టున్న
బీడు మీది బాటలో నడుస్తుంటే
బొటనవేలు మీద కసుక్కున మందారం పూసింది.
ఎప్పటిదో పలకముక్క
నేలలోంచి సూటిగా గుచ్చి చూస్తోంది,
నాకెందుకో ఇంటికాడ ఇసిరి పారేసిన
బుడ్డోడి సిన్నప్పటి పుస్తకాల సంచీ గుర్తొచ్చింది.

ఆకలీ, అరెకరమూ... నా చేతకానితనమూ,
వాడి చదువును అటకెక్కించినై,
వాడి పద్దేలెంత ఇంపుగా వుండేవో
సందేళకు నులక మంచం కాళ్ళకట్టన
వాడు వేమనో, బద్దెనో అవుతా వుంటే
మసిబట్టిన కిరసనూనె బుడ్డీ దగ్గర
వుసిళ్ళు తోలతో ఎంత బెమతబడేదో ఎంకట నర్సమ్మ,
గొడ్ల కాడికి బోకపోతే కూడెట్టనంటే.
బుక్కుల సంచీలో పురుగు మందు సీసా బెట్టుకుని
బెదిరించిన వాణ్ణి గొడ్లెనుక గొడ్డును జేస్తెగాని
నిండుకున్న కడుపుల్లోకి పున్నీళ్ళు కూడా దొరకలేదు,
బిళ్ళంగోడీలూ, బెచ్చాలాటలూ, గాలిపటాలూ,
అన్ని వాణ్ణి మరిసేపోయినై,
వాడికిప్పుడు చెర్నాకోలే పిల్లంగోవీ,
చింతచెట్టు నీడే సలవచేసిన కొత్త చొక్కా

నెమిలీకై నా కంట్లో సలుపుతున్నది
దరిద్రం చేసిన వాడి ఒకటో తరగతి బుక్కే,
ములికై గుచ్చుకున్నది.
ఆకలి పగలగొట్టిన వాడి మట్టి పలకే
పల్లె చివర గొర్ల కాపులో వున్నది,
వాడి కొడుకే, బీడి మీది బాటలో,
ఇంకా వాడు బడికి దూరంగానే...
దూసరగాలికి దుమ్ములేపుతా
ఇంగ్లీసుబడి బస్సు పోతానే వుంది... అప్పుడూ ....ఇప్పుడూ

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA103M115
పుస్తకం పేరు	ప్రజాసాహితి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	485
వెనుక అట్ట	485
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	naveeda
పేజీలు విడదీసినది	Naveeda
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	haseema
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good